సంపుటి: 27
సంచిక: 2

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 45 రూపాయలు
శాశ్వత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

సెప్టెంబరు, 1978

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఎ. వీ. మోహన్నాథ్
విద్వాన్ షీలాదేవి

తొలిమాట

నమస్కారము. ఈ నెలకు మాకు మొత్తం 34గురు కార్టూనిస్టుల నుండి 647 కార్టూన్‌లు అందాయి. వాటిలో 23 కార్టూన్లు ప్రచారణామోదం పొందటం, వాటికి వెంటనే పారితోషకం పంపటం కూడా జరిగింది. అయితే కార్టూనిస్టులకు ఒక సూచన. కార్టూన్లు, జోక్స్ కేవలం క్రైమ్‌కు సంబంధించినవే పంపాలనే నియమం ఏమీలేదు. సమకాలీన పరిస్థితులకు సంబంధించినవి ఏవైనా వేయవచ్చును. కొత్తతరహా కార్టూన్లకు, కొత్తదనం వున్న వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

'హోమ్ డెలివరీ' సభ్యులు సమయానికి వూళ్ళో లేక పోవటంవల్లనో, మరేకారణం చేతనో వి.పి. తిరిగి వచ్చినప్పుడు వారి సభ్యత్వము రద్దు అవుతున్నది. ఇక మీదట అలా వి.పి. తిరిగి వచ్చినప్పుడు సభ్యులు వెంటనే ఆ నెల కాపీల పైకం రు. 7/-లు మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపాలి. అలా పంపితే, ఆ నెల కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము.సభ్యత్వము రద్దుచేయబడదు. ఈమార్పును సంభ్యులందరుగమనించాలి.

అనేకమంది పాఠకులు 'పాఠకుల ప్రశ్నలు' శీర్షిక తప్పనిసరిగా కావాలంటున్నారు. వారందరి కోరిక ననుసరించి వచ్చేనెల నుండి ఆ శీర్షికను తిరిగి ప్రారంభిస్తున్నాము. అయితే ఈ శీర్షిక ఒక పేజీకిమాత్రమే పరిమితం. కావున పాఠకులు తమ ముఖ్యమైన సందేహాలను, అందరికీ ఉపయోగపడే ప్రశ్నలను మాత్రమే పంపగోర్తాము.

సెలవా మరి——

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. బ్యాంకు దోపిడీ—విద్వాన్ షీలాదేవి
23. సర్పనగరనిధి—వసుంధర
42. అంతర్ధానం—సుసర్ల సర్వేశ్వరరావు
64. నేనెవరిని—పి. వి. సుధాకరరావ్
80 త్రిబులెస్—గీతారాణి
99. హత్యజరిగిన రాత్రి—కె. బి. యస్. కుమార్
135. దొంగతనంమా నాలిరా మాంవా!—లలితకుమారి
148. గండం గడిస్తే చాలు—మల్లిబాబు
181. అతీంద్రియ శక్తులు(సీరియల్)—రమణశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. శవరంజని—'సికిందర్'
47. వేషంచూసి మోసపోకండి!—వసుంధర
86. అంతులేని వింతశిక్ష!—సుసర్ల సర్వేశ్వరశాస్త్రి
130 దురభిమానులు—ఏ. వీ. మోహన్రావ్
164. అంగారక (సీరియల్)—శ్యాంబాబు.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, పాఠకుల పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, చెప్తే నమ్మరు, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు !!!

"ఎస్! ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్ హియర్!"

"కమీష్నర్ స్పీకింగ్! మౌంట్‌రోడ్లోని ధనలక్ష్మి బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో పది లక్షల దోపిడీ జరిగిందిట. ఇప్పుడే బ్యాంకు జనరల్ మేనేజర్నించి ఫోన్ వచ్చింది.

ఆ డబ్బు అక్కడి స్ట్రాంగ్‌రూంలో వున్న సేఫ్ బంకిం చంద్ సేఫ్టీ లాకర్‌లోంచి మాయమయిందిట. తక్షణం అక్కడికెళ్ళి దర్యాప్తు ప్రారంభించండి!"

"ఓ.కే. సర్!" అంటూ రిసీవర్ క్రెడిల్‌జేసి, లేచాడు ఇన్‌స్పెక్టర్.

సాక్షాత్తూ పోలీస్ కమీష్నర్ ఫోన్‌జేసి చెప్పాడు గనక సరిపోయింది. అదే వేరొకరై తే, ఏదో విట్టువిన్నట్టు విరగ బడి నవ్వేవాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్.

ధనలక్ష్మి బ్యాంకువంటి దుర్భేధ్యమైన బ్యాంకులో దోపిడీ జరగడమా?

నగరంలోని మిగతా బ్యాంకుల్లోకెల్లా తలమానికమైనది ధనలక్ష్మి బ్యాంకు. కారణం, అక్కడి స్ట్రాంగ్‌రూంలోని సేఫ్టీ లాకర్స్ అధునాతనమైన రీతిలో, మానవమాత్రుడికి దుస్సాధ్యమైన పద్ధతిలో రూపొందించబడ్డాయని ప్రతీతి.

ఆ స్ట్రాంగ్‌రూమ్ — బ్యాంకు అండర్‌గ్రౌండ్‌లో నిర్మించబడింది. అందులో దాదాపు ఏభై స్పెషల్ సేఫ్ లుంటాయి. అవన్నీ ఆధునిక విజ్ఞానాన్ని ఉపయోగించి, ప్రత్యేకంగా తయారు జెయ్యబడ్డాయి.

నగరంలోని మిలియనీర్స్ కొందరు ఆ సేఫ్‌లను అద్దెకు తీసుకుని, అందులో తమతమ డబ్బూ, నగలూ, వజ్రాలూ వగైరా దాచుకొంటూంటారు. అవసరమైనప్పుడల్లా వచ్చి, తీసుకుపోతూంటారు.

సేఫ్‌లను ప్రొవైడ్ జెయ్యడంవరకే బ్యాంక్‌వారి బాధ్యత. వాటిలోని వస్తువులతో వారికెలాటి సంబంధం లేదు. ఒక్కో సేఫ్‌కూ సాంకేతికంతో కూడిన రెండేసి తాళం చెవులుంటాయి.

ఒకటి కస్టమర్స్ దగ్గిరా, రెండోది బ్యాంకులోనూ వుంటాయి. అవి రెండూ జేర్చి, కోడ్‌నుపయోగిస్తే తప్ప సేఫ్‌ను తెరవడం దుస్సాధ్యం! ఆ కీస్‌కు డూప్లికేట్స్ వుండవు.

స్ట్రాంగ్‌రూంలో ప్రవేశం చాలా పకడ్బందీగా వుంటుంది. అండర్‌గ్రౌండ్ ఎంట్రెన్స్‌వద్ద ఇద్దరు గార్డ్సు రైఫిళ్ళతో నిలబడుంటారు. కష్టమర్స్ పాస్‌వర్డ్ చెప్పందే ఎట్టి పరిస్థితిలోనూ లోనికి వెళ్ళనివ్వరు!

లోపలి గదిలో ఓ ఆంగ్లోండియన్ యువతి ఆ స్ట్రాంగ్ రూం ఇంఛార్జిగా వుంటుంది. సేఫ్‌ల సెకెండ్ కీస్ ఆమె దగ్గిరుంటాయి. ఆమె బల్ల సొరుగులో ఎల్లప్పుడూ ఒక లోడెడ్ రివాల్వర్ రెడీగా వుంటుంది.

కస్టమర్ వస్తే ముందామెకు బైటినించి ఫోన్లో తెల్ప బడుతుంది. ఎవ్వరు రాబోతున్నదీ, వాళ్ళ కీ నెంబర్ ఏమిటీ మొదలైన వివరాలు తెలుసుకుని, ఆ కీ తీసి, సిద్ధంగా పెట్టు కుంటుందామె.

కస్టమర్ వచ్చి, కోడ్‌వర్డ్ చెప్పగానే అతన్ని స్ట్రాంగ్ రూంకు తీసికెళ్తుంది. అక్కడ అతని దగ్గిరున్న కీ తీసుకుని, రెండు కీస్‌తోనూ అతని సమక్షంలోనే సేఫ్ తెరుస్తుంది. అతని పని పూర్తయేవరకూ గది బైట నిల్చునుంటుంది.

తరవాత ఎప్పటిలా సేఫ్‌ను లాక్‌జేసి, అతని కీ ఇచ్చే స్తుంది.

చివరికి ఆ యువతినికూడా చెక్‌చేయందే, గార్డ్సు ఆమెను బైటికి వదిలిపెట్టరు.

బ్యాంక్ వర్కింగ్ అవర్స్‌లో తప్ప, మిగతా వేళల్లో స్ట్రాంగ్‌రూం ఒకరకం వింతవాయువుతో నింపబడుతుంది. ఆ వాయువు పీల్చినవాళ్ళు వెంటనే—మెదడు మొద్దుబారి, స్పృహతప్పి పడిపోతారు!

అంతేగాక, అండర్‌గ్రౌండ్ ఎంట్రెన్స్‌వద్ద కరెంట్ పాసవుతూ వుంటుంది. అది చాలదన్నట్టు స్ట్రాంగ్‌రూం గుమ్మంవద్ద బర్గ్‌లర్ అలారం అమర్చబడుంది. ఎవరైనా

దానిని తాకిన తక్షణం బ్యాంక్‌లోనూ, జనరల్ మేనేజర్ ఇంటివద్దా, పోలీస్ కంట్రోల్ రూంలోనూ ఒకేసారి మోగుతుందది!

ఏం జరిగిందో ఆగంతకుడు తెలుసుకునే లోపల, పోలీస్ వ్యాన్ అక్కడ ప్రత్యక్షమౌతుంది. అంత కట్టు దిట్టంగా వుండబట్టే ఎందరో ధనికులు నిర్భయంగా ఆ బ్యాంక్ వాల్ట్‌లను వాడుతూంటారు.

వాటిలో, కొన్ని కోట్ల ధనం వుండవచ్చని ప్రజల అంచనా. లోగడ ఒకటి రెండుసార్లు అక్కడ దోపిడీ ప్రయత్నాలు జరిగినా ఎవరూ లోనికూడా ప్రవేశించలేక పోయారు.

అటువంటి స్ట్రాంగ్‌రూం సేఫ్‌లోంచి పది లక్షలు మాయమయ్యాయా? అదే నిజమైతే, పోలీస్ కంట్రోల్ రూంలో అమర్చబడున్న బర్గ్‌లర్ అలారం ఎందుకు మోగలేదు?

చీమకూడా జొరబడలేని కట్టుదిట్టాలున్న స్ట్రాంగ్‌రూం లోంచి పది లక్షలెలా మాయమయ్యాయి? అనుకుంటూ ఆఫీస్‌లోంచి బైటపడి జీపెక్కాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావ్.

పావుగంటలో చేరుకున్నాడక్కడికి. సాధారణంగా దోపిడీలూ, ఖూనీలూ జరిగిన ప్రదేశాల్లో ఎక్కడలేని మందీ మార్బలం గుమిగూడి, పెద్ద గందరగోళంగా వుంటుంది.

బ్యాంకు ఆవరణలో అదేమీ లేక, పరిస్థితి చాలా నార్మల్‌గా వుంది. అతనికోసమే ఎదురుచూస్తున్నట్టు మెట్ల మీద, అసహనంతో అటూ ఇటూ పచార్లుచేస్తూ కనిపించాడు జనరల్ మేనేజర్ మృత్యుంజయరావు.

ఇన్‌స్పెక్టర్ని చూడగానే ప్రాణం లేచివచ్చినట్టు గబగబ జీపును సమీపించాడు.

అతనిద్వారా ఇన్‌స్పెక్టర్‌కు తెలిసిన వివరాలివి:

సేఠ్ బంకించంద్ కొద్ది రోజులక్రితం రెండు లక్షలు తీసుకువచ్చి, సేఫ్‌లోని తన ధనానికి కలిపాడు. కాని, ఈ రోజు ఏదో డబ్బవసరమై మళ్ళా వచ్చేసరికి, సేఫ్‌లోంచి పది లక్షలు మాయమయ్యాయని గ్రహించాడు.

అంతకన్నా విచిత్రం ఏమిటంటే, ఆ స్ట్రాంగ్‌రూమ్ ఇంఛార్జ్ అయిన మిస్ గ్లోరియాకూడా చెప్పా చెయ్యకుండా అదృశ్యమైంది, నిన్నటినించీ!

గ్లోరియాకు పాతిక సంవత్సరాలుంటాయి. తెల్లగా, ఆకర్షణీయంగా వుంటుంది. మూడు సంవత్సరాలుగా ఆ బ్యాంక్‌లో పనిచేస్తోందనీ, చాలా నమ్మకస్థురాలనీ, శాంత స్వభావురాలనీ చెప్పాడు మేనేజర్.

ఆమెకు నెలకు ఎనిమిది వందలు జీతం ఇస్తోందిట బ్యాంకు. ఆమె ఒంటరిగత్తె. తెలిసినంతవరకూ ఆర్థిక ఇబ్బందులేమీ లేవు.

"ఇన్‌స్పెక్టర్! ఈ విషయం బైటికి పొక్కితే, మా బ్యాంకు రెప్యుటేషన్ ఏమవుతుందో మీకు తెలియంది కాదు. అందుకే, ఈ వ్యవహారం ఎవ్వరికీ తెలీకుండా గుప్తంగా వుంచి, నేరుగా కమీష్నర్‌గారికి కాల్ చేశాను.

ఆ బంకించంద్ ముందే మార్వాడీ! గోడవ లేవదీస్తేట్టు న్నాడు. మీరెలాగైనా, సాధ్యమైనంత త్వరలో, ఆ డబ్బు ఎలా మాయమైందో, ఎవ్వరు కాజేశారో ఆరాతీసి, మా బ్యాంకు పరువు కాపాడండి!" అన్నాడు మృత్యుంజయ రావు ప్రాధేయపడుతూ.

"కేసు చాలా చిత్రంగా వుంది. లక్షలకు రెక్కలు



వచ్చినట్టు పక్షుల్లా ఎగిరిపోయాయంటారా?....సరే, ఓసారి నాకా స్ట్రాంగ్‌రూం చూపించండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అతన్ని అండర్‌గ్రౌండ్‌లోకి తీసికెళ్ళి, స్ట్రాంగ్‌రూం చూపించాడు మేనేజర్. అరగంటవరకూ అక్కడి సేఫ్‌లూ, అవీ క్షుణ్ణంగా పరిశీలించాడు ఇన్‌స్పెక్టర్.

తరవాత, అక్కడ కాపలా వుండే గార్డ్స్‌తోబాటు, మిగతా సిబ్బంది అందర్నీ తరచి తరచి ప్రశ్నించాడు. దాంతో కొన్ని కొత్త విషయాలు వెలికి వచ్చాయి. స్ట్రాంగ్ రూం ఇంఛార్జి అయిన మిస్ గ్లోరియాలో పది, పదిహేను రోజుల్నించీ ఏదో మార్పును గమనించారు అందరూ.

ముందే రిజర్వ్‌డ్‌గా, ముభావంగా వుండే ఆమె గత కొద్ది రోజుల్నించీ బాగా పరిచయమున్న వాళ్ళతోనూ సరిగా మాట్లాడడం మానేసింది. పలకరిస్తే పొడిగా జవాబిచ్చేది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించేది.

"ఆమె అడ్రస్ ఏమిటి?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ మానేజర్ని.

"హౌస్ నెంబర్ 3-1-146, పెరంబూర్!"

డైరీలో ఆ చిరునామా నోట్ జేసుకుని, క్రైంబ్రాంచి హెడ్‌క్వార్టర్స్‌కు ఫోన్‌చేసి, వెంటనే ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ను వెంటబెట్టుకుని రమ్మని చెప్పాడు సార్జంట్ విశ్వంతో.

అరగంటలోపల వచ్చారు వాళ్ళు.

ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ద్వారా, బంకించంద్ సేఫ్ మీది వేలిముద్రల ఫోటోలు తీయించి, వెంటనే వాటి ప్రింట్లు తీసి వుంచమనిచెప్పి సార్జంట్ విశ్వంతో జీపెక్కాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్.

2

అది చిన్నసైజు డాబా ఇల్లు. ఇంటి ముందు చిన్న కంపౌండ్. దానికో చెక్కగేటు. గేటుముందు జీప్ ఆపాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరూ దిగి, కంపౌండ్‌లో ప్రవేశించారు. ఇంటితలుపు మూసుంది. గుమ్మానికున్న కాలింగ్ బజర్ నొక్కాడు ఇన్‌స్పెక్టర్.

ఐదు నిమిషాలు గడిచినా ఎవ్వరూ వస్తున్న అలికిడి లేదు.

ఇన్‌స్పెక్టర్‌కు విసుగుపుట్టి, తలుపు తట్టబోయాడు. చెయ్యి పడగానే తలుపు కిర్రుమంటూ తెరుచుకుంది.

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుని, లోన అడుగు పెట్టారు.

"మిస్ గ్లోరియా!" పిల్చాడు ఇన్‌స్పెక్టర్.

జవాబు లేదు.

అది డ్రాయింగ్‌రూంలా వుంది. దాని పక్కనే మరో గది వుంది. దాని తలుపు మూసుంది. అడుగులో అడుగు వేసుకుంటూ అటు నడిచాడు ఇన్‌స్పెక్టర్.

తలుపు దగ్గరగా జేరవేసున్నట్టు కనిపిస్తోంది. తోశాడు. లోపల కనిపించిన దృశ్యం ఇన్‌స్పెక్టర్ని స్తబ్ధుణ్ణి చేసింది.

అది పడగ్గది. ఓ గోడవారగా మంచం. ఆ మంచంమీద మెత్తని డన్‌లప్ పరుపు. ఆ పరుపుమీద వెల్లికిలా పడుంది శవం! అందమైన యువతి శవం!!

నెమ్మదిగా మంచాన్ని సమీపించి, పరీక్షగా చూశాడు ఇన్‌స్పెక్టర్. సరిగ్గా ఆమె కుత్తిక దగ్గర రంధ్రం కనిపిస్తోంది. కళ్ళు రెండూ గది కప్పుని చూస్తున్నట్టు తెరిచి వున్నాయి.

ఒంటిమీద గులాబీరంగు నైట్‌గౌన్ వుంది.

గదిలో ఎక్కడ వస్తువులక్కడే వున్నాయి. మరణించక ముందు ఆమె ఎవ్వరితోనూ పెనుగులాడిన సూచనలు కనిపించడంలేదు.

అంటే, హంతకుడు ఆమెకు బాగా పరిచయమైనవాడే అయుండాలి. శవం రిగర్‌మార్టిస్ని బట్టి చూస్తే హత్య రాత్రే జరిగినట్టు అనుమానం వేసింది ఇన్‌స్పెక్టర్‌కు.

ఆమెనెవ్వరు హత్యచేశారు? ఎందుకు జేశారు? బ్యాంకు దోపిడీతో ఆమెకు సంబంధముందా? ఆ దోపిడీకీ, యీ హత్యకూ ప్రమేయముందా? శ్రీనివాసరావు బుర్ర చురుగ్గా పనిజేస్తోంది.

మంచం పక్కనే గోద్రెజ్ బీరువావుంది. కర్చీఫ్‌తో పిడితిప్పి, బీరువా తలుపు తెరిచాడు. లోపల బట్టలూ అవీ ఎవ్వరో గబగబ గాలించినట్టుంది. వస్తువులు కిందా మీదా పడున్నాయి.

ఒక్కో అరలాగుతూ చెక్ జెయ్యసాగాడు. బీరువా కింది అరలో కనిపించిన ఒక వస్తువు అతన్నాకర్షించింది.

అది పాత డైరీ!

ఆమెకు డైరీరాసే అలవాటుండేదన్న మాట. అది పాత డైరీ గనక మూల పడేసింది. మరి ఇప్పుడు రాస్తున్న డైరీ ఎక్కడ?

బీరువా పక్కనే చిన్న టేబిల్, కుర్చీ వున్నాయి. టేబిల్ పైన రెండుమూడు ఇంగ్లీషు నవలలూ, లెటర్‌పాడ్, పెన్‌సెట్ వున్నాయి. టేబిల్ సొరుగు లాగి చూశాడు ఇన్‌స్పెక్టర్. ఏవో కాగితాలూ, ఇతర వస్తువులూ తప్ప, కొత్తడైరీ కనిపించలేదు.

సాలోచనగా తలూపుతూ గదంతా కలయజూశాడు. అప్పుడు పడింది అతని దృష్టి-శవం పడున్న మంచం తల వైపు గోడమీద రాసున్న అంకెల మీద!

గోడదగ్గరికెళ్ళి పరీక్షగా చూశాడు. పెన్సిల్‌తో రాసేరు. 420024.

ఎవరిదా ఫోన్ నెంబర్?

దేనికైనా మంచిదని ఆ నెంబర్ నోట్‌చేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. తరవాత హెడ్‌క్వార్టర్స్‌కు ఫోన్‌చేసి, అంబులెన్స్‌నీ, ఫోటోగ్రాఫర్లనీ పిలిపించమని సార్జంట్‌కు పురమాయించాడు.

3

స్ప్రింగ్‌డోర్స్ తోసుకుంటూ లోనికి వచ్చాడు సార్జంట్ విశ్వం.

అతని చేతిలో రెండు పొడవాటి కవర్లున్నాయి.

"ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్ నించి బ్యాంకు సేఫ్‌మీది వేలిముద్రల రిపోర్టూ, గ్లోరియా ఇంట్లో దొరికిన వేలి

ముద్రల రిపోర్టూ, ఆమె పోస్ట్‌మార్టం రిపోర్టూ వచ్చాయి సార్!" అంటూ వాటిని ఇన్‌స్పెక్టర్ కందించాడు.

ముందు గ్లోరియా రిపోర్టు తెరిచి చూశాడు శ్రీనివాసరావు.

ఆమె శవ పరీక్షలో హత్య రాత్రే జరిగినట్టు తేలింది. పిస్తోలు బాగా క్లోజ్‌రేంజ్ నుంచి పేల్చడంవల్ల వెంటనే ప్రాణం పోయింది.

ఆమె పడగ్గదిలో రెండురకాల వేలిముద్రలు దొరికాయి. ఒకజత గ్లోరియావి. ఆమె ఆ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నట్టు తెలిసింది.

ఐతే, రెండోజత వేలిముద్రలెవ్వరివి?

తరువాత, బ్యాంకులో బంకించంద్ సేఫ్‌మీద దొరికిన ఫింగర్ ప్రింట్స్ రిపోర్ట్ చూశాడు ఇన్‌స్పెక్టర్. సేఫ్‌మీద మొత్తం మూడురకాల వేలిముద్రలు లభించాయి. ఒక జత సేఠ్‌జీవి. రెండోజత గ్లోరియావి. మూడోజత?

సడన్‌గా ఏదో స్ఫురించి, గ్లోరియా ఇంట్లో దొరికిన

రెండో జత ఫింగర్ ప్రింట్స్ తీసి, ఆ మూడో జతతో పోల్చిచూశాడు ఇన్‌స్పెక్టర్.

రెండూ ఒక్కటే!

శ్రీనివాసరావు కళ్లు మెరిశాయి. వెంటనే జీప్ఎక్కి హుటాహుటిన బ్యాంకు చేరుకున్నాడు. జనరల్ మేనేజర్ మృత్యుంజయరావుని కలుసుకుని, ఆ బ్యాంకులో సేఫ్‌లని అద్దెకు తీసుకున్న వ్యక్తుల చిరునామాలూ, వాళ్ళ వివరాలూ నోట్ జేసుకున్నాడు.

అందులో ఓ పేరు అతన్నాకర్షించింది. ఆ కస్టమర్ పేరు జితేందర్! పదిహేను రోజుల క్రితమే సేఫ్ అద్దెకు తీసుకున్నాడు! విశాఖపట్నం నించి క్యాంప్ వచ్చినట్టు చెప్పాడు. ప్రతిరోజు పన్నెండు గంటలకు వచ్చి, సేఫ్‌ను ఆపరేట్ చేసుకునేవాడు.

కాని, ఎందుకో గత రెండురోజుల్నించి, అంటే, గ్లోరియా అదృశ్యమైన రోజునించీ రావడంలేదు.

అతని వయసు ముప్ఫై అయిదుంటుంది. ఉచ్ఛారణ కొంచెం యాసగా వుంటుంది. సన్నగా, పొడుగ్గా వుంటాడు. ఎప్పుడూ కూలింగ్‌గ్లాసెస్ పెట్టుకుంటాడు. సూట్‌లో టిప్‌టాప్‌గా వుంటాడు. చేతిలో బ్రీఫ్‌కేస్ వుంటుంది. బ్లాక్ కలర్ ఫోర్డు కారులో వస్తాడు. దాని నెంబర్ ఇ.ఎమ్. 14520.

అతని లోకల్ అడ్రస్సూ, విశాఖపట్నం అడ్రస్సూ నోట్ జేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. అతను మళ్ళీ బ్యాంక్‌కు వస్తే తనకి ఫోన్ చెయ్యమని చెప్పి, ఆక్కణ్ణించి తిన్నగా జితేందర్ వుంటున్న హోటల్‌కెళ్ళాడు.

అతని రూంకు తాళంవేసుంది. రెండురోజుల క్రితం రాత్రి ఎనిమిది గంటలకు ఓ యువతి అతనికోసం వచ్చిందనీ

ఇద్దరూ కలిసి బైటకెళ్ళారనీ, మళ్ళీ తిరిగి రాలేదనీ చెప్పింది హోటల్ రిసెప్షనిస్ట్. ఇన్స్పెక్టర్ చూపిన గ్లోరియా ఫోటోను గుర్తుపట్టిందామె.

ఆ రాత్రి జితేందర్‌కోసం వచ్చింది ఆమే నంది!

అట్నించి మళ్ళీ క్రైంబ్రాంచి హెడ్‌క్వార్టర్స్‌కు బైలుదేరాడు ఇన్స్పెక్టర్. అక్కణ్నించి విశాఖపట్నం సి.ఐ.డి. బ్రాంచికి ట్రంకాల్‌జేసి, అక్కడ జితేందర్ పేరుగల బిజినెస్ మాగ్నెట్ గురించి వివరాలు కనుక్కోమని కోరుతూ, జితేందర్ చిరునామా తెలీజేశాడు.

తరవాత, ట్రాఫిక్ పోలీసులకు కబురంపి, ఇ. ఎమ్. 14520 నెంబర్ కారుకోసం నగరమంతా గాలించమని పురమాయించాడు.

అంతలో మరోకొత్త ఆలోచన తట్టి, తిన్నగా ధనలక్ష్మి బ్యాంకు చేరుకున్నాడు. అనుమాన నివృత్తికోసం ఓసారి జితేందర్ సేఫ్ తెరిచి చూడాలని కోరాడు మృత్యుంజయరావుని.

వెంటనే బ్యాంకు డైరెక్టర్స్ పిలిపించబడ్డారు. వారి సమక్షంలో-మాస్టర్ కీద్వారా జితేందర్ సేఫ్ తెరవబడింది. అందర్నీ ఆశ్చర్యంలో ముంచుతూ—

సేఫ్ ఖాళీగా వుంది!

4

ఆలోచనలతో ఇన్స్పెక్టర్ బుర్ర వేడెక్కుతోంది. జితేందర్ సేఫ్‌మీద లభించిన ఫింగర్‌ప్రింట్స్ అతని ముందున్నాయి. ఆ సేఫ్ మీద రెండురకాల వేలిముద్రలు దొరికాయి.

ఒకజత జితేందర్‌వి. రెండోజత గ్లోరియావి మాత్రం కావు! సేఠ్‌జీ సేఫ్‌మీదా, గ్లోరియా ఇంట్లోనూ దొరికిన

కొత్తరకం వేలిముద్రలూ, ఇవీ ఒకరివేనని తెలుస్తోంది.

జితేందర్ సేఫ్‌మీద గ్లోరియా వేలిముద్రలు లేక పోడంతో ఇన్‌స్పెక్టర్ ఆలోచనలు కొత్తమలుపు తిరిగాయి.

జితేందర్ వుంటున్న హోటల్ గదిమీద రైడ్ చెయ్యగా లభించిన కొన్ని వస్తువులూ, గ్లోరియా వ్రాసుకునే కొత్తడైరీ, ఓ చిన్నసైజు ఫోటో అతని టేబిల్ మీదున్నాయి.

ఇన్‌స్పెక్టర్ ఆలోచనల కంతరాయం కలిగిస్తూ, టేబిల్ మీద టెలిఫోన్ మోగింది. విశాఖపట్నం నించి సి.ఐ.డి. బ్రాంచ్‌వాళ్ళ మెసేజ్ అది.

అక్కడ జితేందర్ పేరుగల బిజినెస్ మాగ్నెట్ ఎవ్వరూ లేరట! ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన చిరునామా కూడా తప్పుడు చిరునామా అని తేలిందిట. వాళ్ళకు థాంక్స్ చెప్పి, రిసీవర్ పెట్టిన రెండు నిమిషాలకు మళ్ళీ ఫోన్ మోగింది.

అది నగర ట్రాఫిక్ పోలీసుల రిపోర్టు. జితేందర్ ఉపయోగించిన కారు కోడంబాకం శివార్లలో ఓ చోట పార్క్ జెయ్యబడుందిట. అది సిటీలోని ఓ ఆటోమొబైల్ కంపెనీనించి అద్దెకు తీసుకోబడిందిట. సాలోచనగా తలూపుతూ సిగిరెట్ అంటించాడు శ్రీనివాసరావు.

హత్య చెయ్యబడ్డ గ్లోరియా-చివరివరకూ బ్యాంక్‌లో పనిజేసిన గ్లోరియా ఒక్కరు కాదా? ఒక్కరే ఐతే, జితేందర్ సేఫ్‌మీద ఆమె వేలిముద్రలు ఎందుకు లేవు? పకడ్బందీగా రూల్సు పాటిస్తుండగా, సేఫ్‌లమీదికి మూడో వ్యక్తి వేలిముద్రలు ఎలా వచ్చాయి?

పూర్తయిన సిగిరెట్‌ని ఏష్‌ట్రేలో నొక్కి, సార్జంట్‌ను పిల్చి, గ్లోరియా ఇంట్లో గోడమీద కనిపించిన టెలిఫోన్

నెంబర్ ఎవ్వరిదో, ఆ ఇల్లు ఎక్కడుందో కనుక్కోమని పురమాయించి, టేబిల్ మీది ఫోన్ దగ్గరికి లాక్కున్నాడు ఇన్‌స్పెక్టర్.

బ్యాంక్‌కు రింగ్‌చేసి, మృత్యుంజయరావుని తక్షణం బైలుదేరి రమ్మని చెప్పాడు.

పదినిమిషాల్లోపల హడావుడిగా వచ్చాడాయన.

"ఏమైనా తెలిసిందా?" అడిగాడు కుర్చీలో కూలబడుతూ కుతూహలంగా.

ఇన్‌స్పెక్టర్ తలూపి, "మాకు లభించిన సాక్షాధారాలకు లౌకికం జోడిస్తే, ఈ కేసు స్పష్టమౌతుందనుకుంటాను. గ్లోరియా ఒంటరిగా జీవిస్తోంది గనక, ఆమె కుటుంబ వివరాలు మనకు తెలియవు.

కానీ, ఆమెకో సోదరి వుంది! వాళ్ళిద్దరూ కవలపిల్లలు!! ఆమెపేరు ఎల్లోమీనా. చిన్నతనంలో ఎలాగో తప్పి

పోయింది. మూడునెల్ల క్రితం అనుకోకుండా అక్కాచెల్లెళ్ళిద్దరూ కలుసుకోడం జరిగింది.

ఎల్లోమీనా తన వివరాలు గ్లోరియాకు చెప్పలేదు. కలుసుకున్నంత హఠాత్తుగా మళ్ళీ విడిపోయారిద్దరూ. తరవాత, నెలరోజుల క్రితం మళ్ళా కలుసుకున్నారు. ఏదో కారణం చెప్పి, గ్లోరియా ఇంటికి రాలేదు ఎల్లోమీనా!

ఆమె చెడుసావాసాలు మరిగి చెడిపోయిందని చెప్పవచ్చు. గ్లోరియా చేస్తున్న ఉద్యోగ వివరాలు తెలియగానే, తన మిత్రుడితో కలిసి ప్లాన్ వేసింది.

గ్లోరియా ద్వారా బ్యాంక్ ఆపరేషన్ వివరాలు సేకరించి, కట్టుదిట్టమైన ప్లాన్ వేశారు ఎల్లోమీనా, ఆమె మిత్రుడూ. తరవాత, గ్లోరియా నెక్కడో దాచేశారు.

ఎల్లోమీనా-గ్లోరియాగా చెలామణీ కాసాగింది. తమ పథకాన్ని చాలా తెలివిగా అమలు జరిపారు. ఎల్లోమీనా, గ్లోరియా స్థానాన్ని ఆక్రమిస్తే, జితేందర్ పేరుతో అంతకు ముందే బ్యాంకులో సేఫ్ అద్దెకు తీసుకున్నాడు ఆమె పార్టనర్!

వాళ్ళ కళ్ళు కొందరు మిలియనీర్స్ పైనపడ్డాయి. సేఫ్ తెరవడానికి కస్టమర్స్ పర్సనల్ కీస్‌ను ఆమె కిచ్చేవారు. ఆ సమయంలో అతి చాక చక్యంతో ఆ కీస్ ముద్రల్ని తీసేదామె. తరవాత, ఆ ఇంప్రెషన్స్‌ను జితేందర్‌కు అందజేసేది.

వాటిద్వారా అతను డూప్లికేట్ కీస్ తయారుజేసేవాడు. ఆ డూప్లికేట్ కీ, తన దగ్గిరుండే అఫీషియల్ కీ ఉపయోగించి కస్టమర్స్ సేఫ్‌లను తెరిచేది ఎల్లోమీనా!

అందులోని కరెన్సీ, నగలూ గట్రా జితేందర్ సేఫ్‌లోకి మార్చేది. రోజూ వచ్చి, తన సేఫ్‌కు ట్రాన్స్ఫ

ఫర్ జెయ్యబడ్డ ఇతర్ల సొమ్మును బ్రీఫ్ కేస్ లో పెట్టుకుని సురక్షితంగా, సునాయాసంగా తీసుకుపోయేవాడతను.

ఆవిధంగా ఎవ్వరికీ, ఎవ్వరిమీదా అనుమానం కలిగేది కాదు. జితేందర్లా మిగతా కస్టమర్స్ తరుచూ వచ్చేవారు కాదు మరి. అందుకే జరిగిన మోసం వెంటనే బైట పడలేదు. మాస్టర్ మైండ్ వాళ్ళిద్దర్లో ఎవ్వరిదోగాని, వారి తెలివితేటలకూ, జాబ్ లోని ప్రెసిషన్ కూ మనం జోహార్లర్పించాలి!" అన్నాడు.

ఆశ్చర్యంతో నోరు తెరుచుకు వింటూ ఉండిపోయాడు మృత్యుంజయరావు.

"సేఠ్ బంకించంద్ మాత్రమే కాదు, ఇంకా ఎందరి సేఫ్‌లు ఖాళీ అయ్యాయో చూస్తేనేగానీ తెలీదు. సేఠ్ జీ కంప్లైంట్ విషయం పసిగట్టిన ఎల్లోమీనా అదృశ్యమై పోయింది. దొరికినంతలో జెండా ఎత్తేయాలనుకున్నారు. తమ రహస్యం బైటపడకుండా గ్లోరియాని చంపేశారు. అంతేకాదు, అనుమానం ఆమెమీదికి పోతుందనుకున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మైగాడ్! ఇదంతా నిజమేనంటారా?" అడిగాడు మృత్యుంజయరావు సంభ్రమంతో.

ఇన్‌స్పెక్టర్ నవ్వి - "కీ ఇంప్రెషన్స్ తీసే వస్తువులు, డూప్లికేట్ కీస్ తయారుచేసే పరికరాలు జితేందర్ హోటల్ గదిలో మాకు దొరికాయి.

తన సోదరి ఎల్లోమీనాను కలుసుకున్నప్పుడల్లా ఆ విషయాలు డైరీలో రాసుకునేది గ్లోరియా. దేనికైనా మంచిదని ఎల్లోమీనా ఆ డైరీని మాయం జేసింది. అక్కడే ఆమె తప్పటడుగు వేసింది.

ఇప్పుడు కొత్త సంవత్సరం ప్రారంభమై ఒకే నెల అవుతోందికదా? ఎల్లోమీనాని మొదటిసారి కలుసుకున్నప్పటి సంగతులు పాత డైరీలో ఉంటాయి. పాత డైరీ సంగతి ఎల్లోమీనా మర్చిపోయింది.

గ్లోరియా దాచిన ఆ పాత డైరీ, బీరువాలో దొరికింది నాకు. అందులో ఎల్లోమీనాని గుర్తుపట్టడానికి ఒక ముఖ్యమైన క్లూ లభించింది. ఆమె వక్షంపైన బఠాణీగింజంత పుట్టుమచ్చ వుంటుంది. అదొక్కటే ఆ అక్కా చెల్లెళ్ళ ద్దరికీ తేడా!

నేను గ్లోరియా శవం ఫోటోలను పరిశీలించాను. ఆమె వక్షంపైన పుట్టుమచ్చలేదు.... అదే డైరీ కవర్లో పాత ఫోటో ఒకటి కనిపించింది. అందులో ఏడెనిమిదేళ్ళ అమ్మాయి లిద్దరున్నారు. వాళ్ళు కవల పిల్లలని చూడగానే చెప్పొచ్చు. అది ఎల్లోమీనా, గ్లోరియా చిన్ననాటి ఫోటో!

జితేందర్ కోసం స్టేటంతా కాలాట్ పంపించాను. అవసరమైతే ఎల్లోమీనా, జితేందర్ల కోసం ఇతర రాష్ట్రాలని కూడా ఎలర్ట్ చేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అంతలో బల్లమీది ఫోన్ మోగింది.

చటుక్కున రిసీవర్ అందుకుని, "ఎస్! ఇన్‌స్పెక్టర్ స్పీకింగ్!" అన్నాడు శ్రీనివాసరావు.

"నేను సార్జంట్ విశ్వాన్నిసార్! మనకు దొరికిన ఫోన్ నెంబరు ఇల్లు కనుక్కున్నాను. పెరంబూర్ రైల్వే స్టేషన్ ఇవతలవుంది. అందులో ఓ పొట్టి జుత్తు యువతీ, ఓ యువకుడూ నివసిస్తున్నట్టు చెప్పారు చుట్టుపక్కల వాళ్ళు" అన్నాడు సార్జంట్.

"అక్కడేవుండు. ఇప్పుడే వస్తున్నాను" అంటూ

రిసీవర్ దించి, మృత్యుంజయరావుకు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"దోపిడీ జేసింది వాళ్ళేనంటారా?"

"అదే నా అనుమానం! ఉదాహరణకు కాసేపు నేనే ఆ జితేందర్ననుకుందాం. నాకోసం స్టేటంతా కాలౌట్ జారీ జెయ్యబడింది. అటువంటప్పుడు నేనేం జేస్తానో తెలుసా?

రాష్ట్రం విడిచి పారిపోడానికి ప్రయత్నించను. నగరం లోనే కొన్నాళ్ళపాటు తలదాచుకుంటాను. హడావుడి తగ్గాక చల్లగా జారుకుంటాను. ఆలస్యమౌతోంది. పదండి" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్.

నలుగురు కానిస్టేబుళ్ళను వెంటబెట్టుకుని, మృత్యుం జయరావుతో హుటాహుటిన బైలుదేరాడు.

5

పెరంబూర్ రైల్వే స్టేషన్ దగ్గరున్న ఆ పాత పెంకు టింటికి కొద్దిదూరంలో ఆగింది జీపు. అందరూ దిగి, అటు నడిచారు.

సార్జంట్‌ను పెరటి గుమ్మం దగ్గర మాటు వెయ్యమని పంపి, మూసివున్న తలుపు తట్టాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావ్.

జవాబులేదు.

మళ్ళీ తట్టాడు.

"ఎవరూ?" అన్న స్త్రీ కంఠం వినిపించింది.

"టెలిఫోన్ డిపార్ట్‌మెంటండి!"

గడియ తీస్తున్న చప్పుడు. తలుపు కొద్దిగా తెరుచు కుంది. ఆ సందులోంచి ఓ యువతి తల ఇవతలకి

వచ్చింది. ఆమె అచ్చుపోసినట్టు గ్లోరియాలాగే వుంది!

ఇన్‌స్పెక్టర్ని చూడగానే ఖంగారుగా తలుపు మూసెయ్యబోయింది. చటుక్కున తలుపు సందులో బూటు ఇరికించి వెనక్కి నెట్టాడు శ్రీనివాసరావు.

భయంతో వెనక్కి అడుగువేసిందామె.

లోన అడుగుపెట్టి, "మిస్ ఎల్లోమీనా! నీ ఫ్రెండు జితేందర్ యెక్కడ?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఒక్కసారి ఉలిక్కి పడిందామె. "నాపేరు ఎల్లోమీనా కాదు. రీటా! జితేందర్ యెవ్వరో నాకుతెలీదు. బహుశా మీరు రాంగ్ అడ్రస్‌కు వచ్చుంటారు" అంది సర్దుకుంటూ.

జోక్ విన్నట్టు నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

అంతలో, "ఎవరితో మాట్లాడుతున్నావు డియర్?" అంటూ లోపలి గదిలోంచి జోగుతూ వచ్చాడో యువకుడు.

ఇన్‌స్పెక్టర్ని చూడగానే మెరుపులా జేబులోకి చెయ్యిపోనిచ్చాడు. అదేసమయంలో, అంతవరకూ బైట నిల్చుని కాచుకున్న కానిస్టేబుళ్ళు దిల దిల లోనికి దూరి అతన్ని చుట్టుముట్టారు. వేపాకులా గజ గజ వణకసాగింది ఎల్లోమీనా.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్ ఆమెని సమీపించి, "సారీ, బేబీ!" అంటూ ఆమె బ్లవుజ్ హుక్స్ విప్పాడు.

ఆమె పెనుగులాడుతున్నా లెక్క చెయ్యకుండా ఆమె వక్షాన్ని పరిశీలించాడు. తెల్లని ఆ వక్షంమీద బఠాణీ గింజంత పుట్టుమచ్చుంది.

***

వసుంధర

సర్పనగర నిధి

అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో నాకు మెలకువ వచ్చింది.

మెలకువ రావడానికి అసలు నిద్రసరిగా పట్టి ఏడిస్తే కదా! మర్నాటి ప్రయాణం గురించి తల్చుకుంటూ ఏవో ఆలోచిస్తూ కలత నిద్రపోతున్నాను.

అయితే ఇప్పుడు మెలకువ రావడానికి కారణముంది. ఏదో చప్పుడయింది గదిలో!

మళ్ళీ ఏమీ చప్పుడు రాలేదు. అయితే గదంతా చీకటిగా

వుంది. బెడ్ లైట్ యెవరు ఆర్పేశారో తెలియదు. నేను పడుకునేసరికి అది వెలుగుతూనే వుండేది. కరెంట్ లేదా అనుకుందామంటే గదిలో ఫాన్ తిరుగుతూనే వుంది.

ఎందుకైనా మంచిదని చేత్తో అటూ ఇటూ తడిమి మంచానికి దగ్గర్లోనే వున్న పుష్ బటన్ స్విచ్ నొక్కాను.

గది అంతా ప్రకాశవంతమైంది. ఒక్క నిముషం కళ్ళు జిగేల్ మన్నాయి. కళ్ళు గట్టిగా మూసుకుని తెరిచాను. ఏమీ కనబడలేదు. ఒసారి చేత్తో కళ్ళు నులుముకున్నాను. అప్పుడు కళ్ళు కాస్త కనబడుతున్నాయి. పక్కకు తిరిగాను. వులిక్కిపడ్డాను.

గదిలో ఓ మనిషి వున్నాడు. బలంగా, కండలు తిరిగి, వస్తాదులా వున్నాడు. ముఖం ప్రసన్నంగాలేదు. అతను నా వంకనే కోపంగా చూస్తున్నాడు. అతనిచేతిలో పిస్తోలు వుంది. అది నావైపే గురిపెట్టబడి వుంది.

"ఎవర్నువ్వు?" అన్నాను ధైర్యాన్ని నటిస్తూ. నేను లేవడానికి కూడా ప్రయత్నించలేదు కాబట్టి నాకు ధైర్యం లేదన్న విషయం అతనికి తెలిసే వుండాలి.

"నాపేరు చెప్పడంవల్ల నీకేం ప్రయోజనం. అందువల్ల నీకు తెలిసే దేముంటుంది? అయినా చెబుతానులే.... నాపేరు పాండురంగడు...." అన్నాడతను.

"ఎందు కొచ్చావ్?" అన్నాను.

"నువ్వూహించగలవు?" అన్నాడు పాండురంగడు.

"డబ్బుకోస మయుంటుంది. అయితే నా ఇంట్లో నీకెంతో డబ్బు దొరకదు...." అన్నాను.

"నేను డబ్బుకోసం రాలేదు...." అన్నాడు పాండురంగడు.

"అయితే నగలకోసం వచ్చివుంటావ్. నేను బ్రహ్మ

చారిని. ఇంట్లో ఆడాళ్లు లేరు" అన్నాను. నాకు కొంత ధైర్యంకూడా వచ్చింది. లేచి కూర్చున్నాను.

"నేను నగలకోసమూ రాలేదు...." అన్నాడు పాండు రంగడు.

అతను చాలా ముక్తసరిగా మాట్లాడుతున్నాడు. మనిషి చాలా సీరియస్‌గా వున్నాడు. ఎక్కడా నవ్వు లేదు.... "అయితే నాకోసం వచ్చావా?" అన్నాను.

"నీతో పనివుంది కానీ నీకోసం రాలేదు...." అన్నాడు పాండురంగడు.

మంచంమీద నుంచి దిగి నిలబడ్డాను.... "అయితే ఆ పిస్తోలెందుకు?"

"అవసరమైతే నిన్ను చంపడానికి........ "అన్నాడు పాండురంగడు.

చటుక్కున మంచంమీద చతికిలబడి.... "నన్నా? చంపడమా, ఎందుకు?" అన్నాను గుటకలు మింగుతూ.

పాండురంగడు నన్ను సమీపించి .... "వెనక్కు తిరుగు!" అన్నాడు. నేను వెనక్కు తిరగ్గానే అతను నా చేతులూ, కాళ్ళూ కట్టేశాడు. తాడు బహుశా అతని జేబు లోనే వుండి వుంటుంది. అతను నన్ను బంధించగానే నాకు ధైర్యంపెరిగింది. నన్ను చంపే ఉద్దేశ్య మున్నట్లయితే యిలా బంధించి వుండేవాడు కాదుగదా!

పాండురంగడు నన్ను వదిలి....ఇల్లంతా వెదకడం మొదలు పెట్టాడు. ఇంట్లో చాలా చోట్ల వెతికినట్లున్నాడు. చప్పుళ్ళు బాగానే అవుతున్నాయి. టైముకూడా చాలాసేపు పట్టింది. ఆఖరికి మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు.

"నువ్వు నే ననుకున్నకంటే ఘటికుడివి...."అన్నాడు పాండురంగడు.

అతను నన్ను ఘటికుడని ఎందు కనుకున్నాడో, ఎంత ఘటికుడని అనుకున్నాడో నాకు తెలియదు. అందుకని నవ్వి ఊరుకున్నాను.

"నవ్వితే సరిపోదు. ఆ కాగితం ఎక్కడుందో చెప్పాలి!"

"ఏ కాగితం?" అన్నాను ఆశ్చర్యంగా.

"నటించకు. ఈ పాటికి నీకు తెలిసే వుంటుంది నేనే కాగితం కోసం వచ్చానో."

అయోమయంగా వుంది నాకు. అతనే కాగితంగురించి అంటున్నాడో నాకు తెలియలేదు. ఆ సంగతే చెప్పాను.

పాండురంగడు చిరాగ్గా...."మరీ ఇంత లౌక్యం పనికి రాదు...."అని "సర్పనగర నిధి ప్లాన్ వున్నకాగితం...." అన్నాడు.

సర్పనగర నిధి ఏమిటో నాకు అర్థంకాలేదు. ఆ పేరు విన్న గుర్తుకూడా నాకు లేదు...."నువ్వంటున్న మాటలు నాకు అర్థంకావడం లేదు...." అన్నాను!

"నా చేతిలో ఒక పిస్తోలువున్నదనీ అది నేను ఉపయో గించవలసిన అవసరం రాకుండా చేయగలగడం నీ వల్లనే అవుతుందనీ గుర్తుచేసుకో. నా మాటలు వెంటనే అర్థ మవుతాయి...."

"గుర్తు చేసుకున్నాను. అయినా నీ మాటలు అర్థం కావడం లేదు...."

"అయితే దేవుణ్ణి స్మరించుకో...." అన్నాడు పాండు రంగడు.

"పాండురంగా—రక్షించు...." అన్నాను వెంటనే.

"నన్ను అడిగితే లాభంలేదు. ఆ దేవుణ్ని స్మరిం చుకో...."



"బాగుంది నాదైవం పాండురంగడు. ఆయన నాకు ప్రత్యక్ష దైవం...."

పాండురంగడు నవ్వాడు. నవ్వితే అతని ముఖంలోకి కళవచ్చింది...."నువ్వు చాలా ఘటికుడివి. నన్ను నవ్వించిన వాళ్ళు అరుదు...." అన్నాడు.

నాలో నేనే నవ్వుకున్నాను. ఎదుటి వాళ్ళను నవ్వించడం ఉగ్గుపాలతో నేర్చుకున్న విద్య నాకు. అది నా వృత్తి ధర్మంకూడా. నేను ప్రజానాయకుణ్ణి. వాళ్ళ నమ్మకానికి పాత్రుడినై ఎమ్మెల్యేనయ్యాను కూడా. అందరికీ యెన్నో ఉపకారాలు చేస్తానని వాగ్దానం చేయగలను కానీ ఉపకారాలు చేయలేను. వాగ్దానాలు నాకు పదవినిస్తాయి. ప్రతిఫలంగా ప్రజల్ని నేను నవ్విస్తాను—నా ఉపన్యాసాలతో! ఆ ఉపన్యాసాలే నన్ను నవ్వులపాలు కాకుండా కాపాడుతుంటాయి.

"నవ్వించినంత మాత్రాన వదలను. ఆ కౌగిలం గురించి చెప్పాల్సిందే...."

"ఆ కౌగిలం గురించి చెప్పలేదన్న కోపంతో నన్ను

చంపేశావనుకో. అప్పుడు నీకు దానిగురించి ఏమైనా తెలిసే అవకాశముందా?" అన్నాను.

"లేదు. అందుకే నిన్ను అంతసులువుగా చంపను...." అన్నాడు పాండురంగడు.

"సర్పనగర నిధిగురించి తెలుసుకోవడం కోసమే గదా నన్ను చంపనంటున్నావ్...."

"అవును...."

"చచ్చినా బ్రతికినా నావల్ల ప్రయోజనం పొందలేని కొద్ది మనుషుల్లో నువ్వొకడివి...." అన్నాను.

పాండురంగడు నవ్వలేదు. క్రూరంగా నావంక చూసి.... "సరిగ్గా మూడంకెలు లెక్క పెడుతున్నాను. మూడు అనే సరికి నాకు సరైన సమాధానం రాకపోయిందా, ప్రయోజన మున్నా లేకపోయినా నిన్ను చంపేస్తాను...." అన్నాడు.

"నాకు తెలియని దాన్ని గురించి నన్నెంత బెదిరిస్తే మాత్రం ఏం చెప్పగలను...." అన్నాను బాధగా. పాండురంగడు నామాట వినకుండా...."ఒకటి...." అన్నాడు. నే నింకేదో చెప్పాను. నేను చెప్పడం పూర్తికాగానే.... "రెండు...." అన్నాడు పాండురంగడు.

"పాండురంగా....రక్షించు...." అన్నాను.

"మూడు...." అన్నాడు పాండురంగడు. అతని కుడి చేతివ్రేలు ట్రిగ్గర్ మీద కదిలింది. నాకు స్పృహ తప్పింది.

2

కళ్ళు తెరిచేసరికి నా గదిలో లేను. వాతావరణం కొత్తగా వుంది. ఇప్పుడున్న గది మరీ విశాలంగా లేదు. ఇరుగ్గా వుంది. నేను వెంటనే గమనించలేదు కానీ నాకు ఎదురుగా ఒక మనిషి వున్నాడు. బుర్రమీసాలతో కాస్త భయంకరంగా వున్నాడు.

"ఎవర్నువ్వు?" అన్నాను.

"నాపేరు యమధర్మరాజు...." అన్నాడతను.

ఉలిక్కిపడి .... "నేనిప్పు డెక్కడున్నాను? ...." అన్నాను.

"నరక లోకంలో ...."

నేను కళ్ళు నులుముకున్నాను. చెవుల్లోకి వేళ్ళుపోనిచ్చి కెలికాను. వళ్ళు గిల్లుకున్నాను....నేను కల కనడంలేదు. చూస్తున్నదంతా నిజమేనని గ్రహించాను.

"ఎందు కొచ్చాను?"

"ఎందుకా?" యమధర్మరాజు నవ్వాడు .... "చేసిన తప్పులకు శిక్ష అనుభవించడానికి...."

నేను మాట్లాడకుండా యమధర్మరాజు వంకే చూస్తూ న్నాను. అతను రెండు నిముషాల్లో నా మంచానికి దగ్గర్లో ఒక బల్ల వేసి దానిమీద కొన్నివస్తువులు పేర్చాడు. వాటిలో కత్తి, చాకు, నిమ్మకాయ, గుండుసూదులు, సిగర్ లైటర్ వున్నాయి. అవన్నీ చూస్తూంటే నా కేదో అనుమానం కలిగింది...."ఇవన్నీ ఎందుకు?" అన్నాను.

"నిన్ను శిక్షించడానికి...." అన్నాడు యమధర్మరాజు.

మంచంనుంచి కదలబోయాను. అప్పుడే తెలిసిందినాకు. నా చేతులైతే ఫ్రీగా కదుల్తున్నాయి కానీ నేను మంచానికి బందీని. లేచి కూర్చునే వీలులేదు.

"అన్నట్లు కారంపొట్లం మరిచిపోయాను...." అంటూ యమధర్మరాజు ఆ గదిలోంచి బయటకు వెళ్ళి అయిదు నిముషాల్లో ఓ పొట్లంతో తిరిగివచ్చి అదికూడా టేబుల్ మీద పెట్టాడు...."నీ వంటిమీద గాట్లు పెట్టి, నిమ్మకాయ పిండి ఆనందించడం నావంతు, అనుభవించడం నీవంతు."

"ఎందుకీ శిక్ష....?"

"చేసిన తప్పుకి....!"

"ఏమిటి నేను చేసిన తప్పు....?"

"సర్పనగర నిధికి సంబంధించిన ప్లానుకాగితం ఇవ్వక పోవడం...."

హఠాత్తుగా నాకు అన్నీ గుర్తు కొచ్చాయి. ఈ సర్ప నగర నిధి ఏమిటో నాకు ప్రాణంతకంగా తయారయింది. "నాకు తెలియని కాగితం యెలా ఇచ్చేది?" అని మనసులో అనుకుని పైకిమాత్రం...."ఒక షరతుమీద ఆ కాగితం నీ కిస్తాను...." అన్నాను.

యమధర్మరాజుకళ్లు ఆనందంగా వెలిగాయి...."ఏమిటా షరతు?" అన్నాడు.

"మకరలోయకు దారి చెప్పాలి నువ్వు నాకు...."

"మకరలోయ ఏమిటి?"

"బుకాయించకు. నువ్వు మకరలోయకు దారి చెప్పిన వెంటనే నీకు నేను సర్పనగర నిధిగురించి చెబుతాను...." అన్నాను.

"మకరలోయ గురించి నిజంగా నాకు తెలియదు...."

"నేను నీ మాటలు నమ్మతాను. మరి నా మాటలుకూడా నువ్వు నమ్మాలి!"

"ఏమిటి నీ మాట?"

"సర్పనగర నిధి గురించి నిజంగా నాకుతెలియదు...."

యమధర్మరాజు రెండు నిముషాలసేపు ఆగకుండా నవ్వి...."నన్ను నవ్వించగల వాళ్ళు అరుదు. నువ్వు తమాషా మనిషివి...." అన్నాడు.

"నువ్వు మెచ్చుకుంటే నాకు సంతోషం కలగడంలేదు. బల్లమీద వస్తువులు చూస్తే ఏడుపొస్తోంది కూడా...." అన్నాను.



"అయితే సర్పనగర నిధి గురించి చెప్పాలి...." అన్నాడు.

"నాకు తెలియదన్నానుగా...."

"ఈ రోజుకు నిన్ను వదిలి పెడుతున్నాను. కాసేపట్లో నీకు ఆహారం వస్తుంది. తిను. బల్లమీది ఈ వస్తువులనే చూస్తూ నిద్రపడితే నిద్రపో. బాగా ఆలోచించుకో. రేపు నేను వచ్చేసరికి సర్పనగర నిధి గురించి చెప్పక పోయావంటే—కత్తిగాటు, కారం, నిమ్మకాయ....గుర్తుంచుకో ....వస్తాను...." అని వెళ్ళిపోయాడు యమధర్మరాజు.

నేను భయంగా గదిలో చుట్టూ పరీక్షించాను. వద్దనుకున్నా నాకళ్లు గదిలోని బల్లనీ, దానిమీది వస్తువులనూ చూస్తున్నాయి. అవిచూడగానే యమధర్మరాజు మాటలు గుర్తుకు వచ్చి నామనసు పాడై పోతోంది. ఊహించుకునేందుకే భయంకరంగా వున్నాయా బాధలు?

అసలీ సర్పనగర నిధి ఏమిటి? దానికి సంబంధించిన ప్లాను కాగితాలేమిటి? అవి నాదగ్గరుంటాయన్న అనుమానం యెవరికొచ్చింది? పాండురంగడెవరు? యమధర్మరాజె వరు

అన్నీ ప్రశ్నలే, అన్నీ అనుమానాలే! అనుక్షణం నా మనసునిండా భయం పేరుకుంటోంది. భగవంతుడి దయ వల్ల ఇంతవరకూ నా శరీరానికి ఏ విధమైన బాధాకలుగలేదు. కానీ ఇకముందు కలగదన్న గ్యారంటీ ఏముంది? భగవంతుడు కరుణించి ఏ అదృశ్య దేవతైనా చెవిలో ఆ సర్పనగర నిధిగురించి చెప్పిపోతే బాగుండును.

నేను ఆలోచనల్లో వుండగానే నాకు ఆహారం వచ్చింది. అ మనిషి ముఖం కనిపించకుండా ముసుగు వేసుకున్నాడు. నేను లేచి కూర్చోడానికి వీలుగా అతను సహాయ పడ్డాడు. పదార్థాలన్నీ మంచిరుచిగా వున్నాయి.

"నరకలోకంలో తిండి చాలా బాగుందన్నానని మీ యమధర్మరాజుకు చెప్పు...." అన్నాను. ముసుగు మనిషి నవ్వి వెళ్ళిపోయాడు.

భోజనం చేసిన పదినిముషాల్లో నిద్ర ముంచుకువచ్చింది. అదీ ఒక అదృష్టమే. లేకపోతే ఎదురుగా ఇన్న బల్ల, దాని మీద వస్తువులు నన్ను బాధిస్తాయి. అయితే నిద్ర నన్ను మరీ ఎక్కువగా సుఖ పెట్టిందిలేదు. ఇలలో లేని బాధలన్నీ యమధర్మరాజు చేతిలో కలలో పడ్డాను. అన్నింటినీ భరించి మెలకువ వచ్చేసరికి ఎదురుగా యమధర్మరాజు వున్నాడు. మళ్ళీ కథ మామూలే!

అతను మాట్లాడే పద్ధతి, వ్యవహరించే తీరు— చూస్తూంటే నన్ను బాధ పెట్టే ఉద్దేశ్యం లేదనిపించింది. నా అభిప్రాయాన్ని నిజంచేస్తూ ఆ గదిలో నేనున్న మూడు రోజుల్లోనూ యమధర్మరాజు నన్నుమాటలతో బెదిరించడం తప్పితే గుండుసూది చూడా ఉపయోగించలేదు.

నాలుగోరోజు ఉదయం నాకు మెలకువ వచ్చేసరికి నాకు గుసగుసల్లాంటి మాటలు వినబడ్డాయి. నా చెవులు బాగా

పనిచేస్తూండడం వల్లనేమో ఆ మాటలు నేను స్పష్టంగా వినగలిగాను. అలా వినడం మంచిదే అయింది.

"చాలామొండి ప్రాణంలా గున్నాడు. మళ్ళీ స్థలం మార్చాల్సిందే...."

"మారిస్తే మాత్రం ప్రయోజనం వుంటుందా? ఆ నిధి గురించి చెబుతాడా?"

"ఏమో?....అన్ని రకాలుగానూ ప్రయత్నించాలి కదా- అతనికి హాని కలిగించకూడదని బాస్ ఆజ్ఞ! బెదిరింపుల కేమో లొంగడం లేదు. ఈ రోజు ఆఖరి ప్రయత్నం చేసేక మళ్ళి స్థలంమార్చి—అప్పటికీ ప్రయోజనముండక పోతే—అప్పుడు దారుణహింసలకి గురిచేసి నిజం కక్కించాలని బాస్ అంటాడు. ఆయన అహింసావాదం మన ప్రాణం తీస్తోంది ..."

ఆ తర్వాత రెండు నిముషాలకు యమధర్మరాజు గది లోకి వచ్చాడు.

"చూస్తూ చూస్తూ నిన్ను బాధపెట్టడం లేదనేగదా— నన్ను కాల్చేస్తున్నావ్....ఇంత మొండివాణ్ణి నా జీవితంలో చూడలేదు...." అన్నాడు యమధర్మరాజు.

నాలోని మొండితనమేమిటో నాకే అర్థం కావడంలేదు. నాకు నిజంగా సర్పనగర నిధి గురించి తెలియదు. తెలియని ప్రశ్నకు జవాబు ఎలా చెప్పేది? నా నుంచి జవాబురాక విసిగిపోయి ఆఖరికి వీళ్ళు నన్ను దారుణహింసలకు గురి చేస్తే ఏంచేయాలా అని బెంగెట్టుకున్న నన్ను మొండి వాడని వీళ్ళనుకుంటున్నారు. వీళ్ళచేతుల్లోంచి ఎప్పటికి ఎల్లా తప్పించుకుంటానో ఏమో!

నేను మాట్లాడలేదు. యమధర్మరాజు ప్రశ్నలకు నేను

మామూలు సమాధానాలే చెప్పాను. అతను నన్ను బెదిరించి వెళ్ళిపోయాడు. తర్వాత ఆహారం వచ్చింది. భుజించి నిద్ర పోయాను. ఈసారి నన్నదొక రకమైన మత్తు ఆవహించింది.

3

కళ్ళు తెరిచేసరికి ఇంకో కొత్తగదిలో వున్నాను. ఈ గది చాలా అందంగా వుంది. అటూ ఇటూ చూసి ఉలిక్కిపడ్డాను. నేనిప్పుడు మంచానికి బందీనికాను.

చటుక్కున మంచం దిగాను. గదికి ఒకేఒక్క ద్వారముంది. అక్కడకు వెళ్ళాను. తలుపులు వేసివున్నాయి. మళ్ళీ వెనక్కి వచ్చాను. గదిలో చక్కని పరిమళం!

"నాకోసం వెతుక్కుంటున్నావా ప్రియా!"

తీయని మాటలు వినపడి చుట్టూ చూశాను. నేను చూస్తూండగా కిలకిల నవ్వుకుంటూ ఒక యువతి మంచం కింద నుంచి వచ్చింది. ఆమె అలంకరణ పౌరాణిక సుందరి విధంగా వున్నది.

"నేనెక్కడున్నాను?" అన్నాను అప్రయత్నంగా.

"స్వర్గలోకంలో" అందామె.

ఆశ్చర్యంగా "నువ్వెవరు?" అన్నాను.

"అప్సరసను...." అందామె. తర్వాత నెమ్మదిగా స్వరం తగ్గించి...."ఇక్కడ నీవూ, నేనూ....ఇంకెవ్వరూ లేరు...." అంది.

"అయితే....?" అన్నాను.

"మగాడివి. నీకే తెలుసు...." అందామె మర్మగర్భితంగా.

నేను మగాడిననీ, ఆమె యువతి అనీ నాకు తెలుసు. మేమక్కడ ఒంటరిగా చేరామనీ గ్రహించాను. అయితే...

నేను బ్రహ్మచారిని. పెళ్ళి చేసుకునే ఉద్దేశం నాకులేదు. నా జీవితం పూర్తిగా ప్రజాసేవకే అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను. అందుకు భార్య అడ్డంకి కాగలదని నా నమ్మకం. అందుకే పెళ్ళి చేసుకోలేదు.

"నాకు నీ మాటలు అర్థం కావడంలేదు...." అన్నాను.

"నేను నీదాన్ని...." అందా యువతి.

"నేను నిన్ను పెళ్ళిచేసుకోబోవడం లేదు. అలాంటప్పుడు నువ్వు నాదానివెల్లాగౌతావు?" అంటూ సూటిగా ప్రశ్నించాను.

ఆమె పగలబడి నవ్వింది — "నువ్వు బాగా నవ్వించగలవు. ఇలాంటి చతురోక్తి విని చాలా కాలమైంది...." అంది.

"నేను హాస్యమాడడం లేదు. నిజమే చెబుతున్నాను."

"ఆడ, మగ ఒకచోట చేరినప్పుడు మగాడు చొరవ చేస్తాడు. ఆడది పెళ్ళిగురించి అడుగుతుంది. ఆడదానికే పెళ్ళిభయం వుంటుంది. ఆడదే చొరవచేస్తే...." అని నవ్వి-"నీలా ప్రశ్నలు వేసే మగాడుమాత్రం ఈ భువిలో వుండడు...." అంది అప్సర.

"అవుననుకో. నేనందరి మగాళ్ళలాంటి వాడినీకాను" అన్నాను.

"అయినా నేను వదలనుగా. నేనందరి ఆడవాళ్ళలాంటి దాన్నీ కాను" అంది అప్సరస.

"అప్సరా! నాతో ఏమిటి పని నీకు" అన్నాను. నా భయం నాకుండనే వుంది.

నేనెప్పుడూ ఆడదానికి ఇంత సన్నిహితంగా రాలేదు. గాంధీమహాత్ముడి అడుగుజాడల్లో నడవాలనీ, నేను నమ్మిన ధర్మాన్ని పాటించాలనీ నా కోరిక. ప్రజాసేవ విషయంలో

నేననుకున్నపన్నీ చేయలేకపోతున్నాను. అందుక్కారణం అంతా నా చేతుల్లో లేకపోవడమే!

అయితే బ్రహ్మచర్య ధర్మాన్ని పాటించడం పూర్తిగా నా చేతుల్లోనే వుంది. అయితే విశ్వామిత్రుడంతటివాడిని మేనక లొంగదీసేసింది. నేను సామాన్యుణ్ని! ఈ అప్సర బారినుండి తప్పించుకోగలనా?

"వయసులోవున్న మగాడివి. నన్నిప్రశ్న అడగడానికి సిగ్గులేదూ...." అంటూ నాకు దగ్గరగా వచ్చిందామె. ఆమె శరీరంమీద నుండి మత్తెక్కించే పరిమళాలు వస్తున్నాయి.

"నన్నుగురించి ఏమైనా అనుకో. కానీ నాకు దగ్గరగా మాత్రం రాకు. ఒక్కక్షణం బలహీనత నన్ను జీవితాంతమూ బాధిస్తుంది" అన్నాను.

"సరే-రానులే—అయితే నేచెప్పినట్లు వినాలి...."

"వింటాను...." అన్నాను.

"నేనడిగిందానికి తెలియదనకుండా జవాబు చెప్పాలి.."

"చెబుతాను...." అన్నాను.

"సర్పనగర నిధికి సంబంధించిన ప్లాన్ కాగితం ఎక్కడుంది?" అంది అప్సర.

"నేను ప్రేమించే నా ప్రజలమీద, నేను నమ్మిన బ్రహ్మచర్యంమీద ఒట్టువేసి చెబుతున్నాను. ఆ సర్పనగర నిధి గురించి నాకేమీ తెలియదు. దాని గురించి నేనెన్నడూ విని కూడా వుండలేదు. ఎవరో ఈ విషయంలో పొరబడ్డారు" అన్నాను దీనంగా.

అప్సర తమాషాగా నవ్వింది.... "నువ్వు ప్రేమించే ప్రజలు నిన్నెన్నుకున్నప్పుడే మట్టిగొట్టుకుపోయారు. నువ్వు నమ్మిన బ్రహ్మచర్యం ఈ రోజుతో వమ్మైపోతుంది.



అందువల్ల నీ ఒట్టు వృథా....” అంటూ ఆమె నన్ను సమీపించి గట్టిగా కౌగలించుకుంది.

ఆ స్పర్శ నాకు చాలా హాయిగా ఉంది. ఏవో కొత్త అనుభూతులు కలుగుతున్నాయి. మనసు నిలకడ తప్పుతోంది. నన్ను నేను మరిచిపోతున్నాను. అప్సర నడుం చుట్టూ నేను చేతులు బిగించలేదు. కానీ ఆమె నన్ను కౌగలించుకుంటే విడిపించుకుందుకు కూడా ప్రయత్నించలేదు.

4

అప్సరతో ఆ గదిలో నాలుగు రోజులు గడిపాను. నిజంగానే నేను స్వర్గానుభూతుల్ని చవిచూశాను. ఆమె చేతిలో నా బ్రహ్మచర్యదీక్ష ఓడిపోయింది. ఆ గదిలోంచి బయటపడ్డాక వివాహం చేసుకోవాలనే నిర్ణయానికి కూడా వచ్చాను.

అప్సర నన్నలరింపుజేస్తూ కూడా తన విద్యుక్త ధర్మం మరిచిపోలేదు. సర్పనగర నిధి గురించి నన్ను తరచుగా అడుగుతూనే ఉంది. నేను తెలియదని అంటే గోముగా

అడిగి ప్రయత్నించి చూసేది. నాకు నిజంగా తెలిసి వుంటే ఆమెకు సర్పనగర నిధిగురించి చెప్పివుండేవాడినే!

"నువ్వు నన్ను ప్రేమించడం లేదు. ప్రేమికులమధ్య రహస్యాలుండకూడదు. సర్పనగర నిధిగురించి నువ్వు నా కెందుకు చెప్పవు?" అంది అప్సర ఓరోజు దీనంగా.

"అప్సరా! నిన్నిప్పుడు నేను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నాను. ఈ గదిలోంచి బయటపడితే నిన్ను పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకుంటున్నాను. నా భార్యవైతే అప్పుడైనా నీకు నిజం తెలియగలదు...."

"నన్ను నువ్వు పెళ్ళిచేసుకుంటావా? అది వట్టిమాట." అంది అప్సర.

"నేను అబద్ధమాడను. బాపూజీ అడుగుజాడలలో నడిచే వాణ్ని...." అన్నాను.

"బ్రహ్మచర్యదీక్ష పూనారు. కొనసాగించగలిగేరా!" అంది అప్సర నవ్వుతూ.

"నిజమేలే—మహాత్ముడితో నాకు పోలికేమిటి? అయినా నిన్ను పెళ్ళి చేసుకుంటానన్న విషయం ఋజువు చేయదానికి కాలమే ఆధారం...." అన్నాను.

"నన్ను మీరు పెళ్ళి చేసుకుంటానంటే మిమల్నిక్కడ్నించి తప్పించగలను...." అంది అప్సర.

"నిజంగా?"

"ఆఁ"

ఆ తర్వాత నాకెప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. మెలకువ వచ్చేసరికి ఓ కొత్త గదిలో ఉన్నాను. పరీక్షించిచూసి అది ఒక హోటల్ రూం అని తెలుసుకోగలిగాను.

నేనిప్పుడు ఎవరికీ బందీని కాను. కానప్పు ఆ గదిలో విచ్చలవిడిగా తిరిగాక నాకు అర్థమైనదేమిటంటే - నేనున్నది

హైదరాబాదులోని హోటల్లో. నిన్నరాత్రి ఎవరో నన్నిక్కడకు తీసుకువచ్చి నా పేరున ఈ గది తీసుకున్నారుట.

నేను త్వరగా తెమిలి అక్కడ్నించి బయటపడి పోలీసు స్టేషన్‌కు వెళ్ళి నన్ను సుమారు పది రోజులుగా ఎవరో ముఠావాళ్ళు బంధించి, సర్పనగర నిధిగురించి రకరకాలుగా బాధించారని చెప్పాను.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ నేను చెప్పినదంతా ఆశ్చర్యంగా విని—"సర్పనగర నిధిగురించి నేనూ వినలేదు. కానీ ఇది ఏదో ఎమ్మెల్యేలకు సంబంధించినదే అయుండాలి. ఎందుకంటే ఊళ్ళో ఈ విధంగా పదిమంది ఎమ్మెల్యేలు మాయమై తిరిగివచ్చారు...." అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. సర్పనగర నిధిగురించి అపహరించబడ్డ మా పదిమంది ఎమ్మెల్యేలలో ఒకరికి తెలిసుండాలి. అతనెవరో నాకు తెలిసినా బాగుండును. వెళ్ళి కలుసుకుని మాట్లాడాలి.

బాగా ఆలోచించేక—సర్పనగర నిధి గురించి మాలో ఒకరికి తెలిసినట్లు ఆ ముఠాకు తెలిసివుంటుందనీ, అందుకనే పదిమందినీ అపహరించి తమ ప్రయత్నాలు చేశారనీ—ఆఖరికి ఒకరిద్వారా విశేషాలు తెలియగానే అందర్నీ వదిలిపెట్టేశారనీ నాకు అనిపించింది.

ఏది ఏమైనా ఆ పదిరోజులూ మేము లేకపోవడంవలన ఒక ప్రమాదం జరిగింది. ముఖ్యమంత్రిమీద పార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆయన్ను నాయకుడిగా తొలగించివారు.

మేము పదిమందిమీ ఆయనకు నమ్మకమైన అనుచరులము. ఎనిమిది ఓట్ల తేడాలో ఆయన పదవిపోయింది. మేము పదిమందిమీ వుంటే ఆయన నాయకత్వం నిలబడి

వుండేది. పదవిపోగానే ఆయన అనుచరులు చాలా మంది కొత్త నాయకుడికి అనుచరులై పోయారు. కొత్తనాయకుడి కారణంగా కొందరు ప్రతిపక్ష సభ్యులుకూడా మాపార్టీలో చేరారు.

"మీరుండి వుంటే అవిశ్వాస తీర్మానం ఓడిపోయి వుండేది. అప్పుడు అందరూ నా అనుచరులుగా మారి వుండేవారు. సమయానికి మీరు రాని కారణంగా నేనిప్పుడు అనామకుడినై పోయాను...." అని వాపోయాడు మాజీ ముఖ్యమంత్రి.

మే మాయనోదార్చి...."సప్తసగర నిధి మీ పదవిని దెబ్బతీసింది. ఒకోసారి అలా అవుతూంటుంది...." అన్నాము. పదవిమీద కోరికలేని మాకు ముఖ్యమంత్రి యెవరైనా వొకటే. అయినా మాజీ ముఖ్యమంత్రిని అవసరానికి ఆదుకోలేక పోయామన్న బాధ నాలో వుండిపోయింది.

సుమారు రెండు నెలల తర్వాత అప్సర నన్ను కలుసుకుంది. ఆమెను నేను వివాహం చేసుకుంటానన్నాను.

"ఇంకా మీరు మాటమీద నిలబడుతున్నారా? నేను పవిత్రురాలిని కాదు. తెలుసా?" అంది అప్సర.

"ఇప్పుడు నేనింకో అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటే నేనుమాత్రం పవిత్రుడినౌతానా?" అన్నాను.

నన్నర్థం చేసుకోవడానికి అప్సరకు రెండు రోజులు పట్టింది. ఆ తర్వాత సింపుల్‌గా మా వివాహం జరిగిపోయింది.

వివాహం జరిగిన మొదటిరోజు రాత్రి ఆమెతో అన్నాను ...."నేను నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ప్రబలమైన కారణముంది. సప్తసగర నిధిగురించి తర్వాత ఏముయిందో నువ్వే చెప్పగలవు...."

"ఏముంది చెప్పడానికి-ఏమీలేదు!"

"అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భర్తదగ్గర రహస్యా లుంచ కూడదు...." అన్నాను.

ఆమె నవ్వి—"అంతా మాయ, మోసం, దగా! కొత్త ముఖ్య మంత్రిగారు మీ పదిమంది ఎమ్మెల్యేలనూ దాచేయా లనుకున్నారు. కారణం అదిరాదనుకోవడంకోసం సర్ప నగర నిధి అనే భ్రమను మీకు కలిగించారు. అసలా నిధికోసం ఏ ముఠావాళ్ళూ ప్రయత్నించడంలేదు. మీరే కారణంగా బంధించబడ్డారో మీకు తెలియకూడదు. అదే ఆయన ఉద్దేశ్యం. ఇప్పుడు పోలీసులు సర్పనగర నిధి గురించీ, ఆ ముఠాగురించీ అంతుతేలక కొట్టుకు చస్తున్నారు. మీకు చెప్పానుకానీ ఈ రహస్యాన్ని మీరు మరెవ్వరికీ చెప్పకూడదు...." అంది.

"పదవికోసం మరీ ఇంత ఘోరమా? నాకు తెలిసిన ఈ నిజాన్ని నేను దాచలేను. వెళ్ళి పోలీసులకు...." అని నేను ఏదో అనబోతుండగా—

"నాకోసం ఈ నిజాన్ని మీరు దాచక తప్పదు...." అంది అప్సర.

"నిజాన్ని దాచలేను. బాపూజీ అనుచరుణ్ణి నేను...." అన్నాను.

"అస్తమానూ ఆయన్ను స్మరిస్తారెందుకు? బ్రహ్మ చర్య దీక్షనలా దీన్నీ నడలించండి...." అంది అప్సర.

అప్సర చేతిలో మరోమారు ఓడిపోయాన్నేను. అయితే రాజకీయాల్లో మాత్రం మరో కొత్త పాఠం నేర్చుకున్నాను.

***

అంతర్ధానం

సుసర్ల సర్వేశ్వరరావు

"ప్లీజ్ ....సిడౌన్" ....అన్నాడు డిటెక్టివ్ శ్రీనాథ్.

పరంధామయ్య నీరసంగా నిట్టూరుస్తూ కుర్చీలో కూర్చున్నాడు. అతని వయస్సు నలభై అయిదు సంవత్సరాలలోపు వుండవచ్చు. ఎందుకో అతని వదనంలో విచార రేఖలు దట్టంగా అలముకుని వున్నాయి.

"ఇప్పుడు చెప్పండి. ఏ విషయంలో మీకు నా సహాయం కావాలి?"

పరంధామయ్య ఒక ఫోటోతీసి శ్రీనాథ్‌కు ఇస్తూ "వీడు మా అబ్బాయి సత్యన్నారాయణ రాజు. అందరూ 'రాజు' అని పిలుస్తుంటారు. పదవ తరగతి చదువుతున్నాడు. మూడురోజుల కిందట స్కూలుకని వెళ్ళినవాడు ఇంత వరకూ ఇంటికి తిరిగి రాలేదు.

మాకు తెలిసిన వాళ్ళందరికీ కబురు చేశాను. వాళ్ళెవరింటికి రాలేదట. ఈ రోజు పోలీసురిపోర్టు యిచ్చాను. అయినా మీ అంత త్వరగా వాళ్లు ఏక్షన్ తీసుకోరు. నాకున్నదంతా అమ్మేసయినా మీ ఫీసు చెల్లించుకుంటాను. నా బాబుని ఏలాగైనా నాకు అప్పచెప్పండి చాలు...." గద్గద స్వరంతో పలికాడు పరంధామయ్య.

"ఫీజు గురించి వర్రీ అవకండి. నేనడిగే ప్రశ్నలకు ఎటువంటి దాపరికం లేకుండా సమాధానం యివ్వండి. మీ అబ్బాయి కనిపించకుండాపోయిన ముందు రోజుల్లో ఏ విషయంలోనైనా అతనూ, మీరూ ఘర్షణపడ్డారా?"

"వాడికీ నాకూ ఏ విషయంలోనూ ఘర్షణ ఏర్పడలేదు. వాడు ఏ విషయంలోనూ పేచీ పెట్టడం, అల్లరి చెయ్యడం చేసేవాడు కాదు. ప్రతీదాంట్లోను సర్దుకోగల మనస్తత్వం వాడిది. వాడు ఏం కోరితే అదివ్వడానికి సిద్ధపడే మాతో వాడికి తగాదా ఎందుకొస్తుంది."

"మీ రాజు వయసెంత? హాబీలేమిటో చెప్పండి!"

"వాడు జైకిసాన్ జూనియర్ కాలేజీలో పదవతరగతి చదువుతున్నాడు. అందరితో చనువుగా స్నేహం కలిపేసు పని సరదాగా వుండడం, డిటెక్టివ్ పుస్తకాలు వెర్రిగా చదవడం, పుస్తకాలలో పజిల్స్ నింపి పంపడం చేస్తూం

టాడు. పద్నాల్గు సంవత్సరాలు నడుస్తున్నాయి. ఎక్కడికి వెళ్ళినా మాతో చెప్పందే వెళ్ళడు. అందుకే చాలా ఆందో ళనగా వుంది.''

"ఆల్ రైట్! మీరేం కంగారు పడకండి. రాజుకి బాగా పరిచయమున్న స్నేహితులు, బంధువుల చిరునామాలు యివ్వండి. అన్నట్టు మీరేం చేస్తుంటారు? మీ చిరునామా కూడా యివ్వండి.''

"నేనొక చిన్న ఫ్యాన్సీషాప్ నడుపుతున్నాను. రాజు ఒక్కడే మా సంతానం. చాలాకాలం వరకు పిల్లలు లేక పోవడంవల్ల, ఆలస్యంగా పుట్టిన రాజంటే మా ఇద్దరికీ పంచప్రాణాలు. ఈ ఊర్లో నాకు బంధువులెవరూ లేరు. నాకు తెలిసినంతవరకు చిరునామాలు ఇస్తాను'' అంటూ ఒక కాగితంపై అన్నీ రాసిచ్చాడు పరంధామయ్య.

వాటిని పరిశీలించాక "మా శాయశక్తులా కృషిచేసి వీలైనంత త్వరలో రాజును మీకు అప్పగిస్తాను'' అన్నాడు డిటెక్టివ్ శ్రీనాథ్.

పరంధామయ్య వెళ్ళగానే అంతవరకూ జరిగిన సంభాష ణను నోట్ చేయసాగాడు అసిస్టెంట్ హరి.

"పరంధామయ్య చిన్న ఫ్యాన్సీషాప్ ఓనరు. రాజు అతని ఏకైక సంతానం. రాజుకి డిటెక్టివ్ నవలలు చదవడం, పజిల్స్‌నింపి పంపడం, అందరితో సరదాగా- స్నేహంగా వుండడం హాబీలుగా తెలుస్తోంది. దీన్నిబట్టి అతను చాలా చురుకైన వాడేనని అనుకోవచ్చు.

తండ్రితో ఎటువంటి తగాదా రాలేదు గనుక రాజు అలిగి పారిపోయే అవకాశం లేదు. పోనీ పరంధామయ్యగారి నుండి డబ్బు గుంజేందుకు రాజుని ఎవరైనా ఎత్తుకుపోయే రని అనుకున్నా ఇంతవరకు కిడ్నాప్‌చేసిన వాళ్ళ దగ్గర్నుంచి

పరంధామయ్యగారికి ఎటువంటి ఉత్తరం రాలేదు. అదీగాక పరంధామయ్య పెద్ద శ్రీమంతుడు కాదుగదా?

మరైతే రాజు ఏమైనట్లు? తనంతట తాను పారిపోయి వుండాలి లేదా ఎవరైనా ఎత్తుకునిపోయివుండాలి? రెండింటికి తగిన ఆధారాలు కనిపించడం లేదు.

రాజు అంతర్ధానంలో వున్న అంతరార్థం ఏమిటో తెలుసుకోవాలి. హరీ! నీవు అతని మిత్రుల్ని కలుసుకో. నేను అతని కాలేజీకి వెళ్ళి అవసరమైన సమాచారం సేకరిస్తాను" అని లేచాడు డిటెక్టివ్ శ్రీనాథ్.

"ఓకే సార్...." అంటూ సువేగా స్టార్ట్‌చేసి, తుర్రుమన్నాడు హరి.

మరో ఐదునిముషాల్లో జావామీద డిటెక్టివ్ శ్రీనాథ్ కూడా బయలుదేరాడు.

2

"మీరేనా మోహనరావంటే?"

"అవును, కూర్చోండి...." కుర్చీ ఆఫర్ చేసాడు ఆ యువకుడు.

ఆ యువకుడికి ఇరవై సంవత్సరాలుండొచ్చు. ఆరోగ్యంగా, అందంగా వున్నాడు. సన్నని మీసకట్టు, వంకీల జుట్టు అతణ్ని చూడగానే ఆకట్టుకుంటున్నాయి.

"రాజు మీకు బాగా తెలుసనుకుంటాను?...." ప్రశ్నించాడు హరి, తనను తను పరిచయం చేసుకున్న తర్వాత.

"బాగా తెలుసండి. రెండు, మూడు రోజులై అతను కనిపించడం లేదని వాళ్ళ నాన్నగారి ద్వారా తెలుసుకుని చాలా బాధపడ్డాను."

"అందుకే మీ సహాయంకోసం వచ్చాను. రాజుపై మీ అభిప్రాయం?"

"చాలా చురుకైనవాడు, తెలివైన వాడు. ఒకసారి టిఫిన్ చేద్దామని హోటల్‌కు వెళ్ళిన నేను టిఫిన్ చేసిన తరువాత జేబులో డబ్బులు కనిపించక కంగారుపడుతుంటే ఈ రాజు నా బిల్లు చెల్లించాడు. అప్పట్నించీ మా ఇద్దరికీ స్నేహం కుదిరింది. నాకు తెలిసినంతవరకూ అతనికి మిత్రులేగాని శత్రువులు లేరు."

"మా రొటీన్ ప్రశ్న వేస్తున్నాను. రాజు అదృశ్య మయిన రోజున మీరు ఏం చేస్తున్నారు?"

"నేను 'వాణి ఎంపోరియం'లో పనిచేస్తున్నాను. ఆ రోజు మా షాపుకు శెలవు. నేను మధ్యాహ్నం మ్యాట్నీకి 'వెంకటేశ్వరా థియేటర్'కు వెళ్ళాను. తరువాత 'రాజా థియేటర్'కు మొదటి ఆటకు వెళ్ళాను."

"ఒకేరోజు వరుసగా రెండు సినిమాలు చూశారా?" ఆశ్చర్యంగా అడిగాడు హరి.

"అవునండి. నాకు పాతసినిమాలంటే చాలా యిష్టం. అందుకే 'దేశద్రోహులు' చిత్రం ఆడుతోంటే మ్యాట్నీకి వెళ్ళాను. 'రాజా'లో ఆడుతున్న కొత్త చిత్రానికి బ్లాక్‌లో టికెట్ కొనుక్కుని చూడవలసి వచ్చింది. ఉండండి, టికెట్లు కూడా వున్నాయి. తెచ్చి చూపిస్తాను...." అంటూ ఆ యువకుడు ఒక ఎక్సర్‌సైజు బుక్ తెచ్చి హరికి ఇచ్చాడు.

హరి ఆశ్చర్యంగా అతనివంక చూసాడు.

"ఈ ఆల్బమ్ చూసి మీరు ఆశ్చర్యపోతున్నారు కదూ? నాకు ఇదొక హాబీ. ప్రతీ సం॥ జనవరి నుండి డిశంబర్ వరకు నేను చూసిన ప్రతీ సినిమా యొక్క టికెట్ ముక్కను ఇందులో అంటిస్తుంటాను. డిశంబర్ 31వ తేదీన వాటి మొత్తాలను కూడి సం॥లో సినిమాకోసం



ఎంత ఖర్చుచేసిందీ చూసుకుంటూంటాను. ఇవిగో, ఆ రోజు నేను చూసిన సినిమాలకు సంబంధించిన టికెట్ ముక్కలు."

ఆ పుస్తకంలో తేదీవారీగా చాలా టికెట్ ముక్కలు అంటించబడివున్నాయి. ప్రతీ టికెట్ ముక్క క్రింద ఆ సినిమా పేరు, తేదీ, వివరంగా రాసున్నాయి. పూర్తిగా పరిశీలించి దాన్ని ఆ యువకుడికి యిచ్చేసాడు హరి.

"చాలా బాగుందండి మీ హాబీ. మీకు చాలా శ్రమిచ్చాను" అంటూ అతని దగ్గర సెలవు తీసుకుని బయటికి నడిచాడు హరి.

3

"నమస్తే!"

"రండి! ఏంకావాలి?"....ఎదురుగావున్న ఖాళీ కుర్చీని చూపిస్తూ, దళసరి కళ్ళద్దాల్లోంచి శ్రీనాథ్ వైపు చూస్తూ అడిగారు జైకిసాన్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్.

"నా పేరు శ్రీనాథ్. ప్రయివేటు డిటెక్టివ్‌ను. 'రాజు' అనే విద్యార్థి కేసులో దర్యాప్తు చేస్తూ మీ సహాయం కోసం వచ్చాను."

"వెరీ గ్లాడ్ టు సీయూ. నా నుండి మీకు ఎటువంటి సహాయం కావాలో చెప్పండి" అంటూ శ్రీనాథ్ చెయ్యి పుచ్చుకుని ఊపేశాడు అతను.

"రాజు మాయమైన రోజున ఎప్పుడు స్కూలునుండి వెళ్ళాడో చెప్పగలరా!"

"ఉండండి చెబుతాను" అంటూ బెల్ కొట్టి ప్యూన్‌ను పిలిచి, "రంగసాయి మేష్టార్ని నేను అర్జంటుగా రమ్మన్నానని చెప్పు" అని పురమాయించాడు.

"రాజుపై మీ అభిప్రాయం ఏమిటి?"

"అన్ని విషయాలలోనూ చాలా ఏక్టివ్‌గా వుంటాడు. అతనిపై ఒక్క బేడ్ రిపోర్టయినా లేదు."

ఇంతలో రంగసాయి మేష్టారు వచ్చారు. ప్రిన్స్‌పాల్ ఆయనకు శ్రీనాథ్‌ను పరిచయం చేసారు.

"మేష్టారూ! ఆ రోజు ఏం జరిగిందో కాస్త వివరంగా చెబుతారా?"

"ఆ రోజు నేను పాఠం చెబుతుంటే మా వాచ్‌మేన్ వచ్చి రాజు గురించి ఎవరో వచ్చారని చెప్పాడు. రాజు క్లాసునుంచి పర్మిషన్ తీసుకుని వెళ్ళిపోయాడు. తర్వాత రాజు మరి రాలేదు...." చెప్పాడు రంగసాయి మేష్టారు.

ఆయన్ని పంపించి, వాచ్‌మేన్‌ను పిలిచాడు శ్రీనాథ్.

వాచ్‌మేన్ వచ్చి దణ్ణం పెట్టాడు. ఎందుకో వాడి శరీరం సన్నగా వణకడం గమనించాడు శ్రీనాథ్.

"మూడు రోజుల కిందట రాజు అనే అబ్బాయిని పిలిచావట ఎందుకు?"

"ఆరోజు వీధి గేటుకు ఊడిపోయిన చెక్క కొడుతుంటే ఎవరో ఇద్దరు కారులోవచ్చి దూరంగా ఆగారు. అందులో ఒకతను నా దగ్గరకొచ్చి "నీకు రాజు అనే విద్యార్థి తెలుసా?" అని అడిగాడు. తెలుసునన్నాను.

అతను వెంటనే పర్సులోనుండి ఒక రూపాయలనోటు తీసి నాకిచ్చి, "రాజు నాన్నగారికి యాక్సిడెంట్ అయింది. మేము కార్లో తీసుకెళ్ళి ఆస్పత్రిలో జాయిన్ చేశాము. ఆయన చెప్పిన అడ్రస్సువల్ల ఇక్కడి కొచ్చాము. రాజు త్వరగా వస్తే అతన్ని కారుమీద ఆస్పత్రికి చేర్చి మేము అర్జెంటుగా పనిమీద వెళ్ళిపోవాలి. పిల్చుకొస్తావా?" అన్నాడు.

అతను చెప్పింది అమాయకంగా నమ్మేశాను. అంతేగాక అయాచితంగా వస్తున్న ఐదు రూపాయలు వదలాలనిపించలేదు. వెంటనే రాజు బాబును పిలవడం, ఆయన వాళ్ళతో కారెక్కి వెళ్ళిపోవడం జరిగింది. తరువాత రాజు నాన్నగారు ఆ బాబు కనిపించడం లేదని వచ్చి ప్రిన్సుపాల్ గార్కి చెప్పగానే విని భయపడిపోయాను. నేను చెప్పింది అక్షరాలా నిజం, బాబూ" అని చెప్పి దాదాపు ఏడ్చినంత పనిచేసాడు వాడు.

"ఆల్ రైట్ నువ్వు చెప్పింది నమ్ముతున్నాను. ఇందులో ఏమాత్రం అసత్యం వుందని తెలిసినా తీవ్రమైన ఫలితాలు అనుభవించవలసి వుంటుంది"....అని వాణ్ణి హెచ్చరించి పంపేశాడు శ్రీనాధ్. తరువాత ప్రిన్సుపాల్ కి 'థాంక్స్' చెప్పి బయటికి వచ్చాడు.

4

శ్రీనాథ్ ఇంటికొచ్చేసరికి హరికూడా తన దర్యాప్తు చేసికొని వచ్చాడు. కాని చెప్పుకోదగ్గ విషయాలేవీ తెలియ లేదు.

హరి చెప్పినదంతా విన్నాక ఐదు నిముషాలు ఆగి "రాజుని ఎవరో ఎత్తుకుపోయారని నా పరిశోధనవల్ల స్పష్ట మవుతోంది. అయితే రాజుని ఎందుకు ఎత్తుకెళ్లారన్నదే అంతు చిక్కకుండా వుంది. మనం ఇంకా కొందర్ని దర్యాప్తు చేస్తే ఏదైనా క్లూ లభిస్తుందేమో చూడాలి".... అని కాలుస్తున్న సిగిరెట్ ఆర్పి యాష్ట్రేలో వేశాడు.

హరిని దగ్గరగా పిలిచి ఏదో చెప్పాడు. హరి అలాగే నంటూ వెళ్ళిపోయాడు.

తర్వాత శ్రీనాథ్ జావామీద బయలుదేరాడు.

మస్తాన్ కిళ్ళీషాపు దగ్గరకొచ్చి ఆగాడు.

షాపుముందు వివిధ దిన పత్రికలు, ఇతర పత్రికలు, డిటెక్టివ్ పత్రికలు వేలాడదీయబడివున్నాయి. ఎదురుగా పెద్ద హోటల్ ఉన్నందున, మంచి జంక్షన్‌లో ఉండడం వల్ల షాపు రద్దీగానే ఉంది.

షాపు కెళ్ళి మస్తాన్ గురించి వాకబు చేసాడు. అతను గంటక్రితం ఎక్కడికో వెళ్ళినట్లు చెప్పారు. సిగిరెట్ వెలి గించి మస్తాన్ గురించి ఎదురు చూస్తూ నిలుచున్నాడు.

అరగంట గడిచినా మస్తాన్ జాడలేదు.

ఈలోగా చాలామంది ఆ షాపు దగ్గరకొచ్చి ఒకవిషయం గురించి వాకబు చేయడం గమనించాడు శ్రీనాథ్. దాంతో అతని ఆలోచనలు కొత్తదారి తొక్కాయి. తనలో వుద యిస్తున్న సందేహాలు తొలగించుకునే మార్గం పరిశీలిస్తు న్నాడు.

మస్తాన్ షాపు దగ్గర చిల్లర - మల్లర పనులు చేసే కుర్రాడు షాపులోనుండి బీడీతీసి వెలిగించుకుంటూ టీ తాగొస్తా నంటూ బయలుదేరాడు. శ్రీనాధ్ మౌనంగా వాడ్ని వెంబడించాడు.

ఇరవై అడుగులు దాటిన తరువాత శ్రీనాధ్ వాడ్ని పిలిచాడు. వాడు వెనక్కు తిరిగి శ్రీనాధ్‌నుచూసి ఆశ్చర్య పోయాడు.

"నే నాండి?"....అనడిగాడు వాడు.

"అవును! నువ్వే!"....అంటూ పది రూపాయల నోటు ఒకటి వాడి జేబులో ఉంచాడు శ్రీనాధ్.

"అడగండి సార్! నాకు తెలిసినంత వరకూ చెబు తాను సార్"....వినయంగా చెప్పాడు వాడు.

"నీకు 'రాజు' తెలుసా?"

ఏ రాజన్నట్లు చూసాడు వాడు. శ్రీనాధ్ రాజు ఫోటోను గుర్తుకు తెచ్చుకుని వర్ణించాడు.

వర్ణనలన్నీ శ్రద్ధగా విని "ఆ రాజు బాబును తెలియకేం సార్! శానా మంచాయన. అప్పుడప్పుడు నాకు సిల్లర

డబ్బులుకూడా ఇస్తుంటారు. నేను బీడీలు తాగుతుండడం చూసి దెబ్బ లాడేవాడు. నాకు సదువు నేర్పుతాను అనే వారు. ఆయన చూస్తుండగా బీడీలు కాల్చను. సదువుకూడా ప్రారంభించినాను. ఎందుచేతనో ఆ బాబు మూడు రోజుల్నుంచీ కనిపించడం లేదు. ఊరికెల్లినట్టున్నారు''.... అన్నాడు.

శ్రీనాథ్‌లో చాలా ప్రశ్నలు సుడుల్లా తిరుగుతున్నాయి. ఒకొక్కటే అడుగుతూ వాడి దగ్గర్నుంచీ సమాధానాలు రాబట్టాడు. ఆ సమాధానాలు విన్న తరువాత ఆ కేసులో ఇమిడివున్న మిస్టరీ ఏమిటో ఊహించుకో గలిగాడు. అయితే అపరాధి ఎవరు?

వాడికి మరో పదిరూపాయలు ఇచ్చేస్తూ ''ఈ ప్రశ్న లన్నీ అడిగినట్లు ఎవరికి చెప్పకు. ఎవరికైనా చెప్పావో చిక్కుల్లో పడతావు జాగ్రత్త!'' అని హెచ్చరించాడు.

తరువాత మస్తాన్ షాపు కెళ్ళాడు. షాపులో మస్తాన్ వున్నాడు. వాడ్ని కొన్ని ప్రశ్నలడిగాడు. అందరూ చెప్పి నట్టుగానే రాజు గురించి చెప్పాడు.

5

''హరీ! నా దర్యాప్తువల్ల రాజు అంతర్ధానంలో వున్న మిస్టరీ ఏమిటో బోధపడుతోంది. నీ పరిశోధనవల్ల అపరాధి ఎవరోకూడా చాలావరకు బోధపడుతోంది. అయితే రాజు ఎక్కడున్నాడు? మనం అనుమానిస్తున్న వ్యక్తిని మనం సాక్ష్యాధారాలతో పట్టుకో గలగాలి.''

శ్రీనాథ్ మాటలు వింటూ ఆలోచనల్లో పడిపోయాడు హరి. ఐదు నిముషాలు గడిచాయి. హరి శ్రీనాథ్‌కు ఏదో చెప్పాడు.

"వెరీగుడ్ మై బోయ్! నీ ఆలోచన బేషుగ్గావుంది. అలాగే వెళ్ళు. జాగ్రత్త!" అన్నాడు శ్రీనాథ్.

హరి వెంటనే సువేగా తీసుకొని బయలుదేరాడు.

పావుగంట తర్వాత ఒక వీధి మొదట్లోకి వచ్చి తనకు కావల్సిన ఇంటివైపు దృష్టి సారించాడు. అప్పుడే ఆ ఇంట్లోంచి ఒక వ్యక్తి సైకిలు తీసుకుని బయటికి వచ్చాడు. హరి సువేగాను కొంచెం ముందుకు పోనిచ్చి, తర్వాత సైకిలును వెంటాడసాగాడు.

ఆగంతకుని సైకిలు ఊరి చివరకురాగానే రోడ్డు వదలి, ప్రక్కనున్న తోటలోకి దారి తీసింది.

తోటలో కొంతదూరం వచ్చేసరికి ఆగంతకుడు సైకిలు దిగి నడిపించుకుంటూ వెళ్ళడం ప్రారంభించాడు. అతణ్ణి అనుసరిస్తున్న హరికూడా సువేగాను ఒక వారగా చేర్చి, తాళంవేసి ఆగంతకుణ్ణి అనుసరించాడు.

దూరంగా పాడుబడిన ఇల్లు ఒకటి లీలగా కనబడింది. అదెప్పుడో జమీందార్ రావు బహదూర్ తన విలాసాల కోసం కట్టించుకున్నది. తరువాత ఆయన కుటుంబం చెల్లా చెదురు కావడంతో ఈ తోటా, భవనం ఎవరికీ చెందకుండా కోర్టు తగాదాల్లో వుండిపోయాయి. ఈ భవనంలో దెయ్యాలున్నాయన్న పుకారు యెలా పుట్టిందో తెలియదు గాని, ఊరి ప్రజలు ఆ చుట్టు పక్కలకు రావడం మానుకున్నారు.

ఆగంతకుడు భవనం దగ్గర కాపలావున్న వాడితో ఏదో మాట్లాడి, అతడికి సైకిలు అప్పగించి లోనికి వెళ్ళి పోయాడు.

హరి ఒక చెట్టువార నక్కి ఆగంతకుడి చర్యలు పరిశీ స్తున్నాడు. ఆగంతకుడు లోనికి వెళ్ళిపోగానే జేబులోనుండి

మినీ ట్రాన్సిస్టర్ లాంటి పరికరం ఒకటి తీసి దానితో మాట్లాడడం ప్రారంభించాడు.

అప్పుడు సమయం రాత్రి తొమ్మిది గంటలు.

"సార్!....అతణ్ణి వెంబడించాను. అతడు ఊరి చివర నున్న తోటలోని పాడుబడిన బంగళాలోకి ప్రవేశించాడు."

"అయితే మన అనుమానం నిజమే అయిందన్న మాట. నేను సుందరంతో చెప్పి, అక్కడికి వెంటనే వస్తాను. ఈలోగా వాణ్ణి నువ్వొక కంట కనిబెడుతూ వుండు."

"ఓకే సార్, ఓవర్."

డిటెక్టివ్ శ్రీనాథ్ వెంటనే సుందరం దగ్గరకు బయలు దేరాడు.

6

"రాజూ! మర్యాదగా అదెక్కడ దాచావో చెప్పు. అనవసరంగా ప్రాణం మీదకు తెచ్చుకోకు."

"ఛీ! నీచుడా! నమ్మకద్రోహి. నా ప్రాణం తీసినా నేనేమీ చెప్పను."

"అనవసరంగా మొండి పట్టుదల చూపకు. ఇప్పటిదాకా మంచిగా అడిగాను. ఇక నా దుర్మార్గాన్ని, కరుకుదనాన్ని కూడ చూపవలసి వుంటుంది."

"నువ్వు అరిచి గీపెట్టినా, నన్ను చిత్రహింసలకు గురిచేసినా, నాచేత ఏం చెప్పించలేవు."

"ఇక నీతో మంచిగా వ్యవహరిస్తే ప్రయోజనం లేదు"....ఆ యువకుడు ఏదో అనబోతుండగా, యిద్దరు వ్యక్తులు హరిని కాళ్ళుచేతులు కట్టి తెచ్చి అతనిముందు పడేశారు.

"గురూ! నేను లఘుశంక తీర్చుకోడానికి వెళుతుంటే పొదల చాటున వీడెవడో నక్కుతున్నట్లు అనుమానం

కలిగి స్పృహ తప్పించి తెచ్చాం"....అని వాళ్ళలో ఒకడు చెప్పాడు.

"వెరీగుడ్! వీణ్ణి యిక్కడ వదలి మీరు కిందకు వెళ్ళి కాపలా కాయండి.

వీడితో బాటు వీడి బాస్‌కూడా రాకమానడు. వీడు డిటెక్టివ్ శ్రీనాథ్ అసిస్టెంట్. మీరు వెయ్యికళ్ళతో కాపలా కాయాలి. మీ కన్నుగప్పి శ్రీనాథ్ ఎలాగైనా ఇక్కడకు రాడానికి ప్రయత్నించవచ్చు."

"ఓకే"....అంటూ వాళ్లు వెళ్ళిపోయారు.

మళ్ళీ ఆ యువకుడు రాజుని వేధించడం ప్రారంభించాడు.

అంతలో హరికి మెలకువ వచ్చింది. మెల్లిగా కళ్లు విప్పి చూశాడు.

ఎదురుగా ఓ కుర్రాడు స్తంభానికి కట్టబడి వున్నాడు. అతనే రాజు అని గ్రహించాడు. ఆ గదిలో ఒక పెట్రో మేక్స్ లైట్ వెలుగుతోంది. తన చేతులు వెనక్కి విరిచి కట్టి పడేయడం వల్ల భుజాలు నొప్పి పుడుతున్నాయి.

హరి కదులుతుండడం చూసి...."మైడియర్ యంగ్ డిటెక్టివ్! అనవసరంగా ఇందులో జొరబడి,అపాయంలో చిక్కుకున్నావు. అయినా ఈ రాజుగాణ్ణి అనాలి. నే నడిగింది చెప్పేస్తే మీకూ-మాకూ ఈ శ్రమ ఉండేదికాదు...." అన్నాడు.

రాజునుండి యెటువంటి జవాబు రాకపోయే సరికి ఆ యువకునిలో కోపం విజృంభించింది.

కొరకంచులా వెలుగుతున్న సిగిరెట్ తెచ్చి రాజు బుగ్గమీద పెట్టాడు.

రాజు బాధతో 'కెవ్వు' మన్నాడు. అయినా బాధను నిగ్రహించుకున్నాడు.

"ఇది కేవలం శాంపిల్ మాత్రమే. ఇంతకన్నా భయంకరంగా చిత్రవధ చేస్తాను. అంతవరకూ రానివ్వక అదెక్కడ దాచావో చెప్పు...." గద్దించాడు ఆ యువకుడు.

"నన్ను ముక్కలుగా నరికినాసరే నేను చెప్పను".... స్థిరకంఠంతో మొండిగా జవాబిచ్చాడు.

"చెప్పవా?...." అంటూ అగ్గిపుల్ల వెలిగించి రాజు తొడ చర్మం కాల్చడం ప్రారంభించాడు.

రాజు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భరించలేని బాధగా వున్నా, పళ్ళు బిగపెట్టి నిగ్రహించుకుంటున్నాడు.

అది చూసి హరి హృదయం ద్రవించిపోయింది.

"మిస్టర్! నీకు కావలసింది రాజు దగ్గర్నుంచి సంపాదించడానికి ప్రయత్నిస్తాను. ఒక అవకాశం ఇస్తావా?"

"హరీ నాతో హాస్యాలాడకు! రాజు గురించి దర్యాప్తు చేస్తూ అతణ్ణి నాకు కావలసింది అడుగుతావా? నేనేం పాలు తాగే పసివాణ్ణి అనుకున్నావా? నీ కల్లిబొల్లి కాకమ్మ కబుర్లు నమ్మడానికి."

"మిస్టర్! కొద్దిగా ఆవేశం తగ్గించుకుని ఆలోచించు. రాజును వెదికి ఇవ్వడమే మా డ్యూటీ. అతనిని ప్రణాలలో అప్పగిస్తామని అతని తల్లిదండ్రులకు వాగ్దానం చేశాం. నీకు కావలసింది అతడి దగ్గర్నుంచి ఇప్పించి, అతణ్ణి సురక్షితంగా తీసుకువెళ్ళాలన్నదే నా ఆలోచన. అంగీకారమైతే ఆలోచించు—"

ఆ యువకుడు ఆలోచనల్లో పడ్డాడు.

"ఆల్ రైట్! కాని మోసం చేయడానికి ప్రయత్నించావంటే మీ రెండు శవాలు నామరూపాలు లేకుండా

తయారై మీ వాళ్ళకు పంపబడతాయి. ముందు జాగ్రత్త కోసం నీ చేతికట్లు విప్పుతానుగాని, కాళ్ళకు మాత్రం అలాగే ఉంచుతాను. నాకు కావలసింది దొరగ్గానే మీ యిద్దర్నీ వదిలేస్తాను."

"ఓయస్! నాకేం అభ్యంతరంలేదు."

ఆ మాటన్న హారివంక నిరసనగా చూసాడు రాజు.

"మీ ప్రాణాలు కాపాడుకోడానికి నాచేత రహస్యం చెప్పించడానికి సిద్ధపడిన మీరు డిటెక్టివ్‌నని చెప్పుకోడానికి సిగ్గుపడాలి. ఒక నీచుడితో చేతులు కలపడం మీ వృత్తికే అవమానం. మీ ఇద్దరూ కలసి గంగలో దూకినా నేనేమీ చెప్పను...." ఆవేశంగా అన్నాడు రాజు.

"మిస్టర్ రాజూ! అనవసరంగా మాటలు జారబోకు. నీలాగే కబుర్లాడిన వాళ్ళెందరినుంచో రహస్యాలు కక్కించ గలిగిన ఈ హరి దగ్గర నీ వేషాలు, కప్పిగంతులు కుదరవు. నువ్వూ, నీ తల్లో జేజమ్మకూడా అసలు విషయం చెబుతుంది."

"శభాష్ హరి! అలా బుద్ధిచెప్పు. ఇప్పుడు నీ చేతికట్లు విప్పుతాను. ఈ పిస్తోల్ నీ వైపే గురిచూసి ఉంచుతాను. అతితెలివిని ఉపయోగించావో నామరూపాలు లేకుండా పోతావ్" అంటూ ఆ యువకుడు హరి చేతికట్లు విప్పి, కొద్దిదూరంలో నిల్చుని హరివైపు పిస్తోల్ గురి పెట్టాడు.

చేతికట్లు విడగానే రెండు చేతులూ కలిపి రుద్దుకున్నాడు.

"థాంక్యూ మిస్టర్! ఓ సిగిరెట్ ఉంటే ఇస్తావా?"

ఓ సిగిరెట్ వెలిగించి హరి కిచ్చాడు ఆ యువకుడు.

సిగిరెట్ పొగపీలుస్తూ, నెమ్మదిగా లేచి నిలబడ్డాడు హరి.

"మిస్టర్ రాజు, అదెక్కడ దాచావో చెప్పేయ్. లేకపోతే అంతకన్నా విలువైన నీ ప్రాణం పోగొట్టుకోవలసి వస్తుంది. పాపం! నీ తల్లిదండ్రులు నీ జాడ తెలియక చాలా అవస్థ పడుతున్నారు."

"డర్టీ ఫెలో! నిన్ను చూస్తేనే అసహ్యం వేస్తున్నది. నేను డిటెక్టివ్ నవలల్లో చదివిన డిటెక్టివ్స్‌కు, నీకూ ఎక్కడా పోలికేలేదు. వాళ్ళు తమ క్లయింటును రక్షించ డానికి ప్రాణాలు సైతం ఇవ్వడానికి సిద్ధపడతారు. కాని నువ్వు పిరికిపందలా వాడితో చేతులు కలిపావు. ఏమైనా సరే నేను మాత్రం ఏమీ చెప్పను."

"షటప్! నోటికొచ్చినట్లు మాట్లాడకు...." అంటూ రాజు దవడపై ఒక్కటిచ్చాడు హరి.

రాజు బుగ్గపై ఐదువేళ్ళు అచ్చు తేరాయి. అది చూసి హరి మనసులో విపరీతంగా బాధపడ్డాడు. అయినా తప్పదు. ఏదోలా ఆ యువకుణ్ణి నమ్మించి, బోల్తా కొట్టించాలి.

"హ—హ—హ...." అని బిగ్గరగా నవ్వాడు ఆ యువకుడు.

"చూసావా రాజూ! ఆ డిటెక్టివ్‌కంటే నేనే నయం కదూ? అయినా అప్పుడే ఏమయింది. ముందుంది ముసళ్ళపండగ. ఇంకా చిత్రహింసలకు గురికాకముందే బుద్ధిగా చెప్పేయ్."

రాజు కట్లు గుండెలవరకే కట్టి ఉండడం గమనించిన హరి. రాజుకి కనుసైగల ద్వారా ఏదో సంజ్ఞ చేసాడు.

"మిస్టర్ రాజు! ఆఖరిసారిగా చెబుతున్నాను. అదె క్కడ దాచావో చెప్పు. లేకపోతే కాలుతున్న ఈ సిగిరెట్



సరాసరి నీ కంట్లోకి వెళుతుంది. నీ చూపు, జీవితం రెండూ అంధకారం అవుతాయి...." అని హెచ్చరిస్తూ హరి, రాజుకి మరింత దగ్గరగా వెళ్ళాడు.

అంతే! రాజు తన కాళ్ళతో హరిని ఒక్కతాపు తన్నాడు. హరి దొర్లుకుంటూ వెళ్ళి ఆ యువకుడిపై పడ్డాడు.

అనుకోని ఈ సంఘటనవల్ల ఆ యువకుని చేతిలోని పిస్తోల్ జారిపడడం, అతను కూడా క్రిందపడడం ఒక్కసారే జరిగాయి. హరి ఆ యువకుణ్ణి కదలకుండా పట్టుకున్నాడు.

ఆ యువకుడు హరి పట్టునుండి విడిపించుకుని, పిస్తోల్ అందుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇద్దరి మధ్య పెనుగులాట ప్రారంభమయింది. ఇద్దరి లోనూ పట్టుదల, కోపం ఎక్కువయ్యాయి.

హరి చేతులైతే లూజ్‌గా వున్నాయిగాని కాళ్ళు కట్టబడే ఉన్నందున ఈజీగా కదలలేకపోతున్నాడు.

"హాండ్సప్!" పిడుగులా ధ్వనించింది ఆ గదిలో.

గుమ్మందగ్గర నిల్చున్న డిటెక్టివ్ శ్రీనాథ్ చేతిలో రివాల్వర్ పొగలు కక్కుతోంది. అతని వెనకే పోలీసులు బిలబిలమంటూ ప్రవేశించారు. క్షణంలో ఆ యువకుడి చేతులకు సంకెళ్ళు పడ్డాయి.

"మిస్టర్ మోహన్‌రావ్! రోజు లెప్పుడూ ఒకలాగే ఉంటాయనుకోకు. దుర్మార్గులకు, అవినీతిపరులకు శిక్ష తప్పదు. నేరస్తులందరూ ఏదో ఒకరోజు చట్టం ముందు తలవంచక తప్పదు. అత్యాశకుపోయి, వ్యసనాలకు, అవినీతికి బానిసవై బంగారంలాంటి బ్రతుకు, భవిష్యత్తు నాశనం చేసుకున్నావు. నిన్ను నమ్మిన స్నేహితుడి ప్రాణం కూడా తీయడానికి సిద్ధపడ్డావు. నీలాంటివాళ్ళకు ఏం శిక్ష విధించాలో న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి." అన్నాడు డిటెక్టివ్ శ్రీనాథ్.

7

శ్రీనాథ్, హరిలను అభినందించే నిమిత్తమై హోటల్ మధులతలో డిన్నర్ ఏర్పాటు చేయబడింది. అందరి కోరికపై డిటెక్టివ్ శ్రీనాథ్ తను ఆ కేసు ఎలా పరిశోధించింది వివరించడం ప్రారంభించాడు.

"నిజానికి ఈకేసు చాలా సాధారణమైనది. ఇందులో హత్యలుగాని కొట్లాటలుగాని కనిపించవు. పరంధామయ్యగారు వాళ్ళ అబ్బాయి రాజు కనిపించడం లేదని దర్యాప్తు చేయమని కోరారు.

పరంధామయ్యగారు పెద్ద శ్రీమంతులు కారు. ఒక చిన్న ఫ్యాన్సీషాపు యజమాని మాత్రమే. అందువల్ల రాజుని ఎత్తుకుపోయి పరంధామయ్యగారినుండి ఎవరైనా డబ్బు గుంజడానికి ప్రయత్నిస్తున్నారని అనుకోడానికి ఆస్కారం లేదు.

అలా కానప్పుడు ఇంట్లో ఘర్షణపడి రాజు పారిపోయి ఉండాలి. రాజు ఇంటినుండి పారిపోడానికి తగిన సాక్ష్యాధారాలు లేవు.

ఈలోగా హరి దర్యాప్తు ప్రారంభించాడు. ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక ఎలిబీ వుంది.

కాని, మోహనరావు సృష్టించుకున్న ఎలిబీయే అతనిని పట్టిచ్చింది.

హరి, మోహన్‌రావు చూపిన టికెట్ నంబర్లు బాగా జ్ఞాపకం ఉంచుకుని థియేటర్లకువెళ్ళి వాకబు చేసాడు. ఆ రెండూ ఆ రోజు అమ్మబడినవే.

అయితే ఆరోజు వెంకటేశ్వరా థియేటర్‌లో విశ్రాంతి దాటిన అరగంట తరువాత కరెంటుపోయి తిరిగి రాలేదు. ఆ థియేటర్‌కు జనరేటర్ లేనందువల్ల పాసులు ఇచ్చి తరువాత ఆటకు రమ్మన్నారు.

కాని మోహన్‌రావు, హరితో తాను మ్యాట్నీచూసి ఆరుగంటలకు వచ్చానని, తర్వాత ఫస్ట్‌షో కెళ్ళానని చెప్పాడు. అంటే అతను పూర్తిగా మేట్నీలో చిత్రం చూడలేదన్నమాట.

అప్పుడే మా అనుమానం మోహన్‌రావుపై మళ్ళింది. అతను 1-80 పైసల టికెట్టు కొన్నాడు. అక్కడి గేట్‌మేన్‌ను కలసి మోహనరావుని వర్ణించి అడగ్గా, మోహన

రావు విశ్రాంతి ఇవ్వడానికి కొద్ది నిముషాలముందే పాస్ తీసుకుని వెళ్ళిపోయి తిరిగి రాలేదని, అందుకు ఆరోజు ఔట్‌పాస్ ఒకటి తక్కువైందని చెప్పాడు.

మేట్నీ చూస్తున్న మోహన్‌రావు ఆత్రుత పట్టలేక మధ్యలోనే సినిమా విడిచి, రాజును బంధించిన స్థలానికి వెళ్ళిపోయాడు. అయితే అతను రాజును ఎందుకు బంధిస్తాడు? ఇదే మాకు అర్థంకాని ప్రశ్న.

నేను మస్తాన్‌ను కొన్ని విషయాలను అడుగుదామని వెళ్ళగా షాపులో అతను లేడు. అతనికోసం వెయిట్ చేస్తూ నిలుచున్నాను. ఈలోగా చాలామంది మస్తాన్ షాపుకి వచ్చి, లాటరీ టిక్కెట్ల గురించి పదేపదే అడగడం గమనించాను.

అంతే! నా ఆలోచనలు కొత్తదారి తొక్కాయి. నాలో చెలరేగుతున్న అనుమానాల్ని ఎలా నివృత్తి చేసుకోడమా? అని ఆలోచిస్తున్న నాకు షాపులో చిల్లరమల్లర పనులు చేసే కుర్రాడు తటస్థపడ్డాడు. వాణ్ణి మెల్లిగా లోబరుచుకుని అనుమానాలన్నీ నివృత్తి చేసుకున్నాను.

రాజస్థాన్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించిన పది లక్షల బంపర్ లాటరీలో రాజుకు ప్రథమ బహుమతి వచ్చింది. శలవురోజు అయినందువల్ల మస్తాన్ షాపు కొచ్చిన మోహన్‌రావుకి ఈ విషయం తెలిసి దుర్బుద్ధిపుట్టి రాజుదగ్గర ఆ టికెట్ అపహరించడానికి ప్లాన్ వేశాడు.

వెంటనే ఇద్దరు రౌడీలను నియమించి కాలేజీనుండి రాజును ఎత్తుకెళ్ళే ఏర్పాటు చేయించి, తాను సాక్ష్యం సృష్టించుకునేందుకు సినిమాకి వెళ్ళాడు. కాని ఆత్రుత భరించలేక మధ్యలోనే రాజును బంధించిన ప్రదేశానికి

వెళ్ళి ఆ టికెట్ ఎక్కడుందో చెప్పమని బ్రతిమాలాడు. కాని రాజు చెప్పలేదు'' అని ముగించాడు డిటెక్టివ్ శ్రీనాధ్.

"వాళ్ళు అంతగా బెదిరించి, అన్ని చిత్రహింసలు పెడుతున్నా రాజు రహస్యాన్ని ఎలా దాచగలిగాడో!?''....తన ఆశ్చర్యాన్ని ప్రకటించారు రంగసాయి మేష్టారు.

జవాబు చెప్పమన్నట్లు నవ్వుతూ రాజువంక చూసాడు శ్రీనాధ్.

"సాధారణంగా రహస్యం చెప్పమని మొదట బుజ్జగిస్తారు. తరువాత బెదిరిస్తారు. ఆ తరువాత చిత్రహింసలకు గురిచేస్తారు. ఆ రహస్యం చెప్పనంతవరకూ నా ప్రాణానికి ధోకా వుండదు. దాన్ని చెప్పేస్తే నా అవసరం తీరిపోతుంది గనుక నా ప్రాణం తీయడం ఖాయం. ఈ విషయాన్ని నేను డిటెక్టివ్ నవలలు, కథలు చదవడంవల్ల బాగా అవగాహన చేసుకున్నాను.అదే నాకు ఆత్మధైర్యాన్ని కలిగించడంవల్ల చివరివరకూ మొండిగా నిలబడగలిగాను. అయితే శ్రీనాధ్‌గారు, హరిగారు రంగంలోకి దిగకపోతే నా ఆత్మవిశ్వాసం ఎప్పుడు సడలిపోయి, ప్రమాదం వచ్చేదో చెప్పలేను. ఆవేశంలో అర్థం చేసుకోలేక హరి గారిని ఇష్టం వచ్చినట్లు దూషించాను, క్షమించాలి...." అన్నాడు రాజు.

"రాజూ! నీలోని చురుకుదనాన్ని, తెలివితేటల్ని ఇంకా అభివృద్ధిపరచుకుని, పెద్ద ఇంటలిజెన్స్ ఆఫీసర్ కావాలని ఆశిస్తున్నానోయ్," అన్నాడు డిటెక్టివ్ శ్రీనాధ్ రాజును ఆశీర్వదిస్తూ.

***

పి.వి.సుధాకరరావు

సోమరి

“ఏంనాయనా నీ కింకా టైం కాలేదూ....రోజూ నువ్విలా ఏడయినా ఆఫీసునంటి పెట్టుకొని వుండటం వల్లనే నువ్వేదో మంచి వర్కర్‌వనీ, మేమేదో సోమరిపోతుల మనీ, ఐద్దాటితే అరనిమిష ముండమనీ ఆ మేనేజరు గాడి దొకటే ఏడుపూ—ఇకలే బాబూ, నీకు దండము పెడతా” నా సీటుముందు కొచ్చి సుప్రభాతం ప్రారంభించాడు నా మిత్రుడు శేషగిరి.

“ఉండవోయ్—కాస్త ఈ టెండరు కూడా చూసొస్తా!

అప్పుడే ఇంటికెళ్ళి ఏం చెయ్యాలి?" అన్నాను, ఫైల్స్ వైపు దీర్ఘంగా చూస్తూ.

"ఒరేయ్! అసలు నువ్వు సంసారివా, సన్యాసివా?" వెటకారంగా చూస్తూ అన్నాడు వాడు.

"అదేంటిరా — అందమైన పెళ్ళాం — ముచ్చటగా ముగ్గురు పిల్లలూ వుంటేనూ....?" వచ్చేనవ్వును ఆపు కుంటూ అన్నాను, ఫైల్స్‌నుండీ దృష్టిని మరల్చకుండానే- నిజానికి నా కింకా పిల్లలు కలుగలేదు.

"యూ డామిట్....చెప్తే నీక్కాదూ? లే...." అంటూ నా చేతిలోని ఫైల్స్ లాగి టేబుల్‌పై గిరవాటేశాడు శేషగిరి.

కాసేపటిలో నవ్వుకుంటూ బయటి కొచ్చేశాం ఇద్దరం. మా ఇద్దరికీ చనువుంది. మా ప్రక్క వీధిలోనే అతనూ, అతని భార్యా వుంటున్నారు.

అలవాటు ప్రకారం పార్కులో ఓ అరగంట గడిపి, ఇద్దరం ఇండ్లకి బయల్దేరాం.

"ఈ వేళ పిక్చర్‌కి వెడితే ఎలావుంటుంది?" వస్తుంటే అన్నాడు శేషగిరి.

కాసే పాలోచించి, "రేపు వెళ్ళొచ్చుగా....ఎలాగూ ఆదివారం" అన్నాను.

"ఈవేళ వెళ్ళొచ్చి, రేపు రెస్ట్ తీసుకోవచ్చుగా" అన్నాడు పట్టు వదలనట్లు—

"అలాగే సెకండ్ షో కెళ్దాం."

నవ్వుకుంటూ ట్రంక్ రోడ్డుగుండా వస్తున్నాం—ఈ వేళెందుకనో రద్దీ జాస్తిగా వుంది. రేపు ఆదివారం రెస్టనే

సరికి, సాధారణంగా ఉద్యోగులంతా రాత్రి పదివరకూ అక్కడే తారాడుతుంటారు.

"సెకండ్ షో విషయం రమకి చెప్పాలిగా మరి— ముందుగా వెళ్ళాలి—ఆడవాళ్ళ అలంకారాలతో కూడిన విషయాల్లో కాస్త ముందు చూపుండాలి మనకి...."

అంతే!....

ఇద్దరం అరుస్తూ ఒకరి మీ దొకరం పడిపోయాము— నల్లటి అంబాసిడర్ కారు మమ్మల్ని ఫుట్ బాల్‌ను తన్ని నట్లు తన్నేసింది.

2

నేను కళ్ళుతెరిచి చూసేసరికి యెదురుగా యెవరో యువతి, కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ నా ముందే కూర్చుని వుంది. ఆ యువతిని యెక్కడో, యెప్పుడో చూసినట్లు గుర్తు.

ఎవరు....ఎవరామె?

అసలు నాకేం జరిగింది?

ఆఁ....కొద్ది కొద్దిగా గుర్తొస్తోంది. అవును....అంబా డర్ కారు....యాక్సిడెంట్ .... శేషగిరి .... అతని కెలా వుంది?ఆఁ....గుర్తొచ్చింది. ఈమె అపర్ణ....శేషగిరి భార్య. తన ముందలా శోకదేవతలా కూర్చోనుందేం? ఆమె నుదు టన బొట్టు....పర్లేదు....శేషగిరి బ్రతికే వున్నాడు.

నా ఆలోచనలకంతరాయం కల్గిస్తూ, "ఏమండీ" బోరు మంది అపర్ణ.

"ఏంటండీ....మీ వారి కేమయింది?" కంగారుగా అడి గాను. ఆమె టక్కున ఏడుపు ఆపేసింది.

నా కళ్ళలోకి గ్రుచ్చి చూసింది....నా మొహం తడిమి

చూసింది. ఏమనుకుందో ఏమో, చిన్నగా నవ్వింది నన్ను చూసి.

"ఏమండీ.... నేనండీ .... మీ భార్య అపర్ణని....గుర్తు రావడం లేదూ?"

ఖంగు తిన్నాను.

కంగారుగా నన్ను నేను చూసుకున్నాను. నాకేమీ గుర్తు రావడం లేదు. నా శరీరం ఏ విధంగా వుండాలో నాకు తెలీడం లేదు.

నాపేరు మాత్రం సుబ్బారావ్ అని గుర్తుంది.

మరి ఈవిడ శేషగిరి భార్య అపర్ణ....నన్ను తన భర్త అంటుందేవిటి? ఆవిడకేమైనా మతి చలించిందా? నేనసలు నేనేనా? అన్న అనుమానం కలిగింది నాకు. సందేహం లేదు నేను నేనే....P. W. D. ఆఫీసులో U.D.C ని.

"ఏవండీ....గుర్తొచ్చిందా....నన్ను గుర్తు పట్టారా?" ఏడుస్తూ అడుగుతోందా యువతి.

"తప్పమ్మా... నేను మీ భర్తనికాదు. మీభర్త ప్రక్క వార్డులో ఎక్కడో ఉంటాడు వెళ్ళండి." అన్నాను లేని ఓపిక తెచ్చుకుని సౌమ్యంగా.

ఈసారి ఆమె ఏడుపు నాపడం నా తరం కాలేదు.

"ఎందుకండీ అలా మాట్లాడుతారు. మిమ్మల్ని మీ రెండుకలా కించ పరుచుకుంటారు...."

తల పట్టకున్నాను.

అప్పుడే లోనికి డాక్టర్ వస్తున్న అలికిడయింది.

3

ఈరోజే హాస్పిటల్‌నుండీ విడుదలై బయటి కొచ్చాను.

నేను నీ మొగుణ్ణి కాను మొర్రో, అంటున్నా వినే స్థితిలో లేదా వెఱ్ఱి బాగులది!

అయినా, ఆమె మాటలు పూర్తిగా అసత్యాలు కావని పిస్తోన్నాయి. ఉదయం తనని చూడ్డానికి వచ్చిన తోటి ఆఫీసు వాళ్ళుకూడా "హలో శేషగిరీ", అనే విష్ చేశారు. తన తల తిరిగిపోయి పిచ్చెత్తేట్టుంది.

"పోనీ నేను శేషగిరినే, మరి సుబ్బారావ్ ఏమయ్యాడు?" ఇదే అడిగాను ఆమెని.

"ఆయన చనిపోయారు"....ఎవర్నడిగినా ఇదేమాట.

"హర హరా, సుబ్రావ్‌ని నేనే అంటే వినరేం యెవ్వరూ?" అదే డాక్టరు నడిగేశాను.

"యూ ఆర్ నౌ ఆల్‌రైట్ శేషగిరీ" అన్నాడాయన కూడా.

ఆ యమకూపం నుండీ బయటకి రాగానే ఇంటికి పోవాలన్నాను. వదిల్తేగా ఆ పిచ్చిది....పదిమంది చేతా

చెప్పించి, మరీ తనని ఇంటికి రిక్షాలో తీసుకొచ్చింది. ఇల్లంతా పరికించాను.

ఎలాంటి సందేహాలూ లేవు....ఆఫీసుకి పోవడానికి శేషగిరిని, ఈ వరండాలోనే నిల్చుని పిలిచేవాడిని. ఏవిటో ఈ మిస్టరీ....నా కయితే తల తిరిగిపోతున్నది.

ఆకలిగా ఉంది....వారంనుండీ ఆ హాస్పిటల్లో బ్రెడ్డూ, పాలతో, నాలిక రుచి తెలపడం మానేసింది.

అందుకే ఉప్మాచేసి, ప్లేట్లో తేగానే సుష్టుగాతిని బ్రేవ్‌న త్రేన్చాను.

అపర్ణ చేతివంట అంత రుచిగా ఉండేదన్నమాట— పాపం వాడు చనిపోయాడు. అందరూ, వాడే నేనని భ్రమ పడుతున్నారు.

ఆఫీసుకి మరోవారం శెలవు గీకేశాను-లీవ్ పంపే ముందు అడుగునవున్న పేరును చెక్‌చేసి మరీ పంపించింది, ఈ టెంపరరీ వైఫ్, అపర్ణ. ఆమెకోసం శేషగిరి సైన్ నే చేసేను.

పాపం, ఆమె చూస్తే జాలేస్తోంది. మెంటల్ ఎఫెక్ట్ వల్ల తననే, భర్తగా అనుకుంటోంది. బహుశ, తన భర్త చనిపోయాడనేసరికి ఆమె బ్రెయిన్ దెబ్బ తినుంటుంది. మరి మిగతావారి సంగతి? రామరామ ఏమిటీ మిస్టరీ.

4

రాత్రి ఆమెని వదిలించుకునేసరికి నా తలప్రాణం తోక్కొచ్చింది. ఆమెని దూరంగా వుంచితే, మరలా ఏడుపు లంకించుకొని నా ప్రాణం తీస్తుందని, దగ్గరికి తీసుకున్నట్లు నటించి నడుం పట్టుకున్నట్లు విలవిల్లాడేను కాసేపు.

అంతే-అర్ధరాత్రప్పుడు కాపటం - ఆ తరవాత పాపం మాట్లాడకుండా నిద్రపోయింది.

ఇలా ఎంత కాలం? క్షమించు శేషగిరీ. అప్రయత్నంగా ఉబికిన కన్నీటిని తుడుచుకుని ప్రక్కకి చూశాను.

ఆదమరిచి నిద్రపోతోంది అపర్ణ.

మరి నా పెళ్లాం రమ సంగతేమిటి?

మెడి బోసి చేసుకుందేమో? ఈ మాట అనుకునేసరికి ఠక్కున లేచాను.

మెల్లిగా వీధివాకిలి తెరిచి, చప్పుడు కాకుండా బయటి కొచ్చాను.

ప్రక్కవీధిలో నా యింటి ముందుకొచ్చి ఆగాను.

లోపలెక్కడో గుడ్డిగా దీపం వెలుగుతోంది. ఇల్లంతా బోసిగా వున్నట్లపించింది.

ఆతృతగా తలుపుని సమీపించి తోశాను. దగ్గరికి వేసి వుంది. అందువలన శబ్దం కాకుండా తెరుచుకుంది. లోనికి తొంగి చూశాను.

ఆ వెంటనే నా కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

నా ముద్దుల రమ.

మంచంమీద పడుకొనివుంది. ఆమె ధరించిన తెల్లటి చీర నా గుండెలు చీలుస్తున్నట్లనిపించింది. ఆమె వెక్కిళ్ళు లీలగా విన్పిస్తున్నాయి.

"రమా" ఉండలేక అరిచాను పెద్దగా.

ఉలిక్కిపడి లేచి కూర్చుంది రమ.

"మీరా?" అంది ఆశ్చర్యంగా.

"అవును రమా నేనే నీ భర్తను. నేను బ్రతికే వున్నాను రమా - ఏంటి-మంగళసూత్రాలు తెంచేశావా?" చేతులతో ముఖాన్ని కప్పుకున్నాను ఏడుపు ఆపుకోలేక.

"మీకు మతిపోయిందా?". దరిదాపుగా అరుస్తూ నన్ను సమీపించింది రమ.

"లేదు రమా-ఇంకాసేపు నిన్నలాగే చూస్తే తప్పక పోతుంది. వెంటనే పసుపు పట్రా. ముత్తయిదువ చీర కట్టు....కో...." అంతే నా చెంప చెళ్లుమంది.

"శేషగిరిగారూ, దయచేసి వెళ్ళిపొండి. ఆయన పోయిన అలుసు తీసుకుని మీరలా ప్రవర్తిస్తే, నా శవాన్ని కళ్ళ జూస్తారు" నిప్పులు చెరిగే కళ్ళతో అంది రమ.

"రమా."

రమ యింకేం మాట్లాడకుండానే నా మొహంమీదే తలుపు వేసుకుంది.

భగవాన్ నేను....నేనెవరిని?

5

మరునాడు తప్పనిసరిగా ఆఫీసుకి బయలుదేరాను.

"లీవ్ ఇంకా నాల్రోజులుందిగా. హాయిగా రెస్ట్ తీసుకో గూడదూ!" అంది అపర్ణ ఉరఫ్ నా భార్య.

"అబ్బే, ఇంట్లో తోచడం లేదు" అన్నాను.

ఇంక ఇలాగే నాల్రోజులున్నానంటే నేను అపర్ణకి లోబడడం, రమని మర్చిపోవడం, శేషగిరి నేనేననీ నమ్మడం ఖాయం!

బయల్దేరుతుంటే వచ్చింది అపర్ణ.

"మరి నా మామూలు ఇచ్చివెళ్ళరూ."

తెగించేశాను.

నా పెళ్ళాం నన్ను కాదంది. వేరొకరి పెళ్లాం నీవే నా మొగుడంది.

ఈ మిస్టరీ తేలేవరకూ, నేనూ దాంట్లో లీనం కాక తప్పదు. మనసులో శేషగిరికి క్షమాపణ చెప్పుకుని, అపర్ణని దగ్గరగా లాక్కుని, ముద్దుపెట్టుకున్నాను.

విచిత్రంగా చూసింది అపర్ణ.

"ఏం తప్పా?" అన్నట్లు చూశాను.

"వెరీగుడ్! మీరు మామూలు మనిషవుతున్నారు" సంతోషంగా అంది.

నిట్టూరుస్తూ ఆఫీసుకి బయల్దేరాను.

ఆఫీసులో శేషగిరి స్థానంలో కూర్చున్నాను. ఎదురుగా ఖాళీగాఉన్న నా సీటుని చూసుకుంటే ఏడుపొచ్చింది.

మరలా నన్నోమారు చూసుకున్నాను.

నా కళ్ళకి నేను సుబ్రావ్‌లానే ఉన్నాను. కాకుంటే శేషగిరి దుస్తులు ధరిస్తున్నాను. నా ముఖం, శరీరం మాత్రం నాకు గుర్తురావటంలేదు. విచిత్రంగా ఉంది.

శేషగిరి తాలూకు ఫైల్స్ అర్థం కావడానికి నాకు చాలా టైం పట్టింది. అలాగే తంటాలుపడి, మేనేజరుగారికి సమర్పించాను తప్పుడు ఇన్‌ఫర్మేషన్స్‌తో.

"చూడు శేషగిరీ, నీవు మరోవారం రెస్ట్ తీసుకుంటే బావుంటుందేమో" అన్నారాయన.

"అవసరం లేద్సార్" అన్నాను వినయంగా.

"ఫైల్స్‌కి అవసరం" అన్నారాయన సీరియస్‌గా.

అర్థమయినట్లు తలాడించి, ఉసూరుమంటూ బయటికొచ్చాను.

ఆరోజు ఏడుదాకా ఆఫీసులోనే ఉన్నాను, ఇంటికెళ్ళడం ఇష్టంలేక.

అందరూ ఆశ్చర్యపోయారు. శేషగిరికి ఈ అలవాటు లేదుగా మరి.

తప్పనిసరై తొమ్మిదింటికి ఇల్లు చేరాను.

అపర్ణ—నా కోసమే కాబోలు కళ్ళలో వత్తులేసుకుని, వాకిటముందు ఎదురుచూస్తోంది.

పాపం— పిచ్చిమనిషి— మరలా నాకేం అవుతుందో

నని భయం కాబోలు. అసలిదంతా తెలిసే చేస్తోందా—లేక కావాలని నటిస్తోందా?

"వచ్చారా. ఎంతసేపు ఆఫీసునుండీ రావడానికి? ఇంకా అరగంట చూసి నేనే రావాలనుకుంటున్నాను."

"ఎక్కడికి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆఫీసుకి."

ఆమె అమాయక కళ్ళల్లోకి గ్రుచ్చిచూసి ఏవో భావాలని పసిగట్టాలనుకున్నాను. కానీ నా ప్రయత్నం వ్యర్థమయింది.

ఆమె నిజంగా అమాయకురాలు.

ఆమెనలా ఊహించినందుకు తలవంచుకున్నాను సిగ్గుతో.

6

కళ్ళు మూసుకున్నా నన్నమాటే కానీ నిద్రరావడం లేదు. పదే పదే నా కళ్ళముందు రమ విధవరాలిగా కని పించి నా నిద్ర పాడుచేస్తున్నది.

ఆమెని మరవలేకుండా వున్నాను. అసలిదేం ఖర్మో అర్థం కావడం లేదు. నేను బ్రతికుండగా నా భార్య ముండ మోసేదేవిటి?

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్న నేను నా మీద మెత్తగా చేయి పడేసరికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

అపర్ణ నన్ను దగ్గరగా తీసుకుంటోంది.

"అపర్ణా" బాధగా నిట్టూర్చాను.

"ఊ—" అంది.

"నీవు....నాకు...." ఏదో చెప్పబోయాను. మాట్లాడ వద్దన్నట్లు చేతితో నా నోటిని మూసింది.

నా మొహం మీద తన మొహాన్ని పెట్టింది.

నేను ఏదో ఆవేశానికి లోబడుతున్నా ననిపించింది.

"అబ్బా" అన్నాను.

"నడుం నొప్పా!" అంది దూరంగా జరుగుతూ.

"ఊఁ" అన్నాను.

అటు మళ్ళీ పడుకుంది అపర్ణ....ఆమెకి బాధ కల్గిందని అర్థమయింది.

"అమృతాంజనం...." అన్నాను నిజమని నమ్మించ డాని కని.

"మందు అవసరం లేదు. అదేదో నే నిచ్చేశాను...." అంది మౌనంగా నిట్టూరుస్తూ.

"ఏ మిచ్చావ్?"

"నేను దూరంగా వచ్చానుగా...." అంది అటువైపు తిరిగి పడుకుంటూ.

ఏం చెప్పాలో అర్థంకాక మౌనంగా పడుకున్నాను. కాసేపటికి ఆమె వెక్కిళ్ళు లీలగా విన్పించాయి. అప్రయత్నంగా నా కనులనుండి రెండు కన్నీటిబొట్లు జారాయి—

7

యధాప్రకారం ఇల్లు చేరాను ఆరుగంటలకి—

ఇల్లు లాక్ చేసి వుండటం నా కాశ్చర్యాన్ని కల్గించింది. చెప్పకుండా ఎక్కడికి వెళ్తుంది అపర్ణ. ఏం జరిగింది? ప్రక్కింటికేమయినా వెళ్ళిందేమో? అంత ఆతృత నాలో ఎందుకు కలిగిందో అర్థంకాలేదు నాకు. అవును నాకు తెలీకుండానే ఈ నాలుగురోజులలో అపర్ణకి నేనెంతో చేరు వయ్యాను.

ప్రక్కింటికి వెళ్ళి "అపర్ణ ఎక్కడికి వెళ్ళిందీ చెప్పిందా అండీ" అని అడిగాను.

"ప్రక్కవీధిలో ఎవరో చనిపోయార్ట. చూట్టానికి వెళ్ళింది బాబూ" అన్నారామె.

అంతలోనే ఎక్కడో తప్పెట్ల మోతలు విన్పించాయి. ఆత్రుతగా పరుగెత్తానావైపు.

నేను - నేననుకుంది నిజమే అయింది. దూరంగా నా ఇంటినిండా జనం - చనిపోయానని ఈ లోకం నమ్ముతున్న నా ఇంటినిండా జనం.

నాకంటూ అమ్మా, నాన్నా లేకున్నా, రమకి అంతా వున్నారు. కానీ ఏనాడు ఎవ్వరూ నా ఇంటికి వచ్చి ఎరుగరు. కాదు రానిచ్చేదికాదు రమ.

మాది ఇంటర్‌కేస్ట్ మారేజ్. నల్గురూ నాలుగు విధాల వచ్చి మాట్లాడ్డం దాని కిష్టంలేదు.

కానీ ఆమె అదృష్టం!-ఆ నలుగురే ఉన్నారామె చుట్టూ కానీ లేనిదల్లా ఆమే. చనిపోయాడనుకున్న నా దగ్గరికి ఆత్రుతగా ప్రయాణం కట్టింది.

"పాపం! భర్తని మరచిపోలేక, ఎండ్రిన్ తాగిందా ఇల్లాలు."

ఆ జనాల మాటలు వినలేక ఓమూల కూలబడ్డాను.

నాకు ఇంకెవరున్నారు బ్రతకడానికి? ఒక్కసారిగా పిచ్చిపట్టినట్లయింది.

"రమా" తట్టుకోలేక అరిచాను గట్టిగా.

8

"మీరు బాగా షాక్ తిన్నారు. అసలు మిమ్మల్నెవరు రమ్మన్నారిక్కడికి? ఏదో స్నేహితురాలు చనిపోయిందంటే వుండబట్టలేక వెళ్ళాను నేను" ఒక పసిబిడ్డని బుజ్జగించి నట్లు నన్నుతన ఒడిలో బుజ్జగించింది అపర్ణ.

ఎన్నో భావాలని, ఎన్నెన్నో విషయాలని చెప్పాలని నోరు తెరిచాను. కానీ మాటలు రావడంలేదు.

"అపర్ణా-నీవు నన్ను అపార్థం చేసుకోవుగదూ?" దరి దాపు ఏడుస్తున్నట్లడిగాను.

"ఛ. ఛ. ఏం మాటలండీ. అసలు నేనక్కడికి వెళ్ళ కుండా వుండాల్సింది. మీరు మరీ చిన్నపిల్లాడై పోతున్నారు."

బుజ్జగిస్తూ నా నుదుటిన ముద్దుపెట్టుకుంది అపర్ణ.

ఆ రాత్రి తిరిగి పడుకున్న అపర్ణని బలవంతంగా ఇటు త్రిప్పి, నా కౌగిలిలో బంధించాను. ఆమె కిలకిలారావాలతో సర్వం మరిచిపోయి వేరే లోకాల్లో విహరించానా రాత్రి.

9

ఉదయం ఆఫీసులో కూర్చున్నా ఆలోచనలన్నీ అపర్ణ మీదే వున్నాయి. ఆమె ననుభవించి పాపం మూటకట్టు కున్నానా? అన్న ప్రశ్న పదేపదే వేసుకున్నాను నన్నునేను.

ఏమయితేనేమి ఒక నిర్ణయానికొచ్చాను.

కట్టుకున్నదాన్నెలాగూ సుఖపెట్టలేక పోయాను, కనీసం నమ్ముకున్నదాన్నయినా సుఖపెట్టాలి.

ఈవేళ్టికి సుబ్రావ్ పూర్తిగా చనిపోయాడు. ఇకపైన నేను శేషగిరినే.

ఆఫీసునుండీ ఐదుగంటలకే ఇంటికి బయల్దేరాను.

ఈవేళ అపర్ణని పిక్చర్‌కి తీసుకెళ్ళాలి. అందని ఎన్నెన్నో అందమైన కోరికల అంచులు ఆమెలో వెదకాలి.

ఇంటికి వెళ్ళాను.

అపర్ణ నాకు వాకిట్లో చిరునవ్వుతో ఎదురొస్తుందని ఊహించిన నాకు నిరాశే ఎదురయ్యింది.

చిన్నగా ఈలేస్తూ లోనికి ప్రవేశించాను.

తలుపు త్రోసిచూసిన నేను త్రాన్పడిపోయాను.

గ్రుడ్లు తేలేసి మంచంమ్మీద పడి వుంది అపర్ణ!

కాస్త దూరంలో మూతంతా రక్తంతో ఆ యువకుడు అతను.... అతను.... శేషగిరి!!

"యూ స్టుపిడ్-ఏంచేశావామెని?" అరిచాను ఉద్రేకంగా.

కీచుగా నవ్వాడు శేషగిరి.

ఒక్క నిమిషం అతని వాలకానికి భయపడ్డాను.

"అసలు నీవు మనిషివా? దయ్యానివా?"

అదే కీచు నవ్వు!

అతని దగ్గరగా వచ్చాను. ఆ కళ్ళని పరీక్షగా చూశాను. ఆ కళ్ళలో రక్తంలేదు. తెల్లగా పాలిపోయి వున్నాయవి. భయంతో బిక్కచచ్చిపోయాను.

అయితే అంతలోనే నన్నేదో మైకం ఆవహించింది. అతను వెనుదిరిగి బయటికి నడిచాడు. వద్దనుకుంటున్న నన్ను ఏదో శక్తి బలవంతంగా ముందుకు తోసింది. అతడి వెనుకనే కుక్కలా అతడిని అనుసరించసాగాను.

"శేషగిరీ! నీ భార్యని నా భార్యగా చూడ్డానికి కారణం" ఏదో చెప్పాలనుకున్నాను. గొంతు పెగల్లేదు.

"నన్నెక్కడికి తీసుకెళుతున్నావ్?"

అరవాలనుకున్నాను. కాని అరవలేకపోతున్నాను.

రోడ్లుదాటి చాలా దూరం వచ్చాము. ఊరు చివరకి వస్తున్నాం.

"నన్ను వీడు లాక్కుపోతున్నాడు. రక్షించండి" నాకు తెలిసిన మిత్రులు కనిపించినప్పుడల్లా అరుస్తున్నాను కానీ మాటలు నా నోట్లోనే వుండిపోతున్నాయి.

ఏదో శక్తి నన్ను ఆవహించింది. అందరూ వింతగా నన్ను చూసి తమదారిన తాము పోతున్నారు.

ఊరి ఇవతల మెయిన్‌రోడ్ దాటి బ్రిడ్జిమీది కొచ్చాం. క్రింద పెన్నానది జోరుగా ప్రవహిస్తోంది.

బ్రిడ్జికి ప్రక్కన కట్టివున్న ఇనుపకమ్ముల ప్రహారీని ఎక్కాడు శేషగిరి. వద్దనుకుంటూనే నేనూ ఎక్కాను.

మరునిమిషం—

ఏదో శక్తి నన్ను తోసింది క్రిందికి.

భయంకరంగా అరుస్తూ నదిలోకి పడిపోయాను.

10

డాక్టర్ కిరణ్ కుమార్ దగ్గరికి పరిగెత్తుకెళ్ళాడు, అసిస్టెంట్ డాక్టర్ రామకృష్ణ.

"సార్!"

కిరణ్‌కుమార్ రివాల్వింగ్ ఛేర్‌లో అటుమళ్ళి కూర్చుని వున్నాడు. ఆయన కళ్ళు ఏకాగ్రతగా చేతిలోని డైరీలోని ఒక పేజీవైపు చూస్తున్నాయి. చెమర్చిన కళ్ళని తుడుచుకుంటూ "ఏమిటి?" అన్నాడాయన.

"శేషగిరి చనిపోయాడు సార్! కాదు ఆత్మహత్య చేసుకున్నాట్ట. శవాన్ని పోస్ట్‌మార్టంకని తెచ్చారు."

"విన్నాను" బాధగా అన్నారాయన.

"పాపం, మంచివ్యక్తిసార్!"

"అవును. సుబ్బారావ్ మంచి వ్యక్తే. కాని దురదృష్ట వంతుడు."

"సుబ్బారావా?" ఆశ్చర్యంగా అడిగాడు రామకృష్ణ.

సమాధానం ఇవ్వలేదు ఆయన. ఆయన కళ్ళు మళ్ళా ఆ డైరీలోని పేజీవంక చూశాయి. అందులో ఇలా వ్రాసి వుంది.

"ఈరోజు నేను ఒక గొప్ప ప్రయోగాన్ని సాధించాను. ఒక డాక్టర్‌గా నాకే గర్వకారణంగా వుంది. నా కారుక్రింద ఇద్దరు వ్యక్తులు పడ్డారు నిన్న. పాపం, ఒకడు చనిపోయాడు. మనిషి చనిపోయిన ఐదారు గంటలవరకూ మైండ్ బాగానే వుంటుంది. రెండో వ్యక్తి తల పచ్చడైపోయింది. ఆ వ్యక్తి బ్రతికినా పిచ్చివాడుగా బ్రతకాల్సి వుంటుంది.

అందుకే ఎన్నాళ్ళుగానో నేను చెయ్యాలనుకున్న ప్రయోగానికి అతన్ని ఒక వస్తువుగా వాడుకున్నాను. అయితే నా ఎక్స్‌పరిమెంట్ సక్సెసయింది. చనిపోయినతని మెదడును, బాగున్నతనికి మార్చాను. అతను బ్రతికాడు. ఇందువలన అతని శరీరం వేరే మనిషిదైనా, అతనికి ఆ భేదం తెలియదు.

కానీ నా దురదృష్టం ఈ ప్రయోగం లోకానికి వెల్లడి చేయలేను. అందువలన అతని జీవితం సర్వనాశన మవుతుంది. నా కీర్తికోసం అతని జీవితాన్ని పణంగా పెట్టలేను. నాకీ తృప్తి చాలు."

అతని కళ్ళు ఆఖరిలైను దగ్గర ఆగిపోయాయి. ***

త్రిబ్యుటెన్స్

గీతారాణి

పాఠకుల పరిశోధన పోటీ-76

(బహుమతి రు. 50/- నగదు)

శాంత హాలులో కూర్చొని ఏదో నవల చదువుతున్నది.

పని మనిషి లచ్చి తడి గుడ్డతో ప్రక్కగది తుడుస్తూ, సన్నగా కూనిరాగం తీస్తున్నది.

అంతలో "హలో, శాంతా" అన్న పిలుపు వినపడి, గుమ్మలోకి చూసింది శాంత.

ఆమె పెదవులు సన్నగా 'ప్రసాద్' అని పిలిచాయి.

ప్రసాద్ కళ్ళతోనే తియ్యగా నవ్వి, "హలో డార్లి...." అని అనబోయాడు.

శాంత తీవ్రంగా చూడటంతో ఆగిపోయాడు.

"ఇక్కడకి ఎలా రాగలిగావు?" శాంత చిరాగ్గా ప్రశ్నించింది.

ప్రసాద్ జేబుల్లోకి చేతులు పోనిచ్చి—"మనసుంటే మార్గం లేదా," అన్నాడు తమాషాగా.

శాంత కళ్లు చిరాకుతో ముడుచుకొన్నాయి.

"మనసు. ఇక్కడ నీపై మనసుపడే వ్యక్తులు ఎవరూ లేరు?"

"నువ్వే శాంతా నా మనసు, మనుగడ. నీ ప్రసాద్‌ని అప్పుడే మరచిపోయావా? కాలేజీలో ఇద్దరం కలసి చదివే టప్పుడు నీవే నేను, నేనే నీవు అనేలా వుండే వాళ్ళం. నేనే నీ సర్వం అనే దానివి నీవు. ఒకరి కౌగిలిలో ఒకరం కరిగిపోతూ...."

అతని మాటలు పూర్తి కాకుండానే "స్టాపిట్?" అర చింది శాంత అసహనంగా. చురుగ్గా చూసాడు అతను.

"ఏం శాంతా! నా మాటలు చేదుగా వున్నాయా?"

"నువ్వే చేదుగా వున్నావు," శాంత అసహ్యంగా ముఖం పెట్టింది.

ప్రసాద్ ముఖం కుంకం పువ్వు రంగులోకి మారి పోయింది.

"అంత తొందరగా నన్ను మరచిపోయావా?"

"అవును" ముభావంగా అంది.

అతని వదనం నల్లగా మాడిపోయింది.

"శాంతా! నేను మాత్రం నిన్ను మరచిపోలేను. ఆ రోజు మా అమ్మ చావు బ్రతుకుల్లో వుందంటే, నీతో చెప్పే అవకాశం కూడా లేకుండా మావూరు వెళ్ళిపోయాను. నేను వెళ్ళే సరికి అమ్మ చనిపోయింది. ఆ దుఃఖంలో నీకు లెటర్ వ్రాయలేక పోయాను. ఆ తరువాత దురదృష్టం నాతో స్నేహంచేసింది. స్కూటర్ ఆక్సిడెంట్ అయి కొద్ది రోజులు చావు బ్రతుకుల మధ్య వూగిసలాడాను.

రెండు నెలలు తర్వాత మీ వూరు వచ్చాను. అప్పటికే నీకు పెళ్ళి అయిపోయిందని, నువ్వు నీ భర్తతో ఈ వూరు వచ్చేసావని తెలిసింది. ఆ తెలిసిన క్షణాన నాకు ప్రపంచమే శూన్యంగా, నాకు జీవితమే వ్యర్థంగా అనిపించింది. పిచ్చి వాడిలా అయిపోయాను. ఉద్యోగ ధర్మం నిర్వర్తించాలి కనుక యెలాగో వుద్యోగం చేసే వాడిని.

నా అదృష్టమేమో నాకు ఈవూరు ట్రాన్స్ఫర్ అయింది. నీకోసం వూరంతా గాలించటం ప్రారంభించాను. నాకు మీ పిన్ని అడ్రస్ ఇవ్వలేదు. ఇస్తే సరాసరి నీ ఇంటిలోనే దిగేవాడిని. ఆఖరికి నిన్న సాయిత్రం నువ్వు బిర్లామందిర్ దగ్గర కనిపించావు. పరిగెట్టి నీ దగ్గరికి వచ్చేసరికి నీ కారు తుర్రుమంది. వెంటనే ఓ టాక్సీ ఎక్కి నిన్ను ఫాలో అయి, నీ ఎడ్రస్ తెల్సుకొన్నాను. నీ ఇంటిలోకి రావాలను కొంటుండగా నీ భర్త కారులో రావటంచూసి, నిరాశగా వెనక్కి వెళ్ళిపోయాను. ఇప్పుడు అతను ఇంటిలో లేక పోవటం చూసే వచ్చాను.

శాంతా! నా మీద నీకు ప్రేమ లేదూ అంటే నేను నమ్మను. నువ్వు నీ భర్తతో తప్పనిసరిగా కాపురం చేస్తు న్నావు. నీ మనసంతా నాపైనే. నీ సొగసు నా కోసమే. యిది అక్షరాల నిజం...."

"నోరు ముయ్" శాంత నిప్పులు చెరిగే కన్నులతో చూసింది.

"ప్రసాద్! నువ్వు నన్ను వంచించావనే అప్పుడు అనుకొన్నాను. పిన్ని నా పీడ వదిలించుకొనేందుకు శ్రీనివాస్‌తో పెళ్లిచేసేంది. పవిత్రమైన భారత గడ్డపై పుట్టిన స్త్రీని నేను. ఇప్పుడు నా దైవం నా భర్త. నా మది నిండా నిండి వున్నది ఆయన రూపం, నీ రూపం కాదు. ఏనాడైతే నాకి చరామి అంటూ పదిమంది పెద్దలముందు నా మెడలో పవిత్రమైన మాంగల్యాన్ని కట్టారో ఆనాడే ఈ శాంత ఆయన స్వంతమైపోయింది. నిండు హృదయంతో, రెండుచేతులూ చాచి, ఆయన్ని మదిలోని ఆహ్వానించాను. నీ రాక నా జీవితానికి గొడ్డలిపెట్టు కాకుండా వెళ్ళిపో. నచ్చిన అమ్మాయిని పెళ్లాడి జీవితాన్ని సుఖమయం చేసుకో," శాంత సౌమ్యతగా, నచ్చచెప్తున్న ధోరణిలో చెప్పింది.

ప్రసాద్ ముఖం రక్తారుణిమను దాల్చింది.

"శాంతా! ఈ ప్రసాద్‌ని పూర్తిగా చదివిన ఆడదానివి నీవే. అందరానిది అందుకోవటం, సాధించ లేనిది సాధించటం ఈ ప్రసాద్‌కి భగవంతుడు ఇచ్చిన వరాలు. నిన్ను నా భార్యగా చేసుకొని, అమరసుఖాన్ని పొందాలని కలలు కన్నాను. ఆ కలలు నీవే చెదర గొట్టటం నేను సహించను. నీ పొందు కావాలి నాకు. ఆ విందు నా కదించావంటే నా కల నెరవేరినట్లే భావించి, నీ లైఫ్‌లోంచి మైనస్ అయిపోతాను." ప్రసాద్ కళ్ళలో కామం పడగెత్తింది. అతని నరనరాలలో కోర్కె కదనుతొక్కింది.

శాంత భద్రకాళిలా చూసింది.

"ప్రసాద్! మరొక్కసారి పిచ్చిగా మాట్లాడితే నా

కాలి చెప్పుతో పళ్లు వూడగొడతాను. నా చేత దెబ్బతిన కుండా నా కళ్ళముందునుంచి మంచిగా వెళ్ళిపో!"

"శాంతా! చూస్తూవుండు, నువ్వు నీ భర్తతో యెలా కాపురం చేస్తావో చూస్తాను. నువ్వు నాకు దక్కనపుడు, ఆ శ్రీనివాస్‌కి కూడా దక్కకూడదు. నిన్ను మా ఇద్దరికీ కాకుండా చేస్తాను. నిన్ను చంపి నాకసి తీర్చుకుంటాను." అని పిచ్చిపట్టిన వాడిలా అరుస్తూ వెళ్ళిపోయాడు.

2

"హలో, డార్లింగ్...." శ్రీనివాస్ మేడదిగి వస్తున్న భార్యని చూసి గాలిలోకి ముద్దు విసిరాడు.

శాంత చిలిపిగా నవ్వింది.

లచ్చి ఓరగా చూస్తోంది ఫ్లవర్ వాజ్ తుడుస్తూ.

"నేను దింపనా" శ్రీనివాస్ ఓ మెట్టు ఎక్కుతూ కొంటెగా అన్నాడు.

"నేనేం సుకుమారిని కాను. దిగివస్తాను" శాంత చిరు నవ్వుతో అంటూ క్రిందకి దిగింది.

ఇద్దరూ కలసి యెదురుగా కుర్చీలలో కూర్చున్నాక శాంత "ధర్మన్నా" అని కేకవేసింది. ఆమె కేక వెనుకే వంటమనిషి ధర్మన్న ట్రే తోవచ్చాడు.

శాంత ట్రే అందుకొని, టిఫిన్‌ప్లేటు శ్రీనివాస్ ముందు వుంచింది.

ధర్మన్న దూరంగా నిలుచున్నాడు ఆ ఇద్దర్నీ చూస్తూ.

"శాంతా! నేను వెళ్లిపోవాలి," శ్రీనివాస్ టిఫిన్ తీసు కొంటూ అన్నాడు.

"వెళ్ళక తప్పదుగా మరి? అయినా ఆ ఫ్యాక్టరీ అమ్మి వేసి, ఇక్కడే ఏదైనా వ్యాపారం పెట్టుకో రాదూ! శని వారం, ఆదివారం తప్పించి, మిగతా రోజులన్నీ ఆ ఫ్యాక్ట

రీకే అంకితం చేసేసారు. నా కిదేం నచ్చలేదు,” శాంత అలుకగా అంది.

“ఎలా శాంతా! అంతటి ఫ్యాక్టరీ వదులుకు రావటం? పోనీ ఈ ఇల్లు అమ్మేసెయ్. ఇద్దరం అక్కడే వుందాం,”

“రామ, రామా” శాంత ఆమాట ఏదో అపరాధం అన్నట్లు చెంప లేసుకొంది.

“ఈ ఇల్లు అమ్మటమా? మీ నాన్నగారు చనిపోయే ముందు యెలాంటి పరిస్థితిలో ఈ ఇల్లు విడిచి వెళ్ళకమ్మా శాంతా అని చెప్పారు. ఈ ఇల్లు వదలి పెట్టవద్దని నాచేత ప్రమాణం కూడా చేయించుకొన్నారు. ఇది కాని అమ్మి వేస్తే ఆయన ఆత్మ ఆక్రోశిస్తుంది....”

శ్రీనివాస్ భార్య ముఖంలోకి చూసి పకాల్న నవ్వాడు.

“చూశావా! ఈ ఇల్లూ, ఆ ఫ్యాక్టరీ రెండూ మనకు ప్రియమైనవే కాబట్టి మనకు వియోగ వేదనతప్పదు. అయినా శనీ, ఆది ఈ రెండురోజులు దేవిగార్ని....” శ్రీనివాస్ భార్య ముఖంమీదకు వంగబోయి, ధర్మన్నని లచ్చిని చూపి, నిరాశగా పెదవి విరచి, వెనక్కి జరిగాడు.

ధర్మన్నా ట్రేతో, లచ్చి చీపురు కట్టతో చల్లగా జారు కొన్నారు.

వాళ్ళు ఇద్దరూ వెళ్ళాక శ్రీనివాస్, శాంత క్షణంపాటు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు.

ఆ తరువాత అతను మౌనంగా టిఫిన్ తినటం ప్రారంభించాడు.

అతను తింటున్నంత సేపు శాంత చేతి గోళ్ళకున్న పెయిన్టు చూసుకొంటూ, గోడలకివున్న ఫోటోస్ చూస్తూ కాలి బొటన వ్రేలితో నేలపై వ్రాస్తూ గడిపేసింది.

ఆమె గుండెల్లో ఇందాక అణిగిపోయిన తుఫాను

మళ్ళీ విజృంభిస్తున్నది. శ్రీనివాస్ టిఫిన్ తినేసి, చెయ్యి కడిగేసుకొని, తన గదిలోకి వెళ్ళి సూట్ కేసులో నాలుగు జతల బట్టలు పడేసుకొని, బయటికి వచ్చాడు.

"శాంతా! మళ్ళీ శనివారం వరకూ స్వీట్ డ్రీమ్స్‌తో గడుపు. వచ్చే శుక్రవారం రాత్రి కల్లా ఈ దాసుడు తమరి వాడిలో వాలిపోతాడు" శ్రీనివాస్ భార్య చెంపమీద సుతారంగా చిటిక వేసాడు.

"తమరి దయ. ఈ దీనురాలు వేం కళ్ళతో శుక్రవారం యెదురు చూస్తూంటుంది," శాంత అతని చేతిని అందుకొని, అతి సున్నితంగా తన పెదవులతో చుంబించింది.

శ్రీనివాస్ హుషారుగా ఈలవేసి, బయటకి వచ్చాడు. శాంత అతని వెనకే వచ్చింది.

"ఎంత సక్కాటి జంట ధర్మన్నా ఈలది" లచ్చి తనని వదలిపోయిన మావని తలచుకొంటూ అంది.

"అవునే లచ్చీ! సీతా రాములే అమ్మగారు, అయ్యగారు...." ధర్మన్న కంఠంలో ఆ ఇద్దరిపై అనురాగం కురిపించింది.

3

గోపీ కారుని స్పీడుగా పోనిస్తున్నాడు.

అతని కారు రేసు గుర్రంలా పరుగెడుతున్నది.

గోపీ చూపులు మాటి మాటికి చేతి వాచీ వైపుకు పోతున్నాయి.

అతను డిటెక్టివ్ రాజా అసిస్టెంట్. ఈ మధ్య ఒక కేసులో అతనికి బలమైన దెబ్బలు తగలటంతో, నెలరోజులు హాస్పటల్‌లోవుండి, వారం క్రిందటే డిశ్చార్జ్ అయాడు.

ఈవారం రాజా అతన్ని వీధిలోకి వెళ్ళ నివ్వలేదు.

అయితే గోపీ ప్రాణమిత్రుడు బాషా తన బర్త్‌డేకి రమ్మని గోపీని ఆహ్వానించాడు.

గోపీ తన బాస్‌తో పదకొండు కల్లా వచ్చేస్తానని ప్రామిస్ చేసి మరీ బాషా ఇంటికి వెళ్ళాడు.

తీరా అక్కడికి వెళ్ళాక టైమ్ సంగతే మరచిపోయాడు.

పదకొండు అయాక అప్పుడు గాబరాగా కారెక్కి తన మాట నిలుపుకొనేందుకు కారుని పరిగెత్తిస్తున్నాడు.

కారుకి టాప్ లేకపోవటంతో జోరుగా కారు పరిగెత్తటంతో చల్లటి గాలులు అతని చెంపలకి తగులుతున్నాయి.

గోపీ కారుని స్పీడుగా పోనిస్తూ ఎదురుగా చూసి తుళ్ళి పడ్డాడు.

గోపీ కారుకంటే ఇంకా స్పీడుగా వస్తున్నది ఒక కారు.

దానికి టాప్ లేకపోవటంతో స్టీరింగ్ ముందు ఒకే ఒక వ్యక్తిని చూడగలిగాడు గోపి.

ఆ వ్యక్తి తలపై హేట్ పెట్టుకోవటంతో అతన్ని పోల్చటం ఎవరికైనా కష్టం.

తన కారుకు గోపీ సడన్‌బ్రేకు వెయ్యటానికి ప్రయత్నించాడు.

కానీ అప్పటికే ఆ వ్యక్తి కారు గోపీ కారుకు దగ్గరయింది.

ఫట్, ఫట్ మని రెండుకార్లూ ఢీకొన్నాయి.

అటు ఆ వ్యక్తి, ఇటు గోపీ అంతెత్తున తృళ్ళిపడ్డారు సీట్లమీదే.

ఆ వ్యక్తి కారు, గోపీ కారుని బలంగా ఢీకొట్టటంతో గోపీ తల స్టీరింగ్‌కి తగిలి, రక్తం బయటకి చిమ్మింది.

అదేసమయంలో ఏదో వస్తువు గోపీ ఒడిలోకి వచ్చి పడింది.

అతనికి చుక్కలన్నీ కళ్ళముందే మెదిలాయి.

ఆకాశం నెత్తిన పడ్డట్టు అయింది. కారుకి బ్రేకువేసి, 'అబ్బ' అని తల పట్టుకుండిపోయాడు.

అవతల కారుగల వ్యక్తి గట్టిపిండంలా వున్నాడు. అతడికి చిన్నదెబ్బ అయినా తగల్లేదు.

దెబ్బ తగిలిన గోపీని అలాగే వదిలేసి, తన కారుని ముందుకు పోనిచ్చాడు ఆ వ్యక్తి.

గోపి ఇంకా తలకి తగిలిన దెబ్బనుంచి కోలుకోలేదు. తలపై వెయ్యిటన్నుల బరువు పెట్టినట్లుగా వుంది అతనికి.

భారంగా మ్లూల్గి, జేబులోంచి కర్చీఫ్‌తీసి నుదుటికి కట్టుకొని, ఈసారి మెల్లగా పోనిచ్చాడు కారుని.

పావుగంటకి ఇంటిముందు కారు ఆపి, డోర్ తెరచి, దిగబోయాడు.

అతను నిలబడటంతో అతని ఒడిలోంచి ఏదో వస్తువు జారి క్రిందపడింది.

గోపీ కళ్లు విశాలమైనాయి. వంగి దాన్ని అందుకుని చూసాడు.

అది వెట్టెండ్ పెన్. ఆ పెన్ కాప్‌మీద మూడు ఎస్‌లు చెక్కబడి వున్నాయి.

గోపీ భృకుటి ముడిపడింది.

ఈ పెన్ ఎలా వచ్చింది? అన్న ప్రశ్న వుదయించింది అతనిలో.

తన కారుని ఢీకొన్న కారులో వ్యక్తిదా? కరెక్టు అతనిదే అయివుండాలి. తను పెన్ జేబులో వుంచుకోలేదు. బాషా పార్టీలో ఎవరూ తనకి పెన్ ఇవ్వలేదు. అయినా ఈ



త్రిబుల్ ఎస్ వ్యక్తి పేరై వుండవచ్చు. మూడెస్‌లు కలసివచ్చే పేరుగల మిత్రులు పార్టీలోలేరు. పొరపాటున పెన్ తన దగ్గరకి వచ్చిందని అనుకొనేందుకు. ఆ కారు గల వ్యక్తిదే ఈ వెస్టెండ్ పెన్.

గోపీ ఆ పెన్‌ని ప్యాంట్ జేబులోకితోసి, కాలింగ్ బజర్ నొక్కాడు.

డిటెక్టివ్ రాజా తలుపుతీశాడు.

"ఏమైంది గోపీ" అని ప్రశ్నించాడు గాబరాగా, అతని తలకు వున్న కట్టునుచూసి.

గోపీ లోపలకివచ్చి, ముందు ఫస్టఐడ్ చేసుకొని, అప్పుడు జరిగింది చెప్పాడు.

"మైగాడ్! ఇవాళ ఎంత ప్రమాదమైపోను. ఆ రాస్కెల్ బాగా తాగివుంటాడు. నీ కారుని డాష్‌చేసాడు. అయినా నీదీ తప్పే, అంత స్పీడులో ఎందుకు పోనిచ్చావు. ఏం జరగలేదు కాబట్టి సరిపోయింది" రాజా కలవరంగా అన్నాడు.

"నాకేం కాదులెండి గానీ, పాపం అతనే మంచి వెస్టెండ్ పెన్‌ని మిస్ చేసుకొన్నాడు."

"పోనీలే. అంతగా వెతుక్కోంటే, ఈసారి జాగ్రత్తగా డ్రైవ్ చేస్తాడు. నువ్వువెళ్ళి రెస్ట్ తీసుకో" రాజా తన గదిలోకి వెళుతూ అన్నాడు.

గోపీ తన ఆలస్యానికి సమాధానం చెప్పుకొనే బాధ తప్పిపోయినందుకు సంతోషిస్తూ, తన గదిలోకివెళ్ళి, మంచంమీద వాలిపోయాడు.

4

డిటెక్టివ్ రాజా బయటకి వెళ్ళేందుకు డ్రెస్ చేసు కొంటుండగా టెలిఫోన్ గణ, గణ మ్రోగింది.

అక్కడే కూర్చున్న గోపీ టెలిఫోన్ అందుకొన్నాడు.

రెండు నిముషాలు మాట్లాడి—

"బాస్? మీకే ఫోన్. ఇన్‌స్పెక్టర్ శామ్యూల్ ఫోన్ చేసాడు" గోపి టెలిఫోన్ రాజాకి అందించాడు.

"హలో శ్యామ్! వాట్ న్యూస్."

"హలో రాజా! ఇక్కడ ఒక హత్య జరిగింది. హంత కుడు కూడా వున్నాడు. అయితే చంపలేదని ఏడుస్తు న్నాడు. నాకు బుర్ర పనిచెయ్యటంలేదు. నీ హెల్ప్ కావాలి. త్వరగా వస్తావా."

"ఎడ్రస్ ప్లీజ్!"

శామ్యూల్ హత్య జరిగిన ఇంటి నెంబర్, వీధిపేరు చెప్పి ఫోన్ పెట్టేసాడు.

"ఏమిటి బాస్!" గోపీ అడిగాడు.

"హత్య జరిగిందట. శ్యామ్ రమ్మని ఫోన్ చేసాడు" టై కట్టుకొంటూ చెప్పాడు.

"అలాగా. రెండు క్షణాల్లో డ్రెస్స్ చేసుకొస్తాను" గోపీ లేవబోయాడు.

"నువ్వా? ఈ స్థితిలోనా?" అన్నాడు.

"నాకేం సార్! చక్కగా వున్నాను."

"ఓకే."

గోపీ హుషారుగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి నడిచాడు.

రెండు నిముషాలలో డ్రెస్స్ చేసుకొని బాస్ వెంట బయటికి నడిచాడు.

రాజా డ్రైవింగ్ సీటు తీసుకొన్నాడు.

అరగంటలో కారుని 'శాంతి నిలయం' ముందు ఆపాడు.

ఇద్దరూ కారుదిగి లోపలకి నడిచారు.

లోపల హాలులో సోఫాలోవుంది శాంత మృతదేహం. గుండెల్లో పిడివరకూ దిగబడివుంది కత్తి. కళ్ళు మాత్రం తెరచేవున్నాయి. ఆ కళ్ళలో చనిపోయేముందు ఏదో చూడరాని దృశ్యం చూసిన భావన స్పష్టంగా కనిపిస్తున్నది.

సోఫా దగ్గరే ధర్మన్న, ఉచ్చి ఏడుస్తూ నిలుచున్నారు.

కొద్ది దూరంలో ప్రసాద్ అపరాధిలా నిలిచివున్నాడు.

పోలీస్ డాక్టర్, ఫోటోగ్రాఫర్, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌ఫర్ట్స్ అంతా తమ, తమ పనులు పూర్తి చేసుకొన్నట్లు కన్పిస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ శామ్యూల్ రాజాని చూసి, విష్‌చేసి, అతని దగ్గరగా వచ్చాడు.

"ఇక్కడే చంపబడిందా ఈమె?" రాజా ప్రశ్నించాడు.

"అవును. సోఫాక్రింద బుక్‌ని చూసేవుంటావు. ఆమె ఇక్కడ కూర్చొని చదువుతుండగా కిటికీ బద్దలుకొట్టి, హంతకుడు లోపలకి వచ్చాడు. ఆమె బెదిరిపోయి వుంటుంది. ఆ తరువాత అతను కత్తితో చంపేసాడు. అయితే హంతకుడు ఆమెకి బాగా తెలిసినవాడేనేమో? శాంతాదేవి చనిపోతూ రక్తంతో కుడిచేతిమీద మూడు

ఎస్‌లు వేసింది. అది హంతకుని గుర్తుకావచ్చు...."

"ఈజిట్" రాజా శాంత దగ్గరకి నడిచాడు.

గోపి వులిక్కిపడ్డాడు. త్రిబులెస్ పేరు వినగానే, అతనూ బాస్ వెనకే వెళ్లాడు.

రాజా, శాంత కుడి అరచేతిని చూసాడు.

ఎర్రటి రక్తాక్షరాలు త్రిబులెస్‌లు కనిపించాయి.

"మీ అమ్మగారు ఎడంచేత్తో వ్రాస్తారా?" ధర్మన్నని ప్రశ్నించాడు గోపి.

ఏడుస్తూనే తలవూపాడు అవునన్నట్లు.

"నువ్వు పనిమనిషినా?" రాజా లచ్చిని అడిగాడు.

"అవును బాబూ" అది భయంగా చూస్తూ అంది.

"ఎంతవరకూ వున్నావు ఇంట్లో నిన్న?"

"ఏడుగంటలదాకా వుండి, ఎల్లిపోనాను బాబూ!"

"నువ్వు?" ధర్మన్నని అడిగాడు.

"నేను రాత్రి తొమ్మిదిదాకా వుండి, వెళ్ళిపోయాను బాబూ."

"అలాగా! ఈ ఇంటికి ఇదొక్కటే మార్గమా? పెరటి ద్వారం వుందా?"

"వుందిబాబు. నిన్నరాత్రి నేను పెరటితలుపువేసి వెళ్ళిపోయాను. తిరిగి తెల్లారిముందు నేనే వస్తాను రోజూ. ఈ రోజువచ్చి తలుపు ఎంతలా కొట్టినా తియ్యలేదు. అందర్నీ పిలిచాను, భయమేసి. అంతావచ్చి ఎంతగానో పిలిచారు. కొందరు గదివైపు వెళ్ళారు. అప్పుడే పగిలిపోయివున్న కిటికీచూసి, అంతా ఏదో జరిగిందని గ్రహించారు. ఒకడు లోపలకి దూరి తలుపుతీసాడు. ఎదురుగా అమ్మగారు...." ధర్మన్న దోసిటిలో ముఖం దాచుకొన్నాడు.



రాజా, ఇన్‌స్పెక్టర్ దగ్గరకి వెళ్ళి ఇల్లు చూడాలన్నాడు.

ఇన్‌స్పెక్టర్, రాజా ఇల్లు చూట్టానికి నడిచారు.

పెరటి తలుపులు గడియ పెట్టివున్నాయి. హాలుకి ప్రక్కగది కిటికీ అద్దాలు పగిలినవి క్రిందనే వున్నాయి.

రాజా సూదంటు చూపులతో అంతా పరీక్షించి, బయటికి వచ్చాడు.

డాక్టర్‌తో "హత్య ఎన్నిగంటలకు జరిగిందంటారు?" అని ప్రశ్నించాడు.

"రాత్రి పదిన్నరకి జరిగింది."

"శ్యామ్! ఆమె భర్తలేరా ఇంట్లో?"

"ఆయన ఇక్కడకి ఇరవై, ముప్పై మైళ్ళదూరంలో వున్న స్వంత ఫ్యాక్టరీ చూసుకొంటారట. శనీ, ఆదివారాలు మాత్రమే ఇక్కడ వుంటారట. ధర్మన్న ఆవిడ శవాన్ని చూడగానే ఆయనకి ఫోన్‌చేశాడట. వెంటనే బయలుదేరుతున్నానని అన్నారట. ఇంకో అరగంటలో రావాలి. ఈలోగా ఆ ప్రసాదరావుని ప్రశ్నిస్తే సరిపోతుంది...."

రాజా, ప్రసాద్ దగ్గరకి వచ్చాడు.

"నీ ఇంటిపేరు, నీ పూర్తి పేరు ఏమిటి?" సూటిగా ప్రశ్నించాడు.

ప్రసాద్ వణికిపోయాడు.

"భయపడతావేం చెప్పు?" గోపి చిరాగ్గా అన్నాడు.

"పేరు శివశంకరప్రసాద్."

"ప్రసాద్ తీసేస్తే, త్రిబులెస్ కదూ!" గోపి అదోలా చూసాడు.

"సార్! అలా అనకండి. శాంతని నేను ప్రాణంగా ప్రేమించాను. విధి మా ఇద్దరి జీవితాలతో చిత్రంగా ఆడుకొన్నది. శాంత నిన్న నిరసనగా మాట్లాడితే ఆవేశంలో చంపుతానని అన్నాను. కానీ నేను అభిమానించే నా శాంతని నా చేతులతో చంపుకొనే రాక్షసగుణం నాలో లేదు. నిన్న అలా అనేసి ఇంటికి వెళ్ళిపోయి, తీరిగ్గా ఆలోచించాక నా తప్పు తెలుసుకొన్నాను. శాంత భారతస్త్రీ. ఆమె శ్రీనివాస్‌కే అంకితం. నేను తాకితే ఆమె అపవిత్రు రాలు అవుతుందని గ్రహించాను. నా తప్పు క్షమించమని, క్షమాభిక్ష వేడుకొందామని ఇప్పుడు వచ్చాను. శాంత ఇలా ఎదురైంది. ధర్మన్న, లచ్చి నన్నుచూసి ఇన్‌స్పెక్టర్‌గారితో జరిగినదంతా చెప్పి, శాంతని నేనే చంపేసానని అన్నారు. ఆయన నేనే దోషినని నమ్మేసి, నన్ను బంధించాలని చూస్తున్నారు. నేను నిర్దోషిని నన్ను నమ్మండి..." ప్రసాద్ కళ్ళలోంచి జల, జలా రాలాయి కన్నీళ్ళు.

"శాంతాదేవిగార్ని చంపే అవకాశం నీకేవుంది. ఉద్రేకంలో చంపి వుండవచ్చు" ఇన్‌స్పెక్టర్ కోపంగా అన్నాడు.

"నన్ను నమ్మండిసార్" ప్రసాద్, రాజా చేతులు దొరకబుచ్చుకొన్నాడు.

"నిర్దోషిని బంధించే తెలివితక్కువ పని పోలీస్ డిపార్ట్‌మెంటు ఏనాడూ చెయ్యదు," రాజా అలా అంటుండగా—

"శాంతా!" అన్న శ్రీనివాస్ గావుకేక వినపడింది.

అంతా తలతిప్పి చూసారు.

శ్రీనివాస్ పిచ్చివాడిలా వున్నాడు. గబగబా భార్య దగ్గరికి వచ్చి, భార్య శవాన్ని రెండుక్షణాలు చూసి, ఒక్కసారిగా ఆమెమీద పడి పసివాడిలా రోదించటం మొదలుపెట్టాడు.

"శాంతా ఏమిటీ దారుణం! నానుండి నిన్ను వేరుచేసిన దుర్మార్గులు ఎవరు?" శ్రీనివాస్ ఏడుస్తూ అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్! నా భార్యను చంపిన దుర్మార్గుడు ఎవరు?" అతను రౌద్రరూపంతో అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ జరిగినదంతా చెప్పాడు. ప్రసాద్‌కి, శాంతకి మధ్యగల బంధాన్ని కూడా చెప్పాడు. అంతావిన్న శ్రీనివాన్ వుద్రేకపడిపోతూ—

"అరే, ఆ భార్యను చంపిన నిన్ను బ్రతకనివ్వను" అంటూ ప్రసాద్ మీదకి రాబోయాడు.

ఇన్‌స్పెక్టర్ అతన్ని ఆపాడు.

"మీరు ఆవేశపడకండి. అతనే హంతకుడైతే, అతన్ని శిక్షించేందుకు కోర్టువుంది"

శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మాటలు విని తన ఆవేశాన్ని అణచుకొన్నాడు.

ఆ తరువాత శవాన్ని మార్చ్యురీకి పంపే ఏర్పాట్లు చేసాడు ఇన్‌స్పెక్టర్.

రాజా అతనికి చెప్పి, "పోదాం, పద గోపీ" అన్నాడు.

"జస్ట్ ఎ మినిట్" గోపి, శ్రీనివాస్ దగ్గరకి వెళ్లాడు.

"మీ పూర్తి పేరు ఏమిటి?"

శ్రీనివాస్ గోపిని వింతగా చూశాడు.

"శ్రీరంగం శివ శ్రీనివాస్" చెప్పాడు.

"ఐసీ" గోపి మరేం మాట్లాడకుండా రాజాతో బయటికి నడిచాడు.

* * *

[ఇదీ కథ. ఇంతవరకు జరిగిన పరిశోధన ఆధారంగా యీ కథలో హంతకుడెవరో మీరు చెప్పగలరా? మీ జవాబును ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, యీ నెల 20వ తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. ఆధారాలతో హంతకుడిని చక్కగా నిరూపించిన ఇద్దరు పాఠకులకు చెరొక పాతిక రూపాయలు చొప్పున బహుమతి పంపుతాము. హో.ం.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పై. లు స్టాంపులు పంపాలి. ఫలితాలు నవంబరు'78 నెల సంచికలో ప్రచురించబడుతాయి. తుది నిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

కథల దొంగ?

(పోటీ నెం-74 ఫలితాలు)

'కథల దొంగ'ను పట్టుకోవడానికి పాఠకులు రకరకాల పరిష్కార మార్గాలు సూచించారు. అయితే కథ కాపీ ఒకటి కోర్టువారి ఆధీనంలో వుంచి, తర్వాత రెండో కాపీ యధాప్రకారంగా పత్రికకు పంపితే సరిపోతుంది.

మాకు వచ్చిన సమాధానాలలో అత్యుత్తమంగా భావించిన యీ క్రింద ఇరువురి పాఠకులకు చెరొక పాంతి రూపాయలకు చెక్కు పంపుతున్నాము.

1. శ్రీ కూనారెడ్డి రామారావు, బి.ఏ., వుల్లితోటవీధి,

ఇంటి నెంబరు 7-17-10, రాజమండ్రి-1.

2. శ్రీమతి కె. విమల, w/o డాక్టర్ కె. వెంకట రామయ్య శెట్టి, ఓర్వకల్లు (కర్నూలు జిల్లా)

'కథల దొంగ'ను పట్టుకోవడానికి చక్కని పరిష్కారం చూపిన ఇతర పాఠకులు:

1. పి. వి. రత్నమాల, అమలాపురం. 2. వై. మల్లికార్జున్, కర్నూలు. 3. జి.ఎన్.శ్రీనివాసరావు, చేటపర్రు. 4. కె. తిరుమలయ్య, హైదరాబాదు. 5. డి. అనూరాధ, బొంబాయి. 6. చిన్ని వీరబ్రహ్మం, నెల్లూరు. 7. జి. బాల నర్సింహారావు, నోముల. 8. ఎల్. రామగోపాల్, వెంకటగిరి. 9. కె. ప్రభాకరదేవ్, శ్రీకాకుళం. 10. యం. విద్యుల్లత. రాయచూరు.

11. పంపన శ్రీనివాసరావు, శ్రీశైలం ప్రాజెక్టుకాలనీ 12. బి. లక్ష్మీజయప్రద, ముట్లూరు. 13. కె. నరసింహమూర్తి, రాజోలు. 14. ఎమ్. నాగమణి, నంద్యాల. 15. కె. ఫణి రాజకుమార్, సికింద్రాబాదు. 16. జల్దుబాజీ, పార్వతీపురం. 17. పి. రోహిణి, అమలాపురం. 18. ఉప్పలూరి మురళీక్రిష్ణ, విజయవాడ. 19. పి. నరసింహమూర్తి, వరంగల్. 20. బొల్లాప్రగడ సుబ్రహ్మణ్యం, విశాఖపట్టణం.

21. కాళ్ళగోవిందరావు, ఆమదాలవలస. 22. ఎన్. రాఘవేంద్రరావు, రాజమండ్రి. 23. కాసుల అరుణజ్యోతి, బెంగుళూరు. 24. డి. వి. ఆర్. రావ్, గుంటూరు. 25. కె. చందర్‌రావు, ఢోలకపూర్. 26. రంకిరెడ్డి రాము, తాడేపల్లిగూడెం. 27. సి. హెచ్. వి. నరసింహ ఆచారి, రాజమండ్రి. 28. ఇమ్మందుల శివపార్వతి, విశాఖపట్టణం.

29. ఆర్. వి. ప్రభాకరరావు, నోముల. 30. కురుముద్దాలి విజయలక్ష్మి, విజయవాడ.

31. ఐ. హేమప్రభ, బేగంపేట. 32. టి. జి. సురేం దర్, యాపర్ల 33. డి. శ్యామలాదేవి, విశాఖపట్టణం. 34. పోలూరి చంద్రశేఖరరావు, నంద్యాల. 35. ఇందూ రమణ, సింహాచలం. 36. జి. సత్యశేఖర్, తాడేపల్లి గూడెం. 37. యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి. 38. కేశిరాజు క్రిష్ణ, దొడ్డిపట్ల. 38A. యం.సత్యనారాయణ, విజయవాడ. 39. బి. సి. బి. వరదయ్య, ప్రొద్దుటూరు. 40. ఇవటూరి సునీత, తెనాలి.

41. యం. కరుణ, నెల్లూరు. 42. కె. సత్యనారాయణ వరంగల్. 43. యం. రాంబాబు, హైద్రాబాదు. 44. ఎమ్. ప్రసాదరావు, చింతలబస్తి. 45. పి. దేవి. హైద్రాబాదు. 46. ఎల్. సత్యం, కొత్తూరు. 47. జి. కామాక్షి, ఇంకొల్లు 48. ఆర్. ప్రభాకరరావు, తిరుమలగిరి. 49. కె. సూర్య నారాయణ, రాయగడ. 50. కె. షణ్ముగం, నగరి.

51. సూరిశెట్టి కృష్ణవేణి, మద్రాసు. 52. ఎస్. ఎస్. బాబా, సికింద్రాబాదు. 53. కె. నాగభూషణ, దేవనహళ్ళి. 54. ఏ. కొండలరావు, జగన్నాధపురం. 55. ఎస్. జగన్, విజయనగరం. 56. సి. హెచ్. వి. వి. సత్యప్రసాద్, రాజమండ్రి. 57. కూచిపూడి కోటేశ్వరరావు, ఓలేటివారి పాలెం. 58. బి. కమలరాణి, పేర్ల. 59. ఆర్. కె. అనంత లక్ష్మి, ఓగిరాల. 60. యస్. సత్యానంద్, బెల్లంపల్లి.

61. గార సీతాలక్ష్మి, ముషీరాబాదు. 62. ఎమ్. వెంక టేశ్వరగౌడ, కామారెడ్డి. 63. నాళ్ళ విశాలాక్షి, రూర్కెలా తదితరులు.

***

కె.బి.యస్. కుమార్

హత్యజరిగిన రాత్రి

ఆనాడు కోర్టు గ్యాలరీలో ప్రేక్షకులు ఇసుకవేస్తే నేల రాల నంత రద్దీగా వున్నారు. అది హత్యకేసు కావటం మొదటి కారణమైతే, డిఫెన్సు లాయర్‌గా ప్రఖ్యాత డిటెక్టివ్ జలంధర్ వాదించబోవటం రెండవ ముఖ్యకారణం!

డిటెక్టివ్‌వృత్తి చేపట్టకముందు జలంధర్ కొంతకాలం లాయర్‌గా ప్రాక్టీస్ చేశాడన్న విషయం తెలియని ఎందరో ఆయన వాదించే క్షణంకోసం ఆత్రంగా ఎదురుచూస్తోన్నారు.

హుందాగా లేచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరమశివం. ఓసారి గట్టిగా గొంతు సవరించుకొని ప్రారంభించాడు.

"యువరానర్! నరహరిరావు అనబడే యీ నిందితుడు గతనెల పదమూడోతేదీ రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో తన ప్రియురాలైన కుమారి పద్మప్రియని స్నేహితుడు శ్రీ మధుకర్‌ని దారుణంగా హత్యచేశాడు. ఆ విషయాన్ని నిరూపించటానికి చాలా సాక్ష్యాధారాలున్నాయి.

"మొదటి సాక్షిగా డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ చక్రవర్తిని ప్రవేశపెడుతోన్నాను...." అన్నాడు.

డిటెక్టివ్ యిన్స్‌పెక్టర్ చక్రవర్తి బోనులోకి రప్పించబడి ప్రమాణ స్వీకారంచేశారు.

అతనివేపు నడిచాడు పి.పి.

"మీరేకదూ క్రయింబ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ చక్రవర్తి?"

"అవును."

"గతనెల పదమూడోతేదీ రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మీ రెక్కడున్నారు?"

"నా కార్యాలయంలో కూర్చొని ఆఫీసుపని చూసుకుంటున్నాను."

"అప్పుడేం జరిగిందో కోర్టువారికి తెలియజెయ్యండి."

"ఆఫీసుపని చూసుకుంటోండగా ఎక్కడినుండో ఫోన్ కాల్ వచ్చింది. శివరామ్ అనే వ్యక్తి ఫోన్‌చేస్తూ, తన కూతుర్ని ఆత్మీయుణ్ని ఘోరంగా హత్యచేశారని, హంతకుడు గదిలోనే వున్నాడని చెప్పారు. అప్పటికప్పుడే వెళ్ళి హంతకుణ్ణి అరెస్ట్ చేశాను."

"హత్యాయుధాలేవైనా దొరికాయా?"

"హతుడు శ్రీమధుకర్‌ని చంపటంకోసం వుపయోగించబడ్డ కత్తి. హతురాలు కుమారి పద్మప్రియని హత్యచెయ్యటానికి వుపయోగించబడిన నైలాన్ తాడు స్వాధీనం చేసుకున్నాను...."

"యివేనా ఆ రెండు వస్తువులు?" కత్తిని, నైలాన్ తాడుని చూపిస్తూ అడిగాడు పి.పి.

వాటిని పరిశీలనగా చూసి "అవును." అన్నాడు చక్రవర్తి.

"యువరానర్! హత్యల్లో వుపయోగించబడ్డ ఈ కత్తిని ఎగ్జిబిట్ 'ఎ'గా, నైలాన్ తాడుని ఎగ్జిబిట్ 'బి'గా దాఖలు చేస్తోన్నాను. దట్సాల్ యువరానర్! డిఫెన్సువారు క్రాసు పరీక్ష జరపొచ్చు" అని తన కుర్చీలో కూర్చున్నాడు పి.పి.

జలంధర్ లేచాడు.

"ఫోన్ కాల్ ఎన్నిగంటలకి వచ్చింది?"

"దాదాపు తొమ్మిది."

"మీరక్కడికెళ్ళేసరికి ఎంతసేపైంది?"

"పదిహేను నిమిషాలు."

"హత్యాయుధాలు - అయ్‌మీన్ ఎగ్జిబిట్ ఎ అండ్ బి... నిందితుడి చేతుల్లో వుండగా చూశారా?"

"లేదు. కత్తి హతుడి వెన్నులో ఎడంభాగాన దిగబడి వుండింది. నైలాన్ తాడు హతురాలి మెడకు చుట్టుకొని అలాగే వుండింది."

"దట్సాల్ యువరానర్...." కుర్చీలో కూర్చున్నాడు జలంధర్.

హేళనగా చూశాడు పి.పి. జలంధర్ వంక. "తర్వాతి సాక్షిగా పోలీస్ డాక్టర్‌ని ప్రవేశపెడుతోన్నాను." అన్నాడు.

పోలీస్ డాక్టర్ బోనులోకి రప్పించబడ్డాడు. ప్రమాణ స్వీకారం చేశాడు.

ఠీవిగా లేచాడు పి.పి.

"మీ పేరు?"

"సాలమన్."

"వృత్తి?"

"పోలీస్ డాక్టర్."

"గతనెల పదమూడోతేదీ రాత్రి హత్య చెయ్యబడ్డ కుమారి పద్మప్రియ, శ్రీమధుకర్ శవాలని పోస్టుమార్టమ్ చేసింది మీరేనా?"

"అవును."

"హత్యలు ఎన్నింటికి జరిగాయి?"

"సుమారు ఎనిమిదిగంటల ముప్పై నిమిషాలకి."

"హత్యాయుధాలు?"

"కత్తి, నైలాన్ తాడు."

"ఇవేనా అవి?".... తెచ్చి చూపెట్టాడు.

"అవును."

"దట్సాల్ యువరానర్...."

....జలంధర్ లేచాడు.

"కత్తిమీద వ్రేలి ముద్రలు కన్పించాయా?"

"లేదు."

"హతురాలి గొంతుపైనా?"

"లేదు."

"గదిలోని యితరవస్తువులపై ముద్దాయి వ్రేలిముద్రలు కన్పించాయా?"

"డ్రస్సింగ్ మిర్రర్ పైనా టైమ్ పీస్‌పైనా కన్పించాయ్."

"కత్తితో పొడిచిన తర్వాత ఎంతసేపటికి ప్రాణం పోయింది?"

"కత్తి వెన్నులోంచి గుండెలోకి దిగబడింది. వెంటనే ప్రాణం పోయింది."

"అప్పుడు సమయం యెంతన్నారు?"

"ఎనిమిదీ ముప్పై."

"మీ మాటలవల్ల కత్తి లోతుగా దిగబడిందని తెలుస్తోంది. ఎవరో బలమైన వ్యక్తి పొడిచుండాలి అవునా?"

"అబ్జక్షన్ యువరానర్! ఇంతవరకూ జరిగిన వాద ప్రతివాదాల్లో హత్యా స్థలంలో ముద్దాయి తప్ప మరెవరూ లేరని ఋజువైంది. అలాంటప్పుడు డిఫెన్సువారు 'ఎవరో బలమైన వ్యక్తి' అంటూ కేసుని మరోదారి పట్టిస్తోన్నారు." పి. పి. కోపంగాలేచి అన్నాడు.

"యువరానర్! పదునైన కత్తిని బలహీనమైన వ్యక్తి వుపయోగించినా లోతుగా దిగబడుతుంది. ఈ ప్రశ్నకి సాక్షినుండి వచ్చే సమాధానం ముద్దాయికి చేయూత నివ్వ గలదనే అభిప్రాయంతో ప్రశ్నించాను."

"అబ్జక్షన్ ఓవర్ రూల్డు...."

పి. పి. నీరసంగా కుర్చీలో కూల బడ్డాడు.

"థాంక్స్ యువరానర్...." సాక్షివేపు తిరిగాడు జలంధర్ "చెప్పండి."

"కత్తి చాల పదునైనది. మనిషి శరీరంలోకి ఆ కత్తిని దింపటానికి అట్టే శ్రమపడ నక్కర్లేదు. ఆడదైనా ఆపని చెయ్యగలదు."

"ప్లీజ్ నోట్ దిస్ పాయింట్ యువరానర్...." అని తిరిగి సాక్షివేపు చూశాడు జలంధర్.

"హతురాలి మరణానికి కారణం?"

"గొంతు నులమ బడింది...."

"మరి ఎగ్జిబిట్ 'బి'గా దాఖలు చెయ్యబడ్డ నైలాన్ తాడు మాటేమిటి?"

"గొంతు నొక్కటం వల్లే ప్రాణంపోయింది. కాని హంతకుడు ఆ విషయం గమనించక మూర్ఛిల్లిందేమోననే

అనుమానంతో నైలాన్ తాడు నుపయోగించి వుండవచ్చని వూహించొచ్చు."

"దట్సాల్ యువరానర్."

....మూడవ సాక్షిగా శివరామ్ బోనులోనికి వచ్చి ప్రమాణ స్వీకారం చేశాడు.

"మీరే కదూ హతురాలి తండ్రి?"

"అవును."

"గత నెల పదమూడో తేదీ జరిగిన హత్యలు—అయ్‌మీన్ పద్మప్రియ, మధుకర్‌ల శవాలని మొదటిసారిగా చూసింది మీరే కదూ!"

"అవును."

"ఎలా చూశారు?"

"రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో భోజనానికి పిలవాలని అమ్మాయి గదిలో కెళ్ళాను. అప్పటికే వాళ్ళిద్దరూ చచ్చిపడి వున్నారు. అదే గదిలో దిక్కులు చూస్తూ గుటకలు మ్రింగుతూ నిలబడివున్నాడు ముద్దాయి. జరిగిందేమిటో నాకర్థమై పోయింది. బయటినుండి తలుపులు మూసి, ఇన్‌స్పెక్టర్‌కి ఫోనుచేశాను." అన్నాడు శివరామ్.

"దట్సాల్ యువరానర్...." జలందర్ వేపొక్కసారి చూసి కూర్చున్నాడు. పి. పి. పరమశివం.

"హత్య జరిగిన రోజు మీ అమ్మాయి బర్త్‌డే అని మీ స్టేట్‌మెంట్‌లో వుంది నిజమేనా?"

"నిజమే."

"బర్త్‌డే తాలూకు ఫంక్షన్ ఎన్నిగంటలకి జరిగింది?"

"ఏడు గంటలకి."

"ఉదయమా? సాయంత్రమా?"

"సాయంత్రం."

"మీ యింట్లో బర్త్ డేలకి కేక్ కట్ చేసే అలవా టుందా?"

"వుంది."

"అదికూడ ఈ వెనింగ్ జరిగిందా?"

"అవును."

"ప్రతి సంవత్సరం యిలాగే జరిగేదా?"

"లేదు. ప్రతిసారీ కేక్ కటింగ్ వగైరాలు వుదయమే జరిగి పోయేవి. సాయంత్రం పూట కల్చరల్ ప్రోగ్రామ్స్ జరిగేవి,"

"ఈసారి మాత్రం అలా యెందుకు జరిగింది?"

"........"

"అబ్జక్షన్" అనబోయి నోరు మూసుకున్నాడు పి. పి.

"ఫర్వాలేదు. చెప్పండి."

"నరహరి ఆరోజు వూళ్ళోలేడు. అతను సాయంత్రం వస్తాడని తెల్సి అన్నీ సాయంత్రమే జరగాలని పట్టుబట్టింది సరే నన్నాను."

"నరహరంటే....ఎదురుగా మీరు చూస్తోన్న ముద్దాయే కదూ?"

"అవును...."

"ఫంక్షన్ ఎన్ని గంటలకి అయిపోయింది?"

"ఎనిమిదీయిరవై నిమిషాలకి."

"ముద్దాయికోసం హతురాలు ఎదురుచూడలేదా?"

"ఎదురు చూసింది. కాని ఎంతకీ అతను రాకపోవ టంతో నిరాశచెందింది."

"ఎనిమిదీఖిరవైకి ఫంక్షన్ అయిపోగానే అందరూ వెళ్ళిపోయారు. హతుడుతప్ప. కదూ!"

"అవును,"

"అతనెందుకు వెళ్ళలేదు?"

"అతను మాక్కావలసినవాడు."

"వివరంగా చెప్పండి...."

"అతను మా కుటుంబ సభ్యులకందరికీ ఆత్మీయుడు. అతనికి మా యింట్లో సర్వహక్కులూ వున్నాయి."

"హతుడికీ హతురాలికీ ఎటువంటి సంబంధం?"

"మా అమ్మాయినతడు స్వంత చెల్లిలా చూస్తాడు. అందుకే అతను మా అమ్మాయితో ఒంటరిగా గదిలో వున్నా, ఒకే రిక్షాలో యిద్దరూ కల్సివెళ్ళినా ఎవరమూ ఏమీ అనుకోము."

"ఫంక్షన్ అయిపోయాక మీరెక్కడున్నారు?"

"అమ్మాయిని, మధుని పిలవటానికి వెళ్ళాను. ప్రోగ్రామ్‌లో జరిగిన విషయాలని మననం చేసుకుంటూ, నరహరి-అయ్‌మీన్ ముద్దాయి రాలేదని దిగులుపడుతూన్న అమ్మాయిని ఓదారుస్తోన్న మధుని చూశాను. వాళ్ళప్పుడప్పుడే భోజనానికి రారనుకొని నేను భోజనం చెయ్యటానికి వెళ్ళిపోయాను."

"ఆ తర్వాతేం జరిగిందో చెప్పండి...."

"భోజనంచేసి చుట్ట కాల్చుకున్నాను. అప్పుడేనా వస్తారేమోనని మళ్ళీ వెళ్ళాను. కాని అప్పటికే...." శివరామ్ కళ్ళలో నీళ్ళు తిరిగాయ్.

"హత్యలు జరిగాయ్. ముద్దాయి అక్కడే వున్నాడు.... అయితే హత్యలు జరిగేటప్పుడు ఏవైనా కేకలు మీకు వినిపించాయా?"

"లేదు."

"ఫంక్షన్ ఎనిమిదీ యిరవైకి అయిపోయింది. గెస్టులు వెళ్ళటానికి అయిదు నిమిషాలు పట్టిందనుకుందాం. మీరు

కాళ్ళూ చేతులూ కడుక్కొని తుడుచుకొని అమ్మాయి గదిలోకి వెళ్ళటానికి మరో అయిదు నిమిషాలు పట్టివుండొచ్చు. అంటే మీరు ఆమె గదిలోకి వెళ్ళేప్పుడు టైమ్ దాదాపు ఎనిమిదిన్నర అయివుండొచ్చు కదూ!"

"అయివుంటుంది."

"మీరొక్కరే వెళ్ళి భోజనం చేశారా?"

"లేదు. నేను, నా భార్య, రెండో కూతురు రోహిణి. ముగ్గురం భోంచేశాం."

"ఒక్కరే భోజనం చేస్తే త్వరగా అవుతుంది. కాని యిద్దరు ముగ్గురు పంక్తిగా కూచుంటే ఆలస్యమయ్యే అవకాశం వుంది. అవునా?"

తలూపాడు శివరామ్ అంగీకరిస్తున్నట్టుగా.

"ఎంతసేపయివుంటుంది?"

"దాదాపు యిరవై నిమిషాలు."

"చుట్ట కాల్చటానికెంతసేపు పడుతుంది?"

"పది నిమిషాలు పట్టొచ్చు. నేను చుట్ట నిదానంగా పీలుస్తాను."

"మీరు తిరిగి అమ్మాయి గది చేరేసరికి ఎంతయి వుంటుంది?"

"తొమ్మిది...."

"అప్పటికి మీ అమ్మాయి, మధుకర్ యిద్దరూ హతులై వున్నారు కదూ!"

"అవును."

"ముద్దాయినికూడ ఆ సమయంలో అక్కడ చూశారు కదూ మీరు?"

"అవును."

"అతను హత్య చేస్తోండగా చూశారా?"

"లేదు."

"యువరానర్! ప్లీజ్ నోట్ దిస్ పాయింట్. శివరామ్ గారూ! ఆ తర్వాత బయట గొళ్ళెంపెట్టి పోలీసులకి ఫోన్ చేశారు కదూ!"

"అవును."

"వంటింట్లోంచి కాని మీరు చుట్ట కాల్చుకున్న ప్రదేశం నుండికాని చూస్తే మీ యింట్లోకి వెళ్ళేవాళ్లు, యింటినుండి బయటికి వచ్చేవాళ్లు కన్పిస్తారా?"

"కన్పించరు."

"యువరానర్! ప్లీజ్ నోట్ దిస్ పాయింటాల్సో.... శివరామ్‌గారూ! చివరి ప్రశ్న. ముద్దాయే హత్యలు చేశారని మీరెలా భావించారు?"

"హత్యజరిగిన స్థలంలో బిక్కచూపులు చూస్తూ నిలబడి వుండటం, నన్నుచూసి వులిక్కిపడటం, ఏదో సంజాయిషీ చెప్పబోవటం మొదటి కారణం. రెండోది, నాకు తెల్సినంత వరకూ హతులు మధు, పద్మ అన్న-చెల్లెల్లాంటి వాళ్ళని మాత్రమే తెల్సు ముద్దాయికి. వాళ్ళిద్దర్నీ ఒకే గదిలో

చూశాక వాళ్ళిద్దరిపై అనుమానం కలిగుండొచ్చు.''

''మీ జవాబునిబట్టి మరొక్క ప్రశ్న వెయ్యాల్సి వస్తోంది. యింతవరకూ ముద్దాయి వాళ్ళిద్దర్నీ ఒకే గదిలో వుండగా చూడలేదా?''

''నాకు తెల్సినంతవరకూ లేదు....''

''... యువరానర్! యింతవరకు విచారించిన విషయాలనిబట్టి ఆలోచిస్తే, పోలీస్‌డాక్టర్ సాక్ష్యాన్నిబట్టి ఇందులో ఏదో మరో హస్తం వున్నట్టు గోచరిస్తోంది. కాబట్టి ఈ కేసుని పదిరోజులపాటు పోస్ట్‌పోన్ చెయ్యవలసిందిగా కోర్టు వారిని కోరుతోన్నాను....'' అన్నాడు జలంధర్.

న్యాయమూర్తి అంగీకరించాడు. జలంధర్ అప్పటి కప్పుడే అందుకు సంబంధించిన కాయితం వ్రాసిచ్చాడు. యింతలో లంచవర్‌కి సూచనగా ఒంటిగంట కొట్టింది కోర్టు గడియారం.

''ఈ కేసుని ఈ నెల పధ్నాలుగో తేదీకి వాయిదా వేస్తోన్నాను....'' అని చెప్పి న్యాయమూర్తి లేచాడు.

2

''నువ్వు నిజంగా నిర్దోషివైతే నీకు సంబంధించిన వివరాలు పూర్తిగా చెప్పు. హత్యజరిగిన సమయంలో స్నేహితుడివద్ద వున్నానంటే చాలదు. వివరాలు కావాలి. నిర్దోషినంటావు, వివరాలు చెప్పకపోతే కోర్టులో నేనెలా వాదించాలి? నీ నిర్దోషిత్వాన్నెలా ఋజువుచెయ్యాలి?''

''చెబుతాను జలంధర్‌గారూ!....వినండి...నేను సంగీత ప్రియుణ్ణి. 'ప్రసాదరావ్' అనే యువకుడు నా ప్రాణ మిత్రుడు. అతడు సంగీతంలో ప్రావీణ్యం సంపాదించాడు. అందుకే అతణ్ని నేనెక్కువగా అభిమానించేవాణ్ణి. మా యింటినుండి మైలు దూరంలోవున్న అతడి రూముకి ప్రతి

రోజూ వెళ్ళేవాణ్ణి. సంగీతం గురించి యిద్దరం గంటల తరబడి మాట్లాడుకునేవాళ్ళం.

"కొన్నాళ్ళయ్యాక మధుకర్ ఆ గదిలో చేరాడు. ప్రసాదరావు అతన్ని నాకు పరిచయం చేశాడు.

"కాలక్రమేణా మధుకర్ కూడా నాకు మిత్రుడై పోయాడు.

"మధుకర్‌ని శివరామ్‌గారు చదివిస్తోన్నారు. ఎందుకో నాకు తెలీదు. ఓరోజు అతని వెంట వాళ్ళింటికి వెళ్ళాను. మధుకర్, పద్మని నాకు పరిచయం చేశాడు. ఆ తర్వాత తరచూ మధుతో వాళ్ళింటికి వెడుతోండేవాణ్ని.

"పద్మకి సాహిత్యమంటే తగని అభిమానం. ఆ పిచ్చేదో నాక్కూడ వుంది. అప్పుడప్పుడూ ఏవో పాటలు వ్రాసేవాణ్ణి. వాటిని చూసి పద్మ తెగ మెచ్చుకుంటూండేది. నాలోని కొద్దిపాటి సాహిత్య పరిజ్ఞానం, ఆమెలోని సాహిత్యాభిమానం మమ్మల్ని ప్రేమికులుగా మార్చాయ్. కాని ఈ విషయం మధుకి తెలీదు.

"నన్ను ప్రేమించటానికి యింతకుమునుపు యిద్దరమ్మాయిలు ప్రయత్నించారు. కాని నేను లొంగలేదు. యిప్పుడు పద్మని ప్రేమించానని తెలిస్తే ముందుగా మధు నన్ను హేళన చేస్తాడు. అందుకే అతన్తో చెప్పలేదు.

"యిదిలా వుండగా ఓరోజు హఠాత్తుగా ప్రసాద్, మధు-యిద్దరూ మాట్లాడుకోటం మానేశారు. ప్రసాద్ గది లోంచి మధు వెళ్ళిపోయాడు.

"యిద్దర్నీ నిలబెట్టి ప్రశ్నించాను. విడివిడిగా ప్రయత్నించాను. ప్రయోజనం శూన్యమే అయింది. వాళ్ళనుండి అసలు సమాచారం రాబట్టలేకపోయాను.

"పోయిన్నెల నాలుగో తారీఖున - అంటే హత్యలు

జరగటానికి తొమ్మిది రోజులు ముందుగా—మా ప్రేమ విషయం శివరామ్‌గారికి తెల్సింది. ఆయన మధుకి తెలియ జేశాడు. మధు నన్ను మందలించాడు. ఆ విషయం తెలిసిన పద్మ అతన్ని చల్లబరచింది. వాళ్ళ నాన్నని ఒప్పించింది. మధు ఏమీ అనలేదు. కాని అప్పట్నుండి నాపట్ల కాస్త ముభావంగా మారిపోయాడు.

"యిది జరిగిన మరురోజు పద్మ నన్ను కల్సింది. తన పుట్టినరోజు పదమూడో తేదీ అని చెబుతూ, నన్ను తప్పని సరిగా రావలసిందిగా కోరింది. సంతోషంతో సరేనన్నాను.

"కాని ఆమెద్వారా ఆ విషయం తెల్సుకున్నరోజే నాకు యింటర్వ్యూ వచ్చింది. కర్నూలులోని ఓ ప్రయివేటు ఆఫీసులో గుమస్తా పోస్టుకి. నన్ను ప్రేమించిన పద్మని కాస్తైనా సుఖపెట్టాలంటే ఆ వుద్యోగం నాకు రావాలి."

"మళ్ళీ ఆమెదగ్గరికి వెళ్ళాను. జరిగిన సంగతి చెప్పాను. బుంగమూతి పెట్టింది. బుజ్జగించి యింటర్వ్యూ పన్నెండో తేదీ అని, ఆరోజు రాత్రిలోగా తప్పక వస్తానని, మర్రోజు ఉదయం తన పుట్టిన రోజుకి తప్పనిసరిగా హాజ రవుతానని మాటిచ్చాను.

"మాటైతే యిచ్చానుగాని నిలబెట్టుకోలేకపోయాను. యింటర్వ్యూ పన్నెండో తారీకైనా నా నెంబరు వచ్చేసరికి పదమూడో తేదీ మధ్యాహ్నమైంది. గబగబా హోటల్లో యింత తిన్నాననిపించుకొని మరో ముగ్గురు పాసింజర్లతో కల్సి టాక్సీ ఎక్కాను. ఎలాగైతేనేం—సాయంత్రం అయిదుకల్లా హైదరాబాదులో దిగాను.

"పద్మకి నేనంటే ప్రాణం. అందులోనూ మేం పరిచయ మయ్యాక, ప్రేమించుకోటం మొదలుపెట్టాక వచ్చిన తొలి పుట్టినరోజు పద్మది। నే నాలస్యంగా వచ్చానని కోప్పడితే.?

"....తప్పకుండా కోప్పడుతుంది. ఆమె కోపం పోగొట్టాలి. ఆమె అలుక మాన్పాలి. ఏం చెయ్యాలి?....ఆలోచించాను. ఓ అయిడియా తట్టింది.

"ఆమె బర్త్‌డే సందర్భంగా ఓ పాట వ్రాస్తే....? ఆమె కోపం యిట్టే చల్లారిపోతుంది. అట్నుంచటే ప్రసాదరావు రూముకి పరిగెత్తాను.

"నేను వ్రాసిన పాట చూపాను. చాల బావుందన్నాడు. ఒకమ్మాయి పుట్టినరోజు పండగ సందర్భంగా ఆమెకి శుభాశీస్సులు తెలుపుతూ వ్రాసినపాట అది. అప్పటికప్పుడే బాణీ సమకూర్చాలన్నాను. ఆశ్చర్యపోయాడు. కారణం నేను పద్మని ప్రేమిస్తోన్నట్టు ప్రసాద్‌క్కూడ తెలీదు. ఏదో సాకుచెప్పి తప్పించుకున్నాను.

"ఎలాగైతేనేం? ఆ పాటకి ట్యూన్ సెట్‌చేశాడు ప్రసాద్. గంట రిహార్సల్‌చేసి పాడటం నేర్చుకున్నాను.

"ప్రసాద్ గిటార్, హార్మోనియం బాగా వాయిస్తాడు. అతను గిటార్ వాయిస్తోండగా ఓసారి, హార్మోనియం వాయిస్తోండగా ఓసారి పాడాను. పాట బాగా నోటికొచ్చేసింది. సమయం చూసుకున్నాను. ఎనిమిదిన్నరైంది. ప్రసాద్‌కి థాంక్స్‌చెప్పి పరిగెత్తాను.

"ఆటోఎక్కి పద్మ యిల్లు చేరుకున్నాను. అప్పుడు సరిగా టైమ్ తొమ్మిదైంది. యిల్లంతా నిశ్శబ్దంగావుంది. మెట్లెక్కి పైకివెళ్ళాను. ఎవరూ కన్పించలేదు. నేరుగా పద్మ గదివేపు పరిగెత్తాను. తలుపులు ముందుకి వేసున్నాయి. తోశాను. ఎదట కన్పించిన దృశ్యం....నా పద్మ, మదు— యిద్దరూ నిర్జీవులై పడివున్నారు. అదీ జలంధర్‌గారూ జరిగిన కథ!"

"ఆ భయంకరదృశ్యం చూసేసరికి నాకు నోట మాట



రాలేదు. ఎవరు చేశారీ పని? నా పద్మకి శత్రువులెవరున్నారు? వుంటే వాళ్ళు మధునికూడా ఎందుకు చంపుతారు? మధుకి శత్రువులున్నారనుకున్నా, వాళ్ళకి పద్మని హత్యచేయాల్సిన అవసరం? లేక ఒకరిపై పగ సాధించటానికి వాళ్ళని చంపి ప్రత్యక్షసాక్షి అయిన రెండోవ్యక్తినికూడా చంపారా?.... ఏమీ బోధపడలేదు.

“ఆ క్షణంలో నేను పడిన బాధ వర్ణనాతీతం! పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపటానికి వచ్చిన నేను పద్మ శవాన్ని చూస్తున్నాను. పద్మ నాకు పరిచయం కావటాని క్కారణమైన మధు శవాన్ని చూస్తోన్నాను. కోర్టులో శివ రామ్‌గారు చెప్పేదాకా ఫంక్షన్ సాయంత్రం జరిగిందని నాకు తెలీదు. ఉదయమే అయిపోయుంటుందనుకున్నాను. పాటకోసం ఆగక నేరుగా వచ్చివుంటే నా పద్మ చని పోయేది కాదేమో!

“నాలో కొంతమేర ఆక్రమించుకొని వున్న డిటెక్టివ్

సాహిత్య పరిజ్ఞానం శవాల్ని ముట్టుకోవద్దని చెబుతోంది. కాని పద్మని తాకాలని, ఆమె శరీరాన్ని చేతుల్తో తడిమి తనివిదీరా ఏడవాలని అన్పించింది. కాని విధిలేక డ్రస్సింగ్ టేబుల్‌వద్ద కెళ్ళి అద్దంలో ఆమె ప్రతిబింబంకేసి చూస్తూ దాన్ని పిచ్చిగా తడుముతూ మనసులోనే రోదించాను.

"యింతలో అక్కడవున్న టైమ్‌పీస్ అలారం బెల్ మ్రోగటం విన్పించి వులిక్కిపడి దాని స్టాపింగ్ బటన్ నొక్కాను. తలుపువేపు చూసిన నాకు గుండె చెదిరి అరవ లేక ఓ కన్నుతో కూతురు ఘోరంగా హత్యచేయబడి నందుకు కన్నీరు కారుస్తూ, మరోకంట నేనే హత్యలు చేశానన్న అపోహవల్ల కలిగిన కోపాగ్ని జ్వాలల్ని వెద జల్లుతూ కన్పించిన శివరామ్‌గార్ని చూసేసరికి ప్రాణంపోయి నంత పనైంది.

"నేను రాకముందే ఆ హత్యలు జరిగాయని చెబుదా మనుకొని ముందుకు అడుగెయ్యబోయాను. కాని ధడాలున తలుపులు మూతపడ్డాయి. పావుగంటలోగా....నా చేతులకి సంకెళ్ళు పడ్డాయి...." చెప్పటం ఆపి జలంధర్‌వేపు చూశాడు నరహరిరావు.

"నిన్ను ప్రేమించటానికి ప్రయత్నించి విఫలులయ్యా రన్నావే, వాళ్ళ ఎడ్రసులు తెల్సా నీకు?"

"తెలీదు. వాళ్ళిద్దరికీ పెళ్ళయిపోయింది. నేను కాదన్నా నని ఓ అమ్మాయి హెచ్చు కట్నంతో ఓ డాక్టర్‌ని పెళ్ళాడి ఫారిన్ వెళ్ళిపోయింది. మరో అమ్మాయికూడా శ్రీశైలం ప్రాజెక్టులో పన్జేస్తోన్న ఓ యింజనీర్‌ని పెళ్ళాడింది."

"ప్రసాదరావు అడ్రస్ చెప్పు...."

"టి. ప్రసాదరావు, నెం. 164-3-8-D, గడ్డి అన్నారం, హైదరాబాద్...."

కాగితంపై నోట్ చేసుకున్నాడు జలంధర్. "నువ్వు చెప్పిందాన్నిబట్టి నువ్వు నిర్దోషివని తేలుతోంది. కాని ఆ విషయం ఋజువుకావాలి. శాయశక్తులా ప్రయత్నిస్తాను. నువ్విప్పుడు చెప్పిన విషయాలన్నీ నిజమయ్యే పక్షంలో నీకు విడుదల లభిస్తుంది. ధైర్యంగా వుండు...." అని చెప్పి వెళ్ళిపోయాడు డిటెక్టివ్ జలంధర్.

3

మధుకర్, పద్మప్రియ అన్నాచెల్లెల్లాంటివాళ్లు. యిద్దరూ ఒకే గదిలో వుండగా హత్య చెయ్యబడ్డారు. నైలాన్‌తాడు విషయాన్నిబట్టి చూస్తే హంతకుడు కాదు—హంతకి అని వూహించాల్సి వస్తోంది. నరహరిని ప్రేమించి తిరస్కరించబడ్డ యిరువురమ్మాయిలూ పెళ్ళిళ్లు చేసుకొని వేర్వేరుచోట్ల వున్నారు. మరి వాళ్ళని హత్యచేసిందెవరు?

నరహరి నీ కేసులో యిరికించటంవల్ల హంతకుడికి లేదా హంతకికి లాభం ఏమిటి?

ప్రసాద్, నరహరి స్నేహితులు. మధ్యలో మధుకర్ పరిచయమయ్యాడు. కాని హఠాత్తుగా ప్రసాద్, మధుకర్‌ల మధ్య స్నేహం ఎందుకు చెడింది? ఒకవేళ పద్మప్రియ....!!?

ఆలోచనల్తోనే గడ్డి అన్నారం వచ్చేసింది. నేరుగా ప్రసాద్ గది ముందుకి తీసికెళ్ళి ఆపాడు కారుని.

ప్రసాద్‌కి తన్నుతాను పరిచయం చేసుకున్నాడు జలంధర్.

అతనికి యిరవైరెండు వుండొచ్చు వయసు. చామన చాయ, హిప్పీతల, గుండ్రటి ముఖం, సన్నని మీసకట్టు, పొడుగుచేతుల నల్లచారల చొక్కా. తెల్లని టెరికాట్ పాంట్, కాళ్ళకి హీల్ బూట్లు. చురుగ్గా కన్పించే కుర్రాడు.

జలంధర్ తన గదికి రావటానికి, పరిచయం చేసుకోటా

నికి గల కారణం ఏమై వుంటుందా అన్న ఆలోచన కలిగించిన ఆశ్చర్యంనుండి యింకా కోలుకోలేదు ప్రసాద్.

"మీకు నరహరిరావు తెల్సా?" సూటిగా ప్రశ్నించాడు జలంధర్.

"తెలీకపోపటం ఏమిటి? అతను చాలా క్లోజ్ ఫ్రెండ్ నాకు...."

"అతన్ని గురించిన వివరాలు కావాలి నాకు...."

మరింత ఆశ్చర్యంగా చూశాడు ప్రసాద్. "ప్రస్తుతం అతని వివరాలు నాకే తెలీదు." అన్నాడు.

"యిప్పటివి కావు. అతకు మీతో పరిచయమైనప్పటి నుండి....మీరెక్కడికో వెడుతున్నట్టున్నారు. యిప్పుడు వీలుగాదంటే మరోసారి వస్తాను."

"అబ్బే! నేనిందాకే బయటికివెళ్ళి మ్యూజిక్ ప్రోగ్రామ్ ఓటి ఫిక్స్ చేసుకొని వస్తున్నాను. మధ్యాహ్నం వెళ్ళాలి రిహార్సల్‌కి. అడగండి చెబుతాను...." అన్నాడు ప్రసాద్, జలంధర్‌కి కుర్చీ చూపుతూ.

కూర్చుని ఆ గది నొక్కసారి పరిశీలించాడు జలంధర్. హోటల్ మీల్స్‌చేసే బ్రహ్మచారి గదిలా వుందాగది. ఓ మంచం, రెండు కుర్చీలు, ఓ టేబులు, టేబులుక్రింది ఓ సూట్‌కేసు, హేంగర్స్‌కి తగిలించిన దుస్తులు. మరో మూల టీపాయ్. దానిపై కాస్మటిక్స్ దాని ప్రక్కనే ఓ గిటార్, ఓ హార్మోనియం, బుల్‌బుల్‌తార, డ్రమ్స్. కపాస్ మొదలైన మ్యూజిక్ ఇన్స్ట్రుమెంట్సున్నాయి.

"....మీకు సంగీతంపై చాలా అభిరుచి, అందులో ప్రావీణ్యమూ వున్నట్టు తోస్తోంది."

"ఏం? అలా అన్నారు?" నవ్వాడు ప్రసాద్.

"ఇనుస్ట్రుమెంట్సు నీటుగా అందంగా అమర్చినదాన్ని బట్టి."

"థాంక్స్.... నేను, నరహరి పరిచయం కావటాని క్కారణం యివే!"

"మధుకర్ ఎలా పరిచయం?"

"ఓ రోజో దొంగ నా జేబులోంచి పర్సు కొట్టే స్తోండగా పట్టుకున్నాడు. ఆ కృతజ్ఞతతో అతను ప్రీవి యస్‌గా వుంటోన్న గదిని ఖాళీ చేయించి నా రూమ్‌లోనే వుండమన్నాను. అన్నట్టు మీరిప్పుడు కర్నూలు నుండి వస్తోన్నారా?"

"లేదు. ఏం అలా అడిగారు?"

"నరహరి ప్రస్తుతం కర్నూల్లో ఉద్యోగం చేస్తోన్నాడు. ఇంటర్వ్యూ కెళ్ళొచ్చినప్పట్నుండి నన్ను కలవలేదు. ఉత్తరముకైనా రాయలేదు."

అతనికి జరిగిన విషయాలేవీ తెలీవని గ్రహించాడు జలంధర్.

"నరహరి ప్రస్తుతం పోలీస్ కస్టడీలో వున్నాడు...."

"వ్వాట్!?" వులిక్కిపడ్డాడు ప్రసాద్.

"మీకు తెలీదా?"

"నిజంగా తెలీదు. నేను గతనెల పధ్నాలుగో తేదీ మద్రాసు వెళ్ళాను. సిన్మా ఇండస్ట్రీలోని ఓ ప్రముఖ తమిళ సంగీతదర్శకుడు తన పిక్చర్లో నాకు ప్రిఫరెన్స్ యిస్తానన్నాడు. అతని లెటర్ చూసుకొని వెళ్ళాను. సహాయకుడిగా వేసుకుంటానన్నాడు...." సంతోషంగా చెప్పుకుపోతున్నాడు ప్రసాద్. కాని ఒక్కసారిగా మళ్ళీ నరహరి గుర్తు రావటంతో అతని ముఖభంగిమలు మారి పోయాయ్. విచారం ప్రవేశించింది అతన్లో.

"ఎప్పుడొచ్చారు మీరు?"

"నిన్న...."

నరహరి చివరిసారిగా మీ వద్దకెప్పుడొచ్చాడు?"

"....మద్రాసు వెళ్ళటానికి ముందురోజు. అంటే— పోయిన్నెల పదమూడవ తేదీన."

"ఆ రోజేం జరిగింది?"

"నా టేప్‌రికార్డర్ చెడిపోయింది. రిపేరుకిచ్చి రూము కొచ్చాను. పదినిమషాల కొచ్చాడు. ఓ పాట రాసి బాణీ సమకూర్చాలన్నాడు. అతని కోరిక ప్రకారం అప్పటి కప్పుడే దానికి రాగాలు రాశాను. నేర్చుకొని వెళ్ళిపోయాడు. మళ్ళీ అతని విషయం నాకు తెలీదు. నిన్న వచ్చిచూస్తే రూమ్‌లో అతని లెటర్ ఒక్కటి కూడా లేదు."

నరహరి చెప్పిందాంట్లో అబద్ధం లేదని గ్రహించాడు జలంధర్.

"నరహరి పోలీసుకస్టడీలో ఎందుకున్నాడు?" బాధగా ప్రశ్నించాడు ప్రసాద్.

"మధుకర్‌కి, మీకు వైషమ్యాలు రావటానికి, అతను మీ నుండి విడిపోవటానికి కారణమేమిటి?" అతని ప్రశ్నకు జవాబివ్వకుండా ఎదురుప్రశ్న వేశాడు జలంధర్.

"..............."

"ఫర్వాలేదు చెప్పండి. మీ నుండి విన్న విషయం నా నోటిదాటి రాదు."

"క్షమించండి. అది పర్సనల్ మేటర్. చెప్పటానికి వీల్లేదు."

"మీరు చెప్పే జవాబు నరహరిని నిర్దోషిగా ఋజువు చెయ్యగలదేమో!"

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

"మధుకర్ హత్యచెయ్యబడ్డాడు. అంతేకాదు...."

"వాట్! మధుకర్...."

"అవును. మీరు చెప్పకపోతే మిమ్మల్ని కూడా అనుమానించాల్సి వస్తుంది."

"చెబుతాను జలంధర్‌గారూ! నా గురించి కాదు. నా సమాధానంవల్ల హరి నిర్దోషని ఋజువైతే అంతకన్నా కావలసిందేముంది?"

సిగరెట్ వెలిగించాడు జలంధర్. ప్రసాద్‌కీ ఆఫర్ చెయ్యబోయి కుర్రాడని విరమించుకున్నాడు.

"ప్రాణస్నేహితుడని కూడా ఆలోచించక నేను ప్రేమించిన అమ్మాయిని ప్రేమించాడు మధు. నేను ప్రేమిస్తోన్నానని అతనికి తెలుసు కూడా. నా పర్సు దొంగచేత పడకుండా కాపాడినందుకు నేనతన్ని నా రూములోనే వుంచుకున్నాను. ఆ మాత్రం ఆలోచించలేని అవివేకి అనుకోలేదు. అందుకే అతన్ని దూరం చేసుకున్నాను. అలాంటి స్నేహితుణ్ణి దూరం చేసినందుకు ఆమె కూడా సంతోషించింది. కాని పద్మప్రియలాంటి ఆడదాన్ని ప్రేమించినందుకు తర్వాత నేను కూడా పశ్చాత్తాపం పడ్డాను."

ఉలిక్కిపడ్డాడు జలంధర్. "పద్మప్రియ!?" అన్నాడప్రయత్నంగా.

"అవును. పద్మప్రియ మీకు తెల్సా?"

"మధుకర్‌తో బాటు ఆమె కూడా హత్య చెయ్యబడింది. హత్య నరహరిపై మోపబడింది."

"ఏమిటి మీరంటున్నది?! మధుకర్‌తోబాటు పద్మ హత్య చెయ్యబడిందా? ఆ నేరం....నరహరిపై మోపబడిందా? ఎలా....యిది ఎలా సంభవం?"

"మీరు చెప్పింది విన్నాక నా మెదడు పని చెయ్యటం మానేసింది. మీకు తెల్సా? నరహరి, పద్మప్రియని ప్రేమించాడు."

"మైగాడ్!! వెధవ నాతో ఒక్కమాటైనా చెప్పలేదే! యింతకూ ఏ పద్మప్రియ మీరంటున్నది? శివరామ్ కూతురేనా?"

"అక్షరాలా!"

తల పట్టుకున్నాడు ప్రసాద్. "ఎంతపని చేశాడు జలంధర్‌గారూ మావాడు! చూచాయగా కూడా ఈ విషయం నాకు తెలీదు. ఏ మాత్రం తెలిసున్నా ఆ ప్రయత్నాన్ని మొగ్గలోనే త్రుంచేసేవాణ్ణి...."

"ఒక్క ఆడది ముగ్గుర్ని ప్రేమించటమా? నమ్మశక్యం కాకుండావుంది."

"పద్మలాంటి ఆడది ముగ్గుర్ని కాదు ముప్పైమంది నైనా ప్రేమించగలదు. అంత విశా....లమైన హృదయం ఆమెది!" వ్యంగ్యంగా అన్నాడు ప్రసాద్.

"కాస్త వివరంగా చెప్పగలరా?"

"వివరంగా చెప్పేముందు మీకో వుత్తరం చూపాలి." గబగబా సూట్‌కేస్ వెదికాడు ప్రసాద్. ఓ వుత్తరాన్ని తీసి జలంధర్ చేతికిచ్చాడు. అందులో యిలావుంది.

"ప్రియమైన ప్రసాద్‌కి,

మీ అక్క వ్రాయునది. పిన్నలు చెడిపోతే సరి దిద్దాల్సిన బాధ్యత పెద్దలపై వుంది. ఈ సంగతి మన పెద్దలవరకూ పోకుండా అడ్డుకొని నేనే పెద్దగా వ్యవహరిస్తూ ఈ వుత్తరం వ్రాస్తోన్నాను. అసలు విషయం నా చేతుల్తో నేను వ్రాయవన్లేదు. నాకు సునీత వ్రాసిన వుత్తరాన్ని జతపరచి పంపుతో

న్నాను. నువ్వు కుర్రాడివైనా నీ జీవితానికి సంబంధించిన విషయాన్నిగురించి ఆలోచించే తెలివితేటలు నీకున్నాయి. కాబట్టి నీ సమస్యకిసంబంధించిన తుదినిర్ణయాన్ని నీకే వదిలేస్తోన్నాను.

ఇట్లు
నీ అక్క_ ప్రమీల."

ఆ పుత్తరానికి ఎన్‌క్లోజ్ చేసిన మరో పుత్తరాన్ని చూశాడు జలంధర్. అందులో ప్రసాద్‌కి సంబంధించినంత వరకూ యిలా వుంది.

"....ప్రమీలా! నీ బాల్యస్నేహితురాలిగా నీకో విషయం గురించి వ్రాయాలని కొన్ని రోజులుగా అనుకుంటోన్నాను. అయినా బాగా ఆలోచించి నీకు తెలియజెయ్యటానికే నిర్ణయించుకున్నాను.

ప్రసాద్ యిక్కడ క్షేమంగా వున్నాడు. కాని ఈ మధ్య పద్మప్రియ అనే ఓ అమ్మాయితో చాల

చనువుగా వుంటోన్నాడు. అతడు కళాకారుడు. అభిమానుల్లో ఆడవాళ్ళూ వుండొచ్చు. కాని అది అభిమానం వరకు వుంటే ఫర్వాలేదు. కాని హద్దు మీరితే....?

ఆ అమ్మాయి మంచిది కాదని విన్నాను. నాకు పరిచయం లేకపోయినా ఆమెని గురించి వాకబు చేశాను. నాకు తెలిసిందాన్నిబట్టి ఆమె గర్విష్ఠి. మగవాళ్ళంటే అదోరకమైన చులకనా భావం. ప్రతి మగాణ్ణీ తన కాళ్ళవద్దకి రప్పించుకొని వాళ్ళని గేలి చేసి వదిలేసే రకం అని తెల్సుకున్నాను. ఆమెని ప్రేమించి భగ్నప్రేమికులుగా మారిన వాళ్ళు యిద్దరున్నారని విన్నాను. మన ప్రసాద్ ఆ విషవలయంలో చిక్కుకోకూడదనే అభిప్రాయంతో నీకు తెలియ జేస్తోన్నాను.

ప్రసాద్ నీకు తమ్ముడైతే నాకు దేవుడిచ్చిన అన్న. మా యింట్లో అద్దెకున్నందుకు ఈ మాత్ర మైనా తెల్సుకోగలిగాను. మీ సొంత విషయాల్లో జోక్యం కల్పించుకున్నందుకు క్షమించు. ప్రసాద్‌ని హెచ్చరిస్తావనే ఆశిస్తాను.

నీ
సునీత"

"సైకోలా వుంది అమ్మాయి...." అన్నాడు జలంధర్, వుత్తరాన్ని చదవటం పూర్తిచేసి.

"సైకోకాదు జలంధర్‌గారూ! గర్వం!! తనే అందంగా వున్నానని, మగవాళ్ళంతా తన చుట్టూ తిరగాలనే అహం భావం!!!

"ఓ సారి మెడికల్ కాలేజీలో నా ఆర్గనైజేషన్‌లో ఓ

మ్యూజిక్ ప్రోగ్రామ్ జరిగింది. ఆ తర్వాత ఈమె నాకు ఉత్తరం వ్రాసింది అభిమానిస్తూ. ఆ పరిచయం అలాగే వృద్ధి అయింది. ప్రేమవరకూ దారితీసింది.

"తనకి బ్యాట్‌మింటన్ నేర్పాలనే సాకుతో తనవద్దకి రప్పించుకునేది. ట్రిమ్‌గా తయారయ్యేది. నా ముందు తన కేసి చూసిన కుర్రాళ్ళని ఈసడించుకునేది. అదంతా చూసి ఆమె నన్నే ప్రేమిస్తోందని మురిసిపోయాను. అంత అందమైన ఆడపిల్ల నా స్వంతం కాబోతోందని పొంగిపోయాను. అదంతా వట్టి నటన అని తేలిపోయింది జలంధర్ గారూ!"

"ఈ వుత్తరం చేరకముందే మధు ఆమెని ప్రేమిస్తో న్నాడని తెల్సుకున్నా నన్నారు....?"

"తెల్సుకున్నాను. అంటే అనుమానించాను. కాని నిర్ధారించుకోలేదు. ఓ రోజు పార్కులో ప్రేమ జంటల నడుమ అతి చనువుగా వుండగా చూశాను. ఆ విషయమై ప్రశ్నిస్తే అతను నానుండి విడిపోయాడు. ఆ తర్వాత మరోరోజు వాళ్ళిద్దర్నీ సిన్మాహాలులో చూశాను. వారి శృంగార చేష్టలు చూడలేక పోయాను. పద్మపై పూర్తిగా అసహ్యం కల్గింది. ఆ తర్వాత వారం లోగానే ఈ వుత్త రాలు చేరాయి."

"నరహరిని యిదివరలో యిద్దరు ప్రేమించి తిరస్కరింప బడ్డారని విన్నాను. మీకు చెప్పాడా?"

"లేదు. యింకేం? ఆ విషయం తెల్సుకొని వుంటుంది. అంతటి ప్రపరాఖ్యుడా చూద్దాం అని వల విసరివుంటుంది. మనవాడు చిక్కుకున్నాడు."

"మరి ఆ విషయం పెళ్ళివరకూ దారి తీసిందిగా?"

"అలాంటి ఆడదాన్ని పెళ్ళాడీ ఏం ప్రయోజనం

జలంధర్‌గారూ? ఎవరితోనా పందెం వేసుకొనుంటుంది పెళ్ళాడతానని....”

“శివరామ్ గారి యింట్లో మధుకర్‌కి చాలా చనువుండే దని విన్నాను. వాళ్ళిద్దరికీ ఏమిటి సంబంధం?”

“నాకూ తెలీదు. నే నెప్పుడూ పద్మ యింటికి వెళ్ళ లేదు. ఆమెని ప్రేమిస్తోన్నప్పుడు కూడ ఎన్నోసార్లు పిలి చేది. కాని ఆమెలోని గర్వాన్ని మొదటే కనిపెట్టిన నేను వాళ్ళింటికి వెళ్ళటానికి నిరాకరించే వాణ్ణి.”

“చాల థాంక్స్. యిక్కడి కొచ్చాక ఎన్నో కొత్త వివ రాలు తెలిశాయ్. మరోమాట. ఆ వుత్తరాలు నా కివ్వ గలరా?”

“నిరభ్యంతరంగా.”

“అవసరమైతే మీరీ కేసులో సాక్ష్యం చెప్పాల్సుం టుంది....”

“ఏమని!”

“గతనెల పదమూడో తేదీ రాత్రి ఎనిమిదిన్నర వరకు నరహరి ఎక్కడున్నాడు?”

“నావద్దే వున్నాడు.”

“అదే విషయం చెప్పాలి.”

“యూ మీన్....”

“ఆరోజు రాత్రి ఎనిమిదీముప్పై నిమిషాలకి యిద్దరూ హత్య చెయ్యబడ్డారు. పద్మ బర్త్‌డే గ్రీటింగ్స్ స్వయంగా తెలియ జెయ్యాలని వెళ్ళిన నరహరిపై హంతకుడన్న ముద్రపడింది....”

“మైగాడ్! ఆరోజు అదేపనిగా పాట ట్యూన్ సెట్ చెయ్య మన్నది యిందుకన్నమాట....అవును గుర్తొచ్చింది.

ఆ పాటలోని సబ్జక్టుకూడ ప్రియురాలికి జన్మదిన శుభాశీస్సులనే!!!"

"కరెక్ట్!"

"తప్పకుండా సాక్ష్యమిస్తాను. నిజాన్ని ధైర్యంగా చెప్పటానికి పిరికితనం యెందుకు!"

"నరహరి నిర్దోషని తేలిపోయింది. మరి దోషి ఎవరు? అది తేల్చుకోవాలి. అవసరమైతే మరోసారి కలుస్తాను...."

4

"శివరామ్ వున్నారా యింట్లో?" పనిమనిషిని ప్రశ్నించాడు జలంధర్.

"ఉన్నారు బాబూ!"

"డిటెక్టివ్ జలంధర్ వచ్చాడని చెప్పు...."

లోపలికి వెళ్ళిపోయింది. నిమిషం తర్వాత మళ్ళీ వచ్చింది లోనికి రమ్మన్నట్టుగా చెప్పింది.

....డిటెక్టివ్‌ని చూడగానే నమస్కరించాడు శివరామ్. కాని తన రాక అతనికి అయిష్టతని కల్గించిందని అతని ముఖంచూసి గ్రహించాడు జలంధర్.

అవును మరి. తను ముద్దాయి తరఫున కోర్టులో వాదించాడు. ముద్దాయిని నిర్దోషిగా నిరూపించటానికి ప్రయత్నిస్తోన్నాడు. అది అతనికి కంటక ప్రాయంకాదూ! కాని నరహరి నిర్దోషని రేపు కోర్టులో యెలాగూ తేలుతుంది అప్పుడు....?!

"....మీనుండి కొన్ని వివరాలు సేకరించే వుద్దేశ్యంతో వచ్చాను" అన్నాడు.

"ఎన్ని వివరాలు సేకరించినా యెంతవాదించినా దోషికి శిక్షపడేలా చెయ్యగలరుకాని చనిపోయిన నా చిట్టి తల్లిని, ఆత్మీయుల్లో ఆత్మీయుడు మధుని బ్రతికించగలరా?"

"బ్రతికించ లేకపోయినా ఒక నిర్దోషికి అనవసరంగా, అన్యాయంగా శిక్ష పడకుండా వుండేలా చెయ్యగలను శివరామ్ గారూ!"

"అడగండి...." అన్నాడు శివరామ్ భారంగా నిట్టూరుస్తూ.

"మధుకర్ మీ కేమవుతాడు?"

"ఆఁ....!?" ఉలిక్కిపడి అతనికేసి చూశాడు శివరామ్.

అదే ప్రశ్న రిపీట్ చేశాడు జలంధర్.

"సారీ....నా చిట్టితల్లి పోయిన దగ్గర్నుంచి నా మనసు పూర్తిగా దెబ్బతింది. మధు విషయం అడిగారు కదూ! చెప్పానుగా ఆత్మీయులలో ఆత్మీయుడని!?"

"అతను కుర్రాడు. మీరు చాల పెద్దవారు. వయోభేదం అంత వుంచుకొని మీరు ఆత్మీయుడు అంటోన్నదాన్నిబట్టి నాక్కాస్త అసహజత గోచరిస్తోంది. కాస్త వివరంగా చెబితే అర్థమవుతుంది."

జేబులోంచి సిగరెట్ పెట్టె లైటర్ తీస్తూ అన్నాడు జలంధర్.

జలంధర్ సిగరెట్‌తో పాటే తనూ చుట్ట వెల్గించుకొని ప్రారంభించాడు శివరామ్.

"శిఖామణి నా బాల్య స్నేహితుడు. పేదవాడైనా తెలివి గలవాడు. నేను ఎంప్లాయిమెంటాఫీసులో గుమస్తాగా వుద్యోగం చేస్తోండే వాణ్ణి. అతనికి యెంత ప్రయత్నించినా వుద్యోగం దొరకలేదు. ఎన్నోసార్లు ఇంటర్వ్యూలు పంపాను. కాని ఆ కాలంలోనే అతనికి వుద్యోగం రాలేదంటే అతనికి గవర్నమెంటు సొమ్ము తినే ప్రాప్తం లేదనే చెప్పాలి.

"కాని గవర్నమెంటు సొమ్ముతినే అదృష్టం నావిధిలో కూడ కొంతభాగం మాత్రమే వుండింది. ఓరోజు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాను. వుద్యోగం పోయింది.

"శిఖామణి ఎంతో విచారించాడు. కొన్నాళ్ళు గడిచాక నాకో అయిడియా తోచింది. లంచాల రూపంలో సమకూరిన డబ్బు నావద్ద దాదాపు ఏడెనిమిది వేల దాకా వుండింది. ఆ డబ్బుకి శిఖామణి తెలివితేటలు కలిపి వ్యాపారమేదేనా చేస్తే??"

"ఆ విషయం ప్రస్తావిస్తే అతను ఎగిరి గంతేశాడు. మరునెలలోనే చిన్నవ్యాపారం మొదలెట్టాము. క్రమేణా వ్యాపారం పెరిగింది. లాభమూ పెరిగింది. పట్టిందల్లా బంగారమవుతూ వచ్చింది. యిద్దరం పెద్ద పెద్ద మిద్దెలు కట్టాం. ఎంతో వెనకేసుకున్నాం."

"దాదాపు నాలుగేళ్ళ క్రితం వ్యాపార రీత్యా రంగూన్ వెడుతూ, నౌక మునిగి పోవటంతో చచ్చిపోయాడు శిఖామణి.

"ఆ విషయం చెబుదామని యింటికెళ్ళి శిఖామణి భార్యతో ఎంతో జాగ్రత్తగా చెప్పాను. కాని భర్తంటే ప్రాణమిచ్చే ఆమె భర్తపోయాడని తెల్సిన మరుక్షణం ప్రాణం వదిలేసింది. ఇంటర్ చదువుతోన్న ఒక్కకుర్రాడూ అనాథై పోయాడు."

"ఆ కుర్రాడే మధుకర్!"

"చెప్పండి. వ్యాపారంలో నాకు వాటా యిస్తూ మరణాన్ని మాత్రం తనొక్కడే పొందిన శిఖామణి కొడుకు నా ఆత్మీయుడు కాడా?"

జలంధర్ మదిలో ఏదో మెరుపు మెరిసింది.

"చాల థాంక్స్. అరటిపండు వలిచి చేతిలో పెట్టినంత వివరంగా చెప్పారు." అంటూ లేచాడు జలంధర్.

5

చటుక్కున ఆ గదిలోకి దూరాడు జలంధర్. గది చీకటిగా వుంది. జేబులోంచి పెన్‌టార్చి తీసి వెలిగించాడు. ఒక్కసారి గదంతా పరిశీలనగా చూశాడు.

గది నీటుగావుంది. ఓ మూల టేబులుంది. గబ గబా వెళ్ళాడు. టేబుల్ డ్రాయర్ లాగాడు. ఏవేవో కాగితాలు కన్పించాయి. అన్నీతీశాడు. కాని తనకి పనికొచ్చే విషయ మేదీ ఏ రూపంలోనూ కన్పించలేదు.

మరోమూల గాడ్రెజ్ అలమారుంది. దాన్ని అలాగే తెరిచాడు.

ఒక్కొక్క కాయితమూ చూసి పెదవి విరుస్తూ మళ్ళీ అందులోనే పెడుతోన్నాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

చివరగా ఓ చిన్నపుస్తకం కన్పించింది. దాన్ని డైరీగా గుర్తించిన జలంధర్ కళ్ళు మెరిశాయి! పేజీలు తిరగేశాడు. కొన్ని పేజీలయ్యాక ఒక్కో పేజీ చదివేకొద్దీ అతని పెద వులు విచ్చుకోసాగాయ్.

"....అయిపోయింది. కేసు తేలిపోయింది. హత్యాలు చేసిందెవరో తెల్సిపోయింది. తన అనుమానం నిజమైంది. తను పడిన శ్రమకి తగిన ఫలితం లభించింది .. మైగాడ్!"

ఆలోచిస్తోన్న జలంధర్ 'టక్' మన్న చిన్న శబ్దంతో పాటు, ఒక్కసారిగా గదినిండా వెలుగు వెదజల్లబడటంతో వులిక్కిపడి తలెత్తి ద్వారంవేపు చూశాడు.

చిర్నవ్వుతో నిలబడున్నాడతను. అతని చేతిలోని

పిస్తోలు నిగనిగ లాడుతూ ఆత్రంగా జలంధర్ హృదయాన్నే చూస్తోంది!

"నాకు తెలుసు నువ్వొస్తావని...." అదే చిరునవ్వుతో అన్నాడతను.

"నాకూ తెలుసు నువ్వే హంతకుడివని. కాని యిప్పుడు ఆధారాలతో సహా తేలిపోయింది."

"మర్యాదగా ఆ డైరీ ఎక్కడుందో అక్కడే పెట్టేసి బుద్ధిగా తిరిగి చూడకుండా వెళ్ళిపో. లేదా తెల్లవారే సరికి పత్రికలూ రేడియోలూ గొల్లు మంటాయ్...."

"నువ్వంత సమర్థుడివేనని నాకు తెలుసు. అందుకే నీపై అనుమానాన్ని వెల్లడిచేస్తూ నే నిక్కడికే వస్తున్నానని తెలియపరుస్తూ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ చక్రవర్తితో ఈ అడ్రస్ చెప్పివచ్చాను ఇరవై నిమిషాల్లో రాకపోతే

వచ్చేయ్యమని. యిప్పుడు పావుగంట అయింది. ఈ పాటికి బయల్దేరి వుంటారు.”

“అన్నిటికీ తెగించాను. నిన్నిప్పుడు చంపినంత మాత్రాన రేపు నాకు మరో క్రొత్త శిక్షపడదు. ఆలోచించుకో. కన్నకూతురని కూడ జాలి తలచక హత్యచేసిన వాణ్ని నీపై జాలిపడతా ననుకోవటం పొరపాటు.”

“అదుగో! ఇన్స్పెక్టరే వస్తోన్నాడు యిక సమస్యే లేదు—”

అప్రయత్నంగా వెనుదిరిగాడు శివరామ్.ఆ సమయంలో ఒక్క-క్షణం చాలు జలంధర్‌కి, శివరామ్ చేతిలోని పిస్తోల్ని తన చేతిలోకి రప్పించుకోటానికి....

6

“యువరానర్!

“నా భార్యకి పద్మ పుట్టకముందు. ఓసారి అబార్షన్ జరిగింది. ఆ సమయంలో అనీమియా వల్ల చాలా రోజులు ఆమె బెడ్ రెస్ట్ తీసుకోవలసి వచ్చింది.

“వయసులో వున్న శరీరం పొంగుతున్న రక్తాన్ని ఆపుకోలేక పోయాను. నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోయాను. నాలోని ఆవేశానికి, వుద్రేకానికి ఆనకట్ట కట్టలేకపోయాను.

“ఫలితంగా బలవంతంగా లొంగి పోవాల్సి వచ్చింది మా పనిమనిషి. అమ్మగారితో చెబుతానని బెదిరించింది అంతా అయిపోయాక నేను చిరునవ్వు నవ్వాను.

“అది పనిమనిషి. నేను శ్రీమంతుణ్ని. ఈ విషయం నలుగురితో చెప్పినా దాని ముఖం మీదే వూస్తారు. ఆస్తి కాజెయ్యటానికి అదే నాపై వలవేసిందని దాన్నే వెలి

వేస్తాను. అదే విషయం చెప్పాను. గొల్లుమంది కాళ్ళమీద పడింది.

"నాలో మానవత్వం మేల్కొంది. ఆమెని ఓదార్చాను ప్రతిఫలంగా డబ్బివ్వ బోయాను తిరస్కరించింది. అప్పుడు కలిగింది ఆమెపై నాకు ప్రేమభావం. కాని ఈ విషయం చెబితే నా భార్య ఆత్మహత్య చేసుకుంటుంది. అలాగని పని మనిషినీ అన్యాయం చెయ్యలేక పోయాను. ఆమెని ఆ స్థానంనుండి తప్పించాలని దొంగతనం మోపి వెళ్ళగొట్టాను. నా భార్యకి అనుమానం రాలేదు.

"ఆ తర్వాత ఆమెని విజయవాడ చేర్చాను. ఆమె జీవనోపాధికి కావలసిన వన్నీ అమర్చాను. నెలకి వెయ్యి రూపాయలు పంపిస్తూ వచ్చాను. అప్పుడప్పుడూ వెళ్ళి కొన్నాళ్ళువుండి వచ్చేవాణ్ని.

"వచ్చీరాని తెలుగులో గర్భవతినని ఆమె రాసిన వుత్తరం చదివి నవ్వాలో ఏడవాలో తెలీలేదు. అదృష్ట మనుకోవాలో దురదృష్ట మనుకోవాలో బోధపడలేదు. క్షణి కోద్రేకానికి లొంగి చేసిన అవివేకపు పనికి లభించిన ఫలితాన్ని గురించి ఎలా ఆలోచించినా ఒక్కటే! అందుకే నన్ను నేను సంబాళించుకున్నాను. అన్యాయం చెయ్యలేక పోయానా గర్భవతికి.

"ఆమెకూడా పవిత్రంగా బ్రతుకుతూ వచ్చింది. సహజంగా అందమైంది కావటంతో ఆమెని అక్కడ పని మనిషని ఎవ్వరూ అనుకోలేకపోయారు. నేనుకూడ ఆమె లగ్జరీగా బ్రతికే ఏర్పాట్లు చేశాను.

"తర్వాత మూడేళ్ళకి నాకు కూతురు పుట్టింది. అక్కడ కొడుకు పెద్దవాడవుతూ వచ్చాడు. ఏళ్ళు గడిచాయ్. ఇద్దరూ పెద్దవాళ్ళయ్యారు.

"ఓరోజు విజయవాడనుండి టెలిగ్రామ్ వచ్చింది. వెళ్లాను. 'తండ్రేడీ' అని మాటిమాటికీ అడిగే కొడుక్కి నిజం చెప్పలేక వయసొచ్చిన కొడుకు బయట మాటలన్పించు కొని తనని అనే నిందావాక్యాల్ని మౌనంగా భరిస్తూ, గుండెనొప్పి తెచ్చుకున్న ఆమె చివరి దశలోకూడ మధుకి నేనే తండ్రినని వెల్లడిచెయ్యలేదు. తనని ఆపదలోంచి ఆదుకున్న మహానుభావుడుగా మాత్రమే పరిచయంచేసి కన్నుమూసింది.

"అతన్ని-అయ్‌మీన్ మధుని—నా స్వంత కొడుకుని - నా వెంటే తీసుకొచ్చాను. కాని కొడుగ్గా యింట్లో పరిచయం చెయ్యలేకపోయాను. కారణం నా భార్యకూడ బలహీన మైందే, అతన్ని యింట్లోనే వుంచుకుందామనుకున్నా అతనికీ నీకూ ఏమిటి సంబంధం అని అడిగితే ఏం చెప్పాలి?

"అందుకే విడిగా వుంచి వాడిక్కావలసినవన్నీ సమ కూర్చాను. నాకు దగ్గరై నా దొంగబ్రతుకు తప్పలేదు వాడికి.

"కాని యువరానర్! మధు, పద్మ స్వంత అన్నా చెల్లెళ్లు. చూచాయగా చెప్పాను వాళ్ళిద్దరికీ, వాళ్ళ మధ్య అలాంటి సంబంధం వుండాలని. అలాగే వుంటారను కున్నాను.

"కాని యిద్దరూ యింతకి తెగిస్తారనుకోలేదు. ఆ విషయం నాకు హత్య జరిగిన రోజిటివరకూ తెలీదు. అంతకుముందే నరహరి—అయ్‌మీన్ ముద్దాయిని పద్మ ప్రేమిస్తోందని తెల్సింది. అతను పేదవాడు కావటంతో నా కిష్టంలేకపోయింది. అదేమో మొండి పట్టుపట్టింది.

"హత్య జరిగిన రాత్రి నేను మొదటిసారి భోజనానికి పిలవటానికి అక్కడికి రావటం, గదిలో వాళ్ళిద్దరి సంభాషణ వినటం సంభవించింది. వాళ్ళ సంభాషణలోని సారాంశం

ఏమిటి? — పద్మకి, మధుకి చాల రోజులుగా శారీరక సంబంధంకూడ వుంది!

ముద్దాయిని ప్రేమించిన యిద్దరమ్మాయిలెవరూ అతన్ని పెళ్ళి చేసుకోలేకపోయారని, తమకై తాము పెళ్ళి చేసుకుంటామని వచ్చిన తన స్నేహితురాళ్ళని అలక్ష్యం చేసినందుకు అతని గర్వం అణచాలని, అందుకు తను అతనికి భార్య కావాలని పద్మ వుద్దేశ్యం! మరో అసహ్యాకరమైన విషయం ఏమిటంటే—తను ముద్దాయిని పెళ్ళి చేసుకున్నా, మధుకి సుఖాన్నందిస్తుందిట!!!

"నాలో రక్తం లావాగా మారింది. నేను నా కూతురికిచ్చిన స్వేచ్ఛ దాన్ని పతనాని కీడ్చింది. నేను దానిపట్ల చేసిన గారాబం నాపట్లే శరాఘాతమైంది. యిక వాళ్ళ మాటలు విన్లేకపోయాను. నేను అమాయకురాలైన పని మనిషికి చేసిన ద్రోహానికి ఫలితం నా బిడ్డరూపంలో ఎదురై ందన్పించింది. కోపం కట్టలు త్రెంచుకు ప్రవహించింది.

"ఆవేశంలో నేనే చేశానా హత్యలు. కాని తర్వాత చింతించాను. ఎంతైనా ఒకే రక్తం! మధుని హత్య చెయ్యటంద్వారా నా రక్తాన్ని నేనే కళ్ళజూసుకున్నాను.

"చెప్పండి యువరానర్! నేను హంతకుణ్నే! చేసింది ఘోరమే! దీనికి శిక్ష అనుభవించక తప్పదు. వురికంబం ఎక్కేముందు చివరి కోరిక ఏమిటని అడుగుతారు. నేను మాత్రం ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పమని కోరతాను. ఆ ప్రశ్నేమిటో యిప్పుడే అడుగుతాను...నా బిడ్డకు-నా కొడుకు వల్ల సంతానం కలిగితే వాళ్లు ఒకరికొకరు ఏమవుతారు? వాళ్ళందరూ నాకేమవుతారు? చెప్పండి యువరానర్....!

"..................."

"చెప్పలేరు. ఎవరూ చెప్పలేరు. అందుకే ఈ నేరం

చేశాను యువరానర్! కాని సాక్షి శ్రీ ప్రసాదరావు చెప్పిం దాన్నిబట్టి నా బిడ్డ ఎంతటి నెరజాణో అర్థమౌతోంది. ఒక రికి తెలియకుండా మరొకరితో ప్రేమకలాపాలు సాగిస్తూ ఎందరి హృదయాలతోనో ఆడుకున్న ఆ రాక్షసి చావ్వాల సిందే....యిక నేను చెప్పాల్సిందేదీ లేదు యువరానర్..." అంటూ ముగించాడు శివరామ్.

"మరి మీరు చేసిన ఈ నేరాన్ని నరహరిపై ఎందుకు తోశారు?" ప్రశ్నించాడు జలంధర్.

"ఏ నేరస్థుడూ తనంతట తను పట్టుబడాలనుకోడు జలంధర్‌గారూ! సమయానికి నరహరి వచ్చాడు. అతనిపై తోశాను. అతనిపై తోసినా, ఎంత తెలివిగా హత్యలు చేసినా చివరకి ఓటమి తప్పలేదు."

"దట్సాల్ యువరానర్!" అంటూ వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు డిఫెన్స్ లాయర్ జలంధర్. ***

"దేనికిదంతా!"

బస్‌స్టాండ్‌లో రోజూ అడుక్కుతినే బిచ్చగాడు ఆ రోజు ఉత్సాహంగా అందరికీ చాక్లెట్‌లు పంచిపెడు తున్నాడు—

జనం:- దేనికిదంతా! లాటరీ ఏమైనా వచ్చిందా?

బిచ్చగాడు:- కాదు బాబయ్యా! నేను యీ వృత్తిలో దిగి 25 సంవత్సరాలయింది. అందువల్ల సిల్వర్ జూబ్లీ చేసుకుంటున్నాను.

—యస్. సుధారాణి, మద్రాసు-35.



పున్నయ్య దొంగతనం మాని ఆర్నెల్లయింది. ఆ ఆరు నెలల్లో ఎందరో అతనికి 'మంచివాడు' అనే బిరుదు ప్రదానంచేశారు.

తమాషా ఏమిటంటే, గతంలో అతని చెడ్డతనం అతనికి సర్వసుఖాలూ అందించిందే కానీ, ఈ నాటి మంచి తనం మాత్రం మింగమెతుకు లేకుండా చేసింది.

అంతవరకూ నయం. వాడిపెళ్ళాం వాళ్ళింట్లో, వీళ్ళింట్లో పాచిపనీ అదీ చేస్తోంది గనక, వాళ్ళిద్దరి పొట్టల్లో వేళకింత కలో, గంజో పడుతోంది.

ఇప్పుడు మంచివాడైన పున్నయ్య ఒకనాడు ఆరితేరిన జేబుదొంగ. అతనిచేత దొంగతనం మానిపించిన ఘనత పోలీసుల లాఠీలకో, జైలు కటకటాలకో చెందదు. ప్రస్తుతం వాడు అల్యూమినియం పైసా కూడా సంపాదించలేకపోతున్నానే — అని బాధపడటానికి కారణం ఎవ్వరో కాదు— సాక్షాత్ వాడి భార్య గౌరమ్మే!

గౌరి పోరగా, పోరగా పున్నయ్య ఆమె మీదగల అపారప్రేమ కారణంగా ఆ దొంగబ్రతుక్కి విసిగి, ఇహ దొంగతనం చెయ్యనని ఆమెమీద ప్రమాణంచేసి మరీ చెప్పాడు. చెప్పడంలో ఊరుకోక ఆచరణలో పెట్టి చూపాడు.

చెప్పిన మాట ఆచరణలో పెట్టడం మనదేశంలో చాలామంది 'పెద్దలకు' అలవాటు లేదు. పున్నయ్య అతి చిన్నవాడు గనక ఆ అలవాటు వాడికింకా పోలేదు మరి!

మొగుడు దొంగతనం మానెయ్యడం గౌరికి చాలా ఆనందాన్ని కలగజేసింది. ఆ తరవాత, పనీ పాటా లేకుండా ఇంట్లో కూర్చోలేకపోయిన పున్నయ్య ఓ చోట కూలీగా చేరాడు.

చివరికి ఓ రోజు—మేస్త్రీ 'దొంగవెధవ' అన్నాడన్న కోపంతో ఆ పని మానేశాడు. దొంగతనం తరవాత, ఆ విధమైన మాట పడటం అతనికి మా చెడ్డ అవమానంగా తోచింది.

ఆ రోజు అతనెంతో బాధపడ్డాడు.

గౌరి, భర్తను ఓదారుస్తూ, "పోనీలే మావా! ఇంత

కన్నా మా రాజులాంటి పని దొరుకుతుందిలే!" అంది.

ఆ తరవాత పున్నయ్య, 'మారాజు'లాంటి పనికోసం ప్రయత్నించాడు. ప్రభుత్వ అజమాయిషీలోవున్న బ్యాంకుల ప్రకటనలు విని, ధైర్యంచేసి ఓ బ్యాంకులోకి వెళ్ళి తనకో రిక్షా కొనుక్కుందుకు డబ్బివ్వమని అడిగాడు—అప్పుగా.

బ్యాంకు అధికారి పున్నయ్యను ఎగాదిగా చూసి, "ఎవరన్నా పెద్దమనుషులుంటే తీసుకురా!" అన్నాడు.

"పెద్దమనుషులకి రిక్షాతొక్కే ఖర్మేం పట్టింది బాబూ!" అన్నాడు పున్నయ్య అమాయకంగా.

ఆ అధికారి విసుక్కుని—"నీలాంటి వాడికి ఎవ్వరో ఒకరు ష్యూరిటీ యివ్వాలి కదయ్యా?" అంటూ పెద్ద ఉపన్యాసం ఒకటి దంచాడు.

'ష్యూరిటీ' అనే పదం అర్థంగాకపోయినా, భావం అర్థమైన పున్నయ్య, నిరాశతో తిరుగుముఖం పట్టాడు.

మరో చోట—"వెనకేమైనా స్థిరాస్తి వుందా?" అన్న ప్రశ్న వినిపించింది.

'వెనక స్థిరాస్తి వుంటే, అప్పు అడగడానికి నేనెందుకు ముందుకు వస్తాను?' అనుకున్నాడు పున్నయ్య.

ఆ విధంగా అతని మారాజులాంటి పని ఆశలు అడుగంటాయి. ప్రతిరోజూలాగే ఆ రోజు కూడా అక్కడా ఇక్కడా తిరిగి, ఇల్లుచేరిన పున్నయ్యకి, ఆ సమయంలో ఇంటిదగ్గర గౌరి వుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది. కొంపదీసి, పెళ్ళాం పని మానెయ్యలేదుగదా అన్న అనుమానం కూడా కలిగింది.

మొగుడి మొహంలో తొంగిచూసిన భయానికి మరో విధంగా కారణంగా ఊహించింది గౌరి.

"ఏమిటే, ఈ రోజు ఇంత తొందరగా వచ్చావు?"

అడిగాడు పున్నయ్య ఎలాగో గొంతు కూడదీసుకుని.

"ఏ నిముషంలోనన్నా కనేట్టున్నావు. ఇక పనెట్టా సేస్తావు? అంతా అయిపోయినాక రా, అంటూ రెండ్రూపాయలిచ్చి పంపింది మా యమ్మగోరు!" అంది గౌరి సంతృప్తిగా.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది పున్నయ్యకి, త్వరలో తమకో నలుసు కలగబోతున్న సంగతి. ఇప్పుడు గౌరి నిండు చూలాలు!

"ఎట్టాగే?" అన్నాడు పెళ్ళాంవైపు దీనంగా చూస్తూ.

భారతదేశపు ఆర్థికమంత్రి, రోజు రోజుకీ పెరిగిపోతున్న దేశజనాభాను చూసి, వేస్తున్నట్టుందా ప్రశ్న.

గౌరి పలకలేదు.

తమకే పుట్టగతుల్లేక అంగలారుస్తోంటే, మధ్య మరో ప్రాణి కూడానా? పరిస్థితి తాత్కాలికంగా వాళ్ళనలా కృంగదీసిందేగానీ, పుట్టిన తరవాత ఆ బిడ్డకూడా ఏదో ఒక విధంగా పెరక్కపోదు, అన్న ఆలోచన కాస్త ఉపశమనం కలిగించింది.

దరిద్రానికీ, సాంప్రదాయానికీ మధ్య జరిగిన సంఘర్షణలో చివరికి సాంప్రదాయమే జయించింది.

తలిదండ్రు లిద్దరికీ, మనసులో ఏమూలో అయిష్టమున్నా, లెక్క చెయ్యకుండా పుట్టిందొక జాలి కనుల పసికందు!

తాత్కాలికంగా కష్టాలన్నీ మరచిపోయి పిల్లనిచూసి మురిసిపోయారు.

ఐతే, వాళ్ళ ఆనందం ఎంతోకాలం నిలవలేదు.

మూడు నెలల తరవాత ఆపిల్ల ఏం తాగినా కక్కుకోవడం, చిక్కిపోవడం ప్రారంభించింది!

ఇద్దరూ గాభరాపడి, బిడ్డని ధర్మాసుపత్రికి తీసికెళ్ళారు. ధర్మరాజైన డాక్టరు పరీక్షించి, ఆ పిల్ల కడుపులో రెండు పేగులు ఒకదానితో ఒకటి మెలివేసుకుపోయాయనీ, ఆపరేషన్‌జేసి వాటిని విడదీయకపోతే ప్రమాదమనీ చెప్పాడు.

ధర్మాసుపత్రిలో చికిత్స పొందడానికి సర్వాధికారాలూ వున్న ఆ భార్యాభర్తలిద్దరూ అతనివైపు బేలగా చూశారు.

డాక్టర్ చిద్విలాసంగా నవ్వుతూ, వందరూపాయలిస్తే ఆపరేషన్ 'ఉచితంగా' వెంటనే చేస్తానని అభయమిచ్చాడు.

వందరూపాయలు ఒక్కసారిగా చూసి, వందరోజులు దాటాయి పున్నయ్యకు. గౌరి గుండెలు గుబ గుబలాడాయి.

డాక్టర్ని కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమాలారు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

దాంతో ఆయన వాళ్ళమీద ఎంతో జాలి కురిపిస్తున్నట్టు పెద్ద ఫోజొకటి పెట్టి, చివరకి ఏభై రూపాయలకు వొప్పుకున్నాడు. ఇందులో ఆయన తప్పేంలేదు. తప్పంతా అటువంటి డాక్టర్లని తీర్చిదిద్దే కాలేజీలది.

ఆ కాలేజీలు మెడికల్ స్టూడెంట్స్ వద్ద పదీ పదిహేను వేలు డొనేషన్ పేరుతో దులుపుకుని మరీ సీట్లిస్తాయి. వైద్య విద్యాభ్యాసంతో బాటు 'ఆమ్యామ్యా' పద్ధతికూడా వాళ్ళ కక్కడే అబ్బుతుంది మరి!

ఆ ఏభై రూపాయలు కూడా పున్నయ్యా, గౌరీ ఇచ్చుకోలేనంత మొత్తమే! కానీ, బిడ్డని కన్నాక బ్రతికించుకోవలసిన ధర్మం తమకుంది కాబట్టి, ఆ డబ్బుకోసం ప్రయత్నించడానికి ధర్మాసుపత్రినించి కాళ్ళీడ్చుకుంటూ బైలుదేరారు.

"నువ్వేం బెంగెట్టుకోకే గౌరీ! నే నేట్టాగో తంటాలడి ఆ డబ్బు సంపాదిస్తా!" అన్నాడు పున్నయ్య.

"నువ్వేం దిగు లెట్టుకోకు మావాః! నేనా ఇంటో ళ్ళని అడుగుతా. బిడ్డకోసం మళ్ళీ ఆ పాడుపనికి దిగ మాకః!" అంది గౌరి హెచ్చరిస్తూ.

ఇద్దరూ తలవంచుకున్నారు. విషాదం వారిద్దరి మధ్య నాట్యం జేసింది. పున్నయ్య వేగంగా అక్కణ్నించి వెళ్ళి పోయాడు.

మొగుడు వెళుతున్న వైపు చూస్తూ....'పిచ్చి మావః! ఏభై రూపాయలెవడిస్తా డిప్పుడు? ఆవేశంలో యెల్తున్నాడు గానీ!' అనుకుంటూ, తను పనిజేసే ఇంటివైపు బైలు దేరింది గౌరి.

2

పున్నయ్య తనకు తెలిసిన వాళ్ళందరి దగ్గరా అప్పడిగాడు. అప్పనగానే అందరూ అతనివైపు వింతగా చూసేవారే!

ఏభై రూపాయలివ్వడానికి అతనికి తెలిసిన వాళ్ళెవ్వరి వద్దా స్తోమతులేదు. అధవా కొందరికున్నా, పున్నయ్య ఆ సొమ్ము తమకి తిరిగి ఇవ్వలేడని జంకి వెనక్కి తగ్గారు.

జీవితంలో మొదటిసారి తన బ్రతుకుమీద విపరీతమైన రోత పుట్టింది పున్నయ్యకు. ఆ డబ్బు సంపాదించందే తిరిగి ఇంటి కెళ్ళకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

విచారగ్రస్తుడై, రోడ్డునపడి నడుస్తున్న అతని దృష్టి, ఓచోట జనం గుంపులు గుంపులుగా గుమిగూడి వుండటం కనిపించింది. అంతా ఏదో వినోదం చూస్తున్నట్టున్నారు.

ఆ దృశ్యం చూడగానే పున్నయ్యకి తన 'పాత'రోజులు జ్ఞాపకం వచ్చాయి. దాంతోబాటు గౌరి చేత చేయించుకున్న

ప్రమాణంకూడా గుర్తొచ్చింది.

ఆ వెనకే, దీనంగా చూస్తున్న బిడ్డ, ఆ పిల్ల కడుపులో మెలిపడ్డ పేగులూ కళ్ళకి కట్టినట్టు కనిపించాయి. పున్నయ్యకి కడుపులో దేవినట్టయింది.

'మంచివాడు'గా మారిన పున్నయ్య ఉత్త పున్నయ్యగానే మిగిలిపోడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ జనం మధ్య, ఓ కుర్రాడి హిప్‌పాకెట్‌లోంచి తొంగి చూస్తున్న పర్సు అతన్ని ఆకర్షించింది. ఆ కుర్రాడు అతి సాధారణమైన దుస్తులు ధరించి వున్నాడు.

పున్నయ్య చేతులు అంతకు ముందెన్నడూ అంతగా వణకలేదు. ఏమూలనించో ఎవరో ఇది తప్పని హెచ్చరిస్తున్నట్టనిపించింది.

అటువంటి పని అతనికి వెన్నతో పెట్టిన విద్య. క్షణంలో ఆ కుర్రాడి జేబులోని పర్సు అతని చేతుల్లోకి వచ్చేసింది. మరుక్షణం అతను జనం మధ్య కలిసిపోయాడు.

రెండుమూడు నిమిషాల తరవాత ఆ కుర్రాడు యథా లాపంగా హిప్‌పాకెట్‌పైకి చెయ్యిపోనిచ్చి, అదిరిపడ్డాడు!

మరుక్షణం అతని నోట్లోంచి చిత్ర విచిత్ర శబ్దాలు బైటికి వచ్చాయి. వినోదం చూస్తున్నవాళ్ళంతా అతని చుట్టూ మూగారు.

"పర్సు పోయిందండి! అందులో నలభై ఐదు రూపాయ లున్నాయి. పరీక్షఫీజు కట్టడానికి ట్యూషన్స్ చెప్పి సంపా దించిన డబ్బండీ అది!" ఎవరితోనో కన్నీటిమధ్య మొర పెట్టుకున్నాడా కుర్రాడు.

అతని స్థితిచూసి జాలి పడ్డారు కొందరు. మరి కొందరు తమకు తోచిన వ్యాఖ్యానాలు చెయ్యసాగారు.

అంతా దొంగ వేషాల్లెండి .... కూటికోసం కోటి విద్యలు ...." ఆ మాటలు వింటున్న పున్నయ్యకి, వాళ్ళ పీకలు పిసికెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఆ కుర్రాడి దీన స్థితిచూసి, కొవ్వొత్తిలా కరిగిపోయాను.

అందుకు తనే కారణమన్న ఊహరాగానే సిగ్గుతో కుంచించుకు పోయాడు. ఈ విషయం గౌరికి తెలిస్తే తనని ఎంత అసహ్యించు కుంటుందో అన్న ఆలోచనరాగానే చక చక ముందుకెళ్ళి ఆ కుర్రాణ్ని చేరుకున్నాడు.

ఆ సమయంలో తనేం జేస్తున్నాడో అతనికే తెలీదు.

అతన్ని ప్రశ్నార్థకంగా చూశాడా కుర్రాడు.

"ఈ పర్సు మీదేనా?" అడిగాడు పున్నయ్య.

అతనిదే నని స్పష్టంగా తెలిసినా, తెలిసే తనని తాను కాపాడుకోడానికి అలా అడిగాను.

ఆ కుర్రాడు నివ్వెరబోయి. "అవును!" అంటూ పోయిన పెన్నిధి దొరికినట్టు గబుక్కున అతని చేతిలోంచి ఆ పర్సు లాక్కున్నాడు.

"ఎంచుకోండి!"

"సరిగ్గానే వున్నాయి."

జనంలోంచి వ్యాఖ్యానాలు బైలుదేరాయి.

"వాడే తీసివుంటాడు."

"వాడే తీస్తే తీసుకొచ్చి ఎందుకిస్తాడు?" వాడిని లెక్క చెయ్యలేదు పున్నయ్య, ఏదో సాధించినంత సంతోషంగా వుందతనికి. ఆ కుర్రాడి మొహంలో వెలిగిపోతున్న ఆనందాన్ని తనివిదీరా చూశాడు.

"మీకు ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలీడం లేదు." అన్నాడా కుర్రాడు భక్తి భావనతో.

పున్నయ్య సిగ్గుతో తల వంచుకున్నాడు.

అతని అవతారం చూసిన ఆ కుర్రాడు పర్సులోంచి రెండు రూపాయలుతీసి ఇద్దామనుకున్నాడు మొదట, కానీ, రెండు రూపాయలు పరీక్ష ఫీజుకి మళ్ళీ సంపాదించడం అతనికంత తేలికైన పనికాదు మరి!

కష్టాల్లో వున్నవాడే. కష్టాల్లో వున్న యెదుటి మనిషిని అర్థంచేసుకో గలడు. అర్థం చేసుకుని ప్రయోజనంఏమిటి? జోగీ, జోగీ కలిస్తే బూడిదరాలినట్టు!

3

"అమ్మగారూ! అన్నపిలుపుకి, బీరువావైపు వెళ్ళబోతున్న జానకమ్మ వెనుదిరిగి చూసింది.

ఎదురుగా దరిద్ర దేవతలా నిలుచున్న గౌరినీ చూడగానే మొహం చిట్లించుకుంటూ, చేతిలోవున్న పదిరూపాయల నోట్ల కట్టల్ని కిటికీ పక్కనేవున్న బీరువాలో పెట్టి తాళం వేసింది.

తరవాత, "ఏమిటే? ఏం కావాలి?" అని కసురుకుంది.

"ఏభై రూపాయలుంటే ఇవ్వండమ్మగారూ! బిడ్డకి కడుపులో పేగులు మెలిపడ్డాయిట. ఆపరేషన్ చెయ్యాలన్నారు డాటారు." అంది గౌరి నసుగుతూ.

"డబ్బు చూడగానే ప్రతివాళ్ళకీ ఏదో ఒక నెపం పుట్టుకొచ్చేస్తుంది!" అంది జానకమ్మ మెటికలు విరుస్తూ.

"నెల నెలా జీతంలో పటుకోండమ్మ గారూ! అవతల పసిబిడ్డ ప్రాణం...." అంటున్న గౌరి మాటలకి అడ్డుపడి.

"నీ బిడ్డ ప్రాణంకాదు గానీ, మా ప్రాణాలు తీస్తున్నావు. ఆమధ్య కాన్పుకని ఇరవై రోజులు నువ్వు పన్లోకి రాకున్నా, ఓ చీరా, పూర్తి జీతం ఇచ్చినందుకు బాగా అలుసు తీసుకుంటున్నావు. మాకు మాత్రం డబ్బు తేరగా వస్తోందనుకున్నావా?

రేపు అమ్మాయీ, అల్లుడూ వస్తున్నారు. ఎంత ఖర్చు ....ఎంత ఖర్చు! ఇప్పుడేమీ ఇవ్వలేను. విసిగించక వెళ్లు?" అంటూ అక్కణ్నించి వెళ్ళబోయింది జానకమ్మ.

"అమ్మగారు....దయచేసి...."

గౌరిని మాట్లాడ నివ్వలేదామె. "ఇదిగో చూడు. ఆ విషయంమీద ఇక విసిగించక! అంత భరించలేని వాళ్ళు పిల్లల్నెందుకు కనడమో!" అంటూ విస విసా లోపలికెళ్ళిపోయింది.

"మీవంటి వాళ్ళకింద పనిమనుషులుగా బ్రతకడానికి!" అందామనుకుంది గౌరి, ఆవేశంతో.

కానీ, ఆ మాటలు పైకి వెలువరించడానికి ఆ పేదదాని పెదాలు సహకరించలేదు!

నిరాశా, నిస్పృహలతో ఆమె నవనాడులూ, జవసత్వాలూ సత్తువని కోల్పోయాయి. చంటిదాన్ని భుజాన వేసుకుని, మరతిప్పిన బొమ్మలా అడుగులువేస్తూ వచ్చిన దారిపట్టింది.

4

చీకటి పడుతుండగా గుడిసెకు తిరిగివచ్చిన పున్నయ్యకి ఓమూల ఒదిగి కూర్చుని కనిపించింది గౌరి. ఆమె ముందు వెక్కిళ్ళు పెడుతూ, బాధతో మెలితిరుగుతోంది పసికందు.

ఆ పసికందుని కూడా పట్టించుకోకుండా అలా కూర్చునున్న పెళ్ళాన్ని చూసేసరికి, తను జేసిన వెధవ పని ఆమెకు తెలిసి పోయిందేమో అన్న భయం కలిగింది పున్నయ్యకు.

అంతవరకూ మౌనంగా, మోకాళ్ళ మీద గెడ్డం ఆన్చి, శూన్యంలోకి చూస్తున్న గౌరి, మెల్లిగా తల తిప్పి అతని వైపు చూసింది.

ఆ చూపుల్లో దైన్యం! నిస్సహాయత. ఆమె ఏమీ అనకపోయేసరికి ధైర్యం చిక్కి—"ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయిందే గౌరీ!" అన్నాడు పున్నయ్య నూతిలోంచి పలికినట్టు.

గౌరి నవ్వింది, విషాదంగా.

"మీ అమ్మగారు ఏమందే?" అడిగాడు పున్నయ్య.

తల అడ్డంగా తిప్పింది గౌరి. ఆమె చూపులు - బాధతో అటూ ఇటూ పొర్లుతున్న బిడ్డవైపు మళ్ళాయి. మనసు ఈదురు గాలికి వేపరెమ్మ ఊగినట్టు ఊగిపోయింది.

హఠాత్తుగా ఆమె కళ్ళల్లో ఏదో పరిష్కార మార్గం పొడసూపినట్టు తళుక్కుమంది కాంతి రేఖ!

అతి కష్టం మీద కంఠం పెగుల్చుకుని, "మావాఁ!" అంది.

"ఏంటే?" ఆమె ఏం చెబుతుందోనని కుతూహలంగా చూశాడు పున్నయ్య.

"నేను పని జేస్తున్న ఇల్లు నీకు బాగా తెలుసు కదూ?" అడిగింది గౌరి.

పున్నయ్య తలూపాడు.

"ఆ ఇంట్లోని కుడివైపు గదిలో, ఊచలూడి పోయిన కిటికీ వుంది. ఆ కిటికీ పక్కనే ఓ బీరువా వుంది...." అంటూ క్షణం ఆగింది గౌరి.

పున్నయ్య వింతగా చూస్తున్నాడు ఆమెవైపు.

రుద్ధమైన కంఠంతో వాక్యం పూర్తిజేసింది గౌరి..... "అందులో పదిరూపాయల నోట్ల కట్టలున్నాయి?" అని ఇక పున్నయ్యవైపు చూడలేక, చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

అంతవరకూ ఆమె హృదయంలో గూడు కట్టుకుని వున్న కన్నీరు ఉబికి ఉబికి లావాలా రాసాగింది బైటికి.

పున్నయ్య క్షణంపాటు స్తబ్దుడై పోయాడు! గౌరి అన్న మాటల్లోని అర్థం ఏమిటో క్షణంలోఅర్థమైందతనికి.

ఆమె పనికెళ్ళే ఇల్లు.

ఆ ఇంటి కుడివేపు గదిలో, ఊచలూడిన కిటికీ.

ఆ కిటికీ పక్కన బీరువా.

ఆ బీరువాలో పది రూపాయల నోట్ల కట్టలు.

వాటిని దొంగిలించాలి తను!

ఇదిగౌరి సలహా! తనచేత దొంగతనం మాన్పించిన గౌరి సలహా!

జీవితంలో ఎన్నడూ సువ్వగింజంత కన్నీటి బొట్టు రాల్చని పున్నయ్య కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ముని పంటితో అతికష్టం మీద దుఃఖాన్ని ఆపుకుంటూ, గౌరి తల మీదికి చెయ్యి పోనిచ్చాడు.

"ఊరుకో గౌరీ! ఊరుకో! మన్లాటోళ్ళు ఎంత నీతిగా బతుకుదా మనుకున్నా ఈ లోకం అందుకు సాయపడదే! దర్మాసుపత్రిలోని ఆ ధర్మరాజు, ముక్కు పచ్చలారని పసి బిడ్డ మీద జాలిపడుంటే, ఇనప్పెట్టిలో లక్షలు మూలిగే మీ యజమానురాలు నిన్ను కనికరించి వుంటే, మనకీ పాడు ఆలోచన వచ్చేదా?

మనం పేదోళ్ళమే. మన్నెవ్వరూ కనికరించరు. విధి సేతిలోనూ, సాటి మణుషుల సేతిలోనూ మనం బొమ్మ లమే! కీలు బొమ్మలం!!"

***

సహజ నటన—?

షూటింగ్ జరుగుతున్నది ముమ్మరంగా.

రచయిత, డైరక్టర్ హీరోయిన్‌కి విషాద సన్నివేశంలో ఎలా నటించాలో సూచనలు యిచ్చి 'స్టార్ట్' అన్నారు.

హీరోయిన్ అద్భుతంగా ఏడ్చింది. 'కట్' అన్నా యింకా ఏడుస్తూనే ఉంది.

"అమ్మా! ఈ సీన్ అయిపోయింది. యింక ఏడుపు ఆపండి," అన్నాడు డైరక్టర్.

"చూశారా! నా రచనా ప్రతిభ! పాత్రలో ఆమె ఎంతగా లీనమయిపోయిందో! ఇంకా ఏడుపు వస్తూనే ఉంది." అన్నాడు గర్వంగా కవి.

హీరోయిన్ నీరసంగా ఏడుస్తూ అంది—

"హీరోగారి కాలిక్రింద నా పాదం యిందాకటి నుంచి నలిగిపోతుందండి!"

—డాక్టరు ప్రభాకర్, తిరుచ్చి-14.

"డియర్ ఫ్రెండ్స్! నా ఆహ్వానాన్ని అందుకుని మీరు ముగ్గురూ సమావేశానికి హాజరయినందుకు నా కృతజ్ఞతలు" అని అందరి ముఖాల్లోకి చూసేడు విక్రమ్.

డేవిడ్, డేనియల్, దేశాయ్—ముగ్గురూ ఆతృతగా విక్రమ్ మొహంలోకి చూస్తున్నారు. అతనేం చెబుతాడా అని.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మనం యింత వరకు లెక్కకు మిక్కిలి అయిన నేరాలు, ఘోరాలుచేసేం

వాటి అన్నిటికన్నా పెద్దది ఇప్పుడు నేను చెప్పబోయే విషయం 'రిస్క్' ఎక్కువ. ప్రాణాలకు సహితం తెగించి ఈ ఆపరేషన్‌లో పాల్గొనాలి. మీరందరూ అందుకు యిష్ట పడితే ఆ వివరాలు తెలియజేస్తాను." అన్నాడు విక్రమ్, అభిప్రాయంకోసం అందరిముఖాల్లోకి మరోసారిచూస్తూ.

"ఇంతకాలం మనమంతా ప్రమాదాలతో ఆడుకున్నాం. ఇంకా చెప్పాలంటే, అందులోనే బ్రతుకుతున్నాం. ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఎన్నో నేరాలూ, ఘోరాలూ చేసామేగాని, భయపడలేదెన్నడూ. ఇప్పుడు మాత్రం వెనుకడుగు ఎందుకు వేస్తాం? ఎలాంటి నేరం చేయడానికయినా సిద్ధమే" అన్నాడు డేవిడ్ కలగజేసుకుంటూ.

"యస్. హియీజ్ కరెక్ట్" అని డేవిడ్‌ని సమర్థించేడు డేనియల్. మిగిలిన దేశాయ్‌కూడా తలవూపేడు. విక్రమ్ సంతృప్తిగా తలపంకించేడు.

"వెరీగుడ్! మనపరిస్తాన్ దేశంనుంచి బయలుదేరే ఓ విమానంతో మనకు పనిబడింది."

"విమానంతోనా? ఇంతకుముందు పేపర్లో చదివాను. చైనీస్ ఎవరో, జపనీస్ తాలూకు విమానాన్ని 'హైజాక్' చేసి, బ్లాక్‌మెయిల్ చేసేరని చూసేను. మనదీ అటువంటి ప్రయత్నమేనా?" అని అడిగేడు డేవిడ్.

"కాదు. హైజాకింగ్ అంటే మాటలుకాదు. దానికి ముందు చాలా పథకం వేయవలసివుంది. పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలి. అవన్నీ చేయడానికి మనకు వ్యవధిలేదు. పైగా మనకు అనవసరం."

"హైజాకింగ్ కాకపోతే—విమానంతో మనకేమిటి పని?"

"పనిలేకుండా విక్రమ్ ఎన్నడూ ఏపనీ తలపెట్టడు. నాకు అందిన సమాచారం ప్రకారం రేపు పరిస్తాన్‌నుంచి బయలుదేరే విమానంలో ఇండియన్ ఏజంట్ రవీంద్ర వెళుతున్నాడు. అతను తిన్నగా ఇండియా వెళుతున్నాడు. వట్టి చేతులతో కాదు, శత్రుగూఢచారుల గుండెలుచీల్చి దక్కించుకున్న అమూల్యమైన ఫార్ములా పత్రాలను అతనివెంట తీసుకువెళుతున్నాడు. ఆ పత్రాలను చేజిక్కించుకుంటే మనం కోటీశ్వరులౌతాం."

"వండ్రఫుల్ అయిడియా! కాని మనం అనుకున్నంత సులభంగా, తేలికగా ఆ పని జరుగుతుందా?" దేశాయ్.

"జరిగితీరుతుంది. సులభం కాకపోయినప్పటికీ విక్రమ్ తలచుకుంటే అవుతుంది. విమానంలో ప్రవేశించడంవరకే మనకు కష్టం. ఆ తర్వాత పరిస్థితిని అదుపులో పెట్టుకోవడం మనచేతుల్లోవుంది. ప్రయాణీకుల్ని బెదిరించి నోరు మెదపకుండాచేస్తే మనపని మరీ సులభమవుతుంది. రవీంద్రకూడా మన నలుగుర్నీ చూసేక ఎదిరించాలనే పిచ్చి ప్రయత్నం చేయడు. చేస్తే అతనికి భూమ్మీద నూకలు చెల్లిపోతాయి," అన్నాడు విక్రమ్.

"అనుభవంలేని విషయంలో తల దూరుస్తున్నామని పిస్తుంది. మరోసారి ఆలోచిస్తే బావుంటుంది," అన్నాడు డేనియల్.

"అనుభవం మాట అలావుంచు. ప్రయాణీకులను బెదిరించడం మాటలుకాదు. విమానం అన్నాక కనీసం యాభై అరవై మంది ప్రయాణీకులు ఉంటారు. వాళ్ళందర్నీ బెదిరించి చెప్పుచేతుల్లో ఉంచుకోవడమెలా? వాళ్ళందరూ కలసికట్టుగా తిరగబడితే?" అన్నాడు డేవిడ్.

"పిట్టలు రాలినట్టు రాలిపోతారు! తిరగబడే ప్రశ్నే లేదు. ఒకవేళ ఎవరయినా అటువంటి పిచ్చిప్రయత్నంచేస్తే వాడిశవమే ప్రయాణీకులకు దర్శనమిస్తుంది. ప్రయాణీకులతోగాని, విమానంతోగాని మనకెటూ పనిలేదు. మనకు కావలసిందల్లా రవీంద్రదగ్గిరున్న ఫార్ములాలు. కాబట్టి ప్రయాణీకులు మన జోలికిరారు. అయినా మన నలుగురు చేతుల్లో పిస్తోలుండగా ప్రయాణీకులు మనల్ని ఎదిరించరు. ఎదిరించి కోరి చావుతెచ్చుకోరు" అన్నాడు విక్రమ్.

"పిస్తోల్లా? అదెలా సాధ్యం? కస్టమ్స్‌వారి చెకింగ్ ఉంటుంది కదా?" అనడిగేడు డేనియల్.

విక్రమ్ చిత్రంగా నవ్వేడు. "కస్టమ్స్‌వారి చెకింగ్ చేసినా బయటపడనిచోటులో మన పిస్తోల్లు వుంటాయి. బూటు అడుగునవున్న డొల్లలోవున్న పిస్తోల్ని కనిపెట్టడం చాలా కష్టం."

"ఈమధ్య కస్టమ్స్ వారేదో కొత్తరకమైన యంత్రాన్ని ప్రవేశపెట్టేరు. ఆ యంత్ర సహాయంతో ఎవరే ఆయు ధాన్ని ఎక్కడ దాచినా తెలిసిపోతుందని నేనామధ్య పేపరులో చదివేను. ఒకవేళ ఆ యంత్రం మన ఆయుధాలను బయటపెడితే జీవితకాలం జైల్లో మ్రగ్గిపోవలసిందే."

దేశాయ్ కళ్ళలో బెదురు కనిపించింది.

"కస్టమ్స్‌వారి ఆధునిక యంత్రానికి అందకుండా ఒక ప్రత్యేకమైన 'మెటల్'తో పిస్తోల్లు తయారు చేయబడితే? బయటపడే ఆలోచనకు స్వస్తిచెప్పండి. అవసరమైన ఏర్పాట్లన్నీ నేను ముందే చేసేను," అన్నాడు విక్రమ్ ధైర్యాన్ని నూరిపోస్తూ.

"అయితే మేం సిద్ధంగా వున్నాం" అన్నారు ముగ్గురూ ఒకేసారి.

"ఇక్కడున్న మేప్‌ని నేను పరిశీలించేను. దాన్నిబట్టి ఆ విమానం మంచు సముద్రం మీదుగా ప్రయాణిస్తుందని తెలుస్తోంది. మంచు సముద్రం విస్తీర్ణం రెండువందల మైళ్ళు వుంటుంది. అంటే విమానవేగాన్ని బట్టి గంటసేపు మంచు సముద్రం మీదుగా ప్రయాణిస్తుందన్న మాట. ఈ గంటలో మనపని పూర్తి చేసుకోవాలి...." చెప్పాడు విక్రమ్.

2

ఇంకో గంటలో విమానం బయరుదేరుతుంది.

ఆరోజు ప్లైట్‌లో ప్రయాణించబోయేవాళ్ళు ముందుగా కస్టమ్స్ ఆఫీసులోకి వెళుతున్నారు. అనుకున్న ప్రకారం విక్రమ్ బృందం మారువేషాల్లో వేర్వేరుగా ఎయిర్‌పోర్ట్ చేరుకున్నారు. అయిదేసి నిమిషాల వ్యవధిలో ఒక్కొ

క్కారూ కస్టమ్స్ ఆఫీసులో అడుగు పెట్టేరు.

ఇటీవల జరుగుతున్న హైజాకింగ్స్‌వలన కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చెకింగ్ మహా పటిష్టంగా వుంది. కస్టమ్స్ ఆఫీసులో హడావుడి చూసేక విక్రమ్‌కి ఏమీ అనిపించక పోయినా, అతని బృందానికి గుండెలు సన్నగా వణికేయి.

ముగ్గురు కస్టమ్స్ అధికారులు, మరో ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ ఆఫీసరు ప్రయాణీకుల్నీ, వారి సామానుల్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అంతేగాకుండా తలుపు బయట యిద్దరు సెక్యూరిటీ గార్డులు కూడా వున్నారు ముందు జాగ్రత్త కోసం.

విక్రమ్ తన బ్రీఫ్‌కేస్ నిర్లక్ష్యంగా టేబిల్‌మీద పెట్టాడు. కస్టమ్స్ ఆఫీసర్ అతని ముందుకి రావడంతోనే, బ్రీఫ్‌కేస్ తాళం తీసి మూత తెరిచి పెట్టేడు. ఒక షర్టు, పాంటు, కట్ డ్రాయర్, టెర్లిన్ బనియన్స్, షేవింగ్ బాక్స్, టూత్‌బ్రష్, పేస్ట్, ఏదో ఫైలు, బ్రీఫ్‌కేస్ లైనింగ్ క్లాత్ క్రిందున్న భాగాన్ని జాగ్రత్తగా చూసిన తర్వాత తృప్తిగా తల పంకించి మూతవేసేడు కస్టమ్స్ ఆఫీసర్.

బ్రీఫ్‌కేస్ సరిగ్గా మూతవేసి, తాళం వేసి కదలబోతుండగా "వెయిట్ ఏ మినిట్ ప్లీజ్!" అంటూ మరో కస్టమ్స్ ఆఫీసర్ అతన్ని సమీపించేడు.

విక్రమ్ గుండె దడదడలాడింది. తను పట్టుబడిపోతున్నాడా? కాకపోతే ఎందుకాగమన్నట్టు?

పట్టుబడితే తను పిచ్చివేషాలు వేసి తప్పించుకునే వీలుండదు. తను అనుచరులందరితోనూ ఎదిరించినా ప్రయోజనం వుండదు. ఒకవేళ పారిపోయే ప్రయత్నం

చేస్తే పిచ్చికుక్కను కాల్చిపారేసినట్టు కాల్చిపారేస్తారు సెక్యూరిటీ గార్డ్సు.

"మీకు యిదివరకు విమాన ప్రయాణానుభవం లేదనుకుంటాను.... రెండో చెకింగ్ మీ బట్టల్లో!" అన్నాడు ఆ కస్టమ్స్ ఆఫీసర్ నవ్వుతూ.

విక్రమ్ గుండె కుదుటపడింది.

"సారీ!" అన్నాడు మొహం మీద నవ్వు పులుముకుని.

"నెవర్ మైండ్!" అంటూ ఆఫీసర్ డ్యూటీ ప్రారంభించేడు. బుట్టలాగ వున్న విక్రమ్ జుట్టులోనికి చేతిని పోనిచ్చి తడిమి చూసేడు. అలా కాలరు దగ్గర్నుంచి అడుగున వున్న పాంట్ ఫోల్డింగ్‌వరకు అంగుళం అంగుళం చొప్పున వెదికేడు. అతనికేమీ కనిపించలేదు.

ఎవరో ప్రయాణీకుడి దగ్గర స్మగుల్డ్‌గూడ్సు దొరికేయి. అతన్ని ఎక్స్‌ప్లనేషన్ అడుగుతున్నారు అధికారులు. అతనివేపు చూసేడు విక్రమ్. ఎక్స్‌ప్లనేషన్ యివ్వడానికి ఇబ్బంది పడుతున్నట్లుగా మొహం పెట్టేడు అతను.

"ఇక నేను వెళ్ళవచ్చా?" అనడిగేడు విక్రమ్.

"జస్ట్ వెయిట్" అంటూ విక్రమ్‌ని ఓ మిషిన్ దగ్గరకు తీసుకు వెళ్ళేడు. "ప్లీజ్ స్టెప్ ఆన్ దిస్ మిషిన్" అన్నాడు కస్టమ్స్ ఆఫీసర్.

విక్రమ్ ఆ మిషిన్‌వేపు పరీక్షగా చూసేడు. దేశాయ్ చెప్పిన మిషిన్ అదేనని గ్రహించేడు. ఇందాక ప్రయాణీకుని దగ్గరున్న స్మగుల్డు వస్తువుల్ని బయటపెట్టినది ఈ మిషినేనని గ్రహించడానికి విక్రమ్‌కి ఎక్కువసేపు పట్ట లేదు.

ఆధునిక యంత్రం మీద నిలిచింది విక్రమ్ దృష్టి. అది చూడ్డానికి బరువు చూసుకునే యంత్రంలాగుంది. దేశాయ్

చెప్పిన తర్వాత ఆ యంత్రం గురించి వివరాలు సేకరిం చేడు తను. శరీరంమీద ఏ రకమైన లోహమున్నా వెంటనే రెడ్ బల్బు వెలుగుతుంది. డేంజరస్ అలారమ్ కూడా మ్రోగుతుంది. పిస్తోళ్ళు, కత్తులు, బంగారం ఎలాంటి లోహాన్నయినా, ఎంత చిన్న మొత్తంలో ఎక్కడ దాచి వుంచినా పసిగడుతుంది.

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్న సామెత గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు విక్రమ్. మిషిన్ ఎక్కేడు.

రెడ్‌బల్బు వెలగడంగాని, డేంజరస్ అలారమ్ మ్రోగడంగాని జరగలేదు.

ఒక నిమిషం తర్వాత మిషిన్ మీదనుంచి దిగేడు.

"సారీ ఫర్ ది ట్రబుల్! నౌ యు కెన్ గో" ఆఫీసరు మాటలు విని విక్రమ్ హృదయం తేలికపడింది.

విక్రమ్ సన్నగా నవ్వి, బ్రీఫ్‌కేస్ తీసుకుని విమానం వేపు నడిచేడు.

"ఇదివరకెప్పుడూ ఇంత స్ట్రిక్టు చెకింగ్ లేదు" అని డేనియల్ విసుగ్గా అంటున్న మాటలు విక్రమ్ చెవిలో పడ్డాయి. విక్రమ్ వెనక్కి తిరిగి చూసేడు. డేనియల్‌ని కూడా విక్రమ్‌లాగే చెక్ చేస్తున్నారు.

"అవును. ఇప్పుడు విమానాల్లో హైజాకింగ్స్ ఎక్కువైనాయి. అందువలనే కట్టుదిట్టాలు పెరిగేయి. ప్రయాణీకుల క్షేమం కోసమే ప్రభుత్వం ఈ ఏర్పాటు చేసింది" అన్నాడు కస్టమ్స్ ఆఫీసర్.

ఎన్ని కట్టుదిట్టాలు చేస్తేమాత్రం ఇప్పుడు తన పథకం పారడంలేదూ? కొన్ని గంటల్లో తను విమానంలో చేయ

బోతున్న సాహసం సామాన్యమైనదా? అనుకుని పాసింజర్స్ లౌంజ్‌లోనికెళ్ళి నిలుచున్నాడు విక్రమ్.

తర్వాత తన బృందం ఒక్కొక్కరుగా కస్టమ్స్ ఆఫీసులోంచి బయటికి వస్తూండడం కనిపించింది. తను తల పెట్టిన పని అంతవరకు సక్సెస్‌అయినందుకు ఆనందించేడు.

ఇంతలో ఎనౌన్సర్ గొంతు మైక్‌లోంచి తీయగా విన్పించసాగింది, ప్రాంతీయ భాషల్లో.

ఫ్లయిట్ కదలబోయే సమయం, ఆసన్నమయిందని పాసింజర్లని ప్లేన్‌లో వెళ్ళి కూర్చోమని ఫ్లయిట్ నంబరు, అది వెళ్ళేప్రదేశాలతోసహా ఎనౌన్సర్‌వివరంగా చెబుతోంది.

లాడర్ మెట్లమీదుగా విమానంలోకి వెళ్ళేడు విక్రమ్. దబ్బపండులాంటి ఛాయతో మెరిసిపోతూ, తీయటి గొంతుతో చిరునవ్వులు చిందిస్తూ ఎయిర్‌హోస్టెస్ ప్రయాణీకులకు స్వాగతం పలుకుతోంది. విక్రమ్ ఆమె వేపు ఓ చిరునవ్వు పారేసి, విమానంలోకి అడుగు పెట్టేడు.

రవీంద్ర కోసం అతని చూపులు గాలించేయి. రవీంద్ర ఏ వేషంలో వున్నా విక్రమ్ తెలుసుకోగలడు. అదే విక్రమ్‌లోని గొప్పతనం. ఇండియన్ ఏజంట్‌గా రవీంద్ర చేసిన సాహస కృత్యాలు విన్నాడు. అతని ఫోటో పేపర్లో చూసేడు.

"ఎమర్జన్సీ ఎగ్జిట్" దగ్గరలో వున్న సీట్లో కూర్చుని వున్నాడు రవీంద్ర. అతని భుజం మీద తల వాల్చుకుని నిద్రపోతుందేమో-మరో యువతి అతని ప్రక్కన కూర్చుంది.

రవీంద్రకి రెండు వరుసలు వెనుకగా విండో ప్రక్కగా వున్న సీట్లో కూర్చున్నాడు విక్రమ్. అదే అతనికి 'ఎలాట్' చేయబడిన సీటు!

అప్పటికి అతని బృందం కూడా లోపలికి చేరుకుంది.

సీటు వెనక్కి జేరగిలబడి సిగరెట్ వెలిగించేడు విక్రమ్. టైమ్ చూసుకున్నాడు. ప్లేన్ ఎన్ని గంటలకు బయల్దేరేదీ, దానివేగం ఎంతో, అది సరిగ్గా ఎన్ని గంటలకు మంచు సముద్రం మీదకు చేరుకుంటుందీ—అన్నీ వివరంగా మరోసారి ఆలోచించి, ప్లాన్ పటిష్టం చేసుకున్నాడు.

కొద్ది నిమిషాల్లో విమానం బయల్దేరబోతుందనీ గనుక సీటు బెల్ట్సు తగిలించుకోమనీ చెప్పింది ఎయిర్ హోస్టెస్.

విక్రమ్ కిదేం కొత్త కాదు. సీటు బెల్టు కట్టుకుని సిగరెట్ ఏష్‌ట్రేలో పడేసి, విండోలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

రన్‌వే వదిలి విమానం గాలిలోకి లేచింది.

3

ఇంజన్ మ్రోతలోని చిత్రమైన ధ్వనులు వింటూ కూర్చున్నాడు రవీంద్ర.

విమానం వేగంగా ముందుకు దూసుకుపోతూంది.

విమానం ఎయిర్‌పోర్టుని వదిలి అరగంటకు పైగా అయింది. ప్రయాణీకులు ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. ఎయిర్ హోస్టెస్ చిరునవ్వులు చిందిస్తూ ఎవరికి కావలసినవి వారికి అందిస్తూంది.

విండోలోంచి బయటికిచూసేడు రవీంద్ర. వాతావరణం ప్రశాంతంగావుంది. మేఘాలు వేగంగా వెనక్కి దాటిపోతున్నాయి. ఉదయం పదకొండు గంటలవేళ కాబట్టి కొంచెం ఎండ ఎక్కువే పడుతుంది మేఘాల పైన.

అది అంతర్జాతీయ విమానం కావడంవల్ల చాలా ఎత్తుగా ప్రయాణిస్తోంది. పల్లెలు చిన్నగా, తెల్లగా కని పిస్తున్నాయి. పెద్ద పెద్ద పట్టణాలు రంగుల మయంగా అగుపిస్తున్నాయి.

రవీంద్ర ప్రక్కనే కూర్చున్న రోషన్. రవీంద్ర భుజాన్ని ఆనుకుని మగత నిద్రలో మునిగిపోయింది.

రవీంద్రకు చాలా ఆనందంగా ఉంది. ఇంకా కొన్ని గంటల్లో తన మాతృభూమి అయిన ఇండియాలో అడుగు పెట్టబోతున్నాడు. తనకే కాదు, స్వస్థలంమీద అడుగుపెట్ట బోతున్న ఎవరికేనా ఆనందంగా వుంటుంది మరి! అందరి లాగా కాకుండా తనలో ఓ ప్రత్యేకత. మామూలు మను షులు స్వదేశానికి తిరిగి రావడంలేదు. తనలాంటి సి.బి.ఐ. ఏజంట్స్ తిరిగి రావడం వేరు.

సి. బి. ఐ. ఏజంట్స్ ఆపరేషన్ రెస్క్యూలో ప్రయా ణించడం వరకే చెప్పగలరు. అటుపైన దైవాధీనం. ప్రాణాలమీద ఆశవదులుకుని వెళ్ళవలసిందే. తను - తన ప్రాణాలను దక్కించుకోవడమే గాకుండా, శత్రువుల గుండెల చీల్చి రక్తాలు పారించి దిగ్విజయంగా తిరిగి వస్తున్నాడు. తన గుండెల్లో ఆనందం పొంగి పొరలుదూ? మనసు ఆనందంతో ఉరకలు వేయదూ?

నిద్రపోతున్న రోషన్‌ని చూసి, చిన్నగా మందహాసం గావించేడు రవీంద్ర. రోషన్ జడ్‌స్తాన్‌లో తనకెంతో సహాయం చేసింది. ఆమె సహాయం లేకపోతే తను అసలు ఆ ఫార్ములాలను తిరిగి సంపాదించేవాడా?

ఆ క్షణంలోనే గుర్తుకు వచ్చింది రవీంద్రకి, తను ప్రమాదాలకు ఎంత దగ్గరగా వున్నాడో! తన ప్రక్కనే

శత్రువులున్నారన్నా, తన ప్రక్కనే బాంబులు పేలినా ఆశ్చర్యం పోనవసరంలేదు.

కారణం — తను మామూలుగా తిరిగి రావడంలేదు— ఘన విజయంతో!

ఒట్టి చేతులతో కాదు—కోట్ల రూపాయల విలువజేసే సీక్రేట్ ఫార్ములాలతో!!

రవీంద్ర గుండె దడదడ లాడింది. ప్రమాదాలు పొంచి కూర్చున్నాయేమో?

ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం తన ఒడిలోవున్న బ్లాక్ బ్రీఫ్ కేస్‌ను మరింత ముందుకు లాక్కున్నాడు. అందులోనే వున్నాయి సీక్రెట్ ఫార్ములాస్! జడ్‌స్తాన్‌లో అవి సంపాదించి ఎలాగో తాము పరిస్తాన్ చేరుకున్నారు. పరిస్తాన్ ప్రభుత్వ సహాయంతో ఇప్పుడు ఇండియా వెళ్తున్నారు.

ఈ సూట్ కేస్‌ను ఇండియా చేర్చేవరకు తనకు నిద్రాహారాలు లేకపోయినా ఫరవాలేదు. అంతవరకు అప్రమత్తతగా ఉండాలి. ఎందరో దుండగులు దీన్ని తిరిగి కాజేయాలని ప్రయత్నిస్తూండవచ్చు. కాని అది వారి చేతికి చిక్కకూడదు. చిక్కితే, తను చేసిన సాహసాలూ, ఎదు

రొక్కన్న ఘోరప్రమాదాలూ నిష్ప్రయోజనం—నిరర్థకం!
అందుకే ప్రాణాలకు తెగించైనా సరే ఈ ఫార్ములాలు ఇండియా చేర్చాలి. పి. బి. ఐ. డైరెక్టర్ శివరామ్‌గారికి అందజేస్తే అంతటితో తన బాధ్యత తీరిపోతుంది. హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు' మనసులో మరోసారి అనుకున్నాడు రవీంద్ర.

రేడియం డైల్ వాచీ చూసేడు రవీంద్ర. పన్నెండు కావస్తుంది. ఇంకో గంటలో 'లిబియా' చేరుకోవచ్చు. అక్కడ్నుంచి ఒక గంటసేపు విమానం మంచు సముద్రం మీదుగా ప్రయాణిస్తుంది.

జడ్‌స్తాన్ సీక్రెట్ బ్రాంచ్‌లో రోషన్ ఒక ప్రముఖ గూఢచారిణి! ఆ విషయాన్ని విస్మరించి, తనకు సహాయ పడింది. రోషన్ తనకు సహాయపడిన సంగతి సీక్రెట్ బ్రాంచికి తెలిస్తే ఆమెను ముక్కలుముక్కలుగా నరికి హింసిస్తారు. జడ్‌స్తాన్ హింసకు వినియోగించే పద్ధతులు తనకు తెలియనివి కావు. ఎలాగూ తెలియక తప్పదు. అందుకే రోషన్ తనవెంట రావడానికి, తన దేశపౌరత్వం తీసుకోవడానికి సిద్ధపడింది.

"వాట్ డియర్! ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" రోషన్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ అడిగింది.

ఉలిక్కిపడి చూసేడు రవీంద్ర, ఆలోచనల నుండి తేరుకుని.

"మా గ్రాండ్‌ఫాదర్ నా కోసం వెయిట్‌చేస్తూంటారు. అదే ఆలోచిస్తున్నాను...." అని నవ్వేడు రవీంద్ర.

"గ్రాండ్‌ఫాదరా? ఇంతకుముందు ఎవరూ లేరన్నావుగా" అర్థంకానట్టు మొహం పెట్టింది.

"మా డైరెక్టర్ శివరామ్‌గారి గురించి చెబుతున్నాను" అన్నాడు మెల్లగా. "దేవుడిదయవల్ల ఈ 'రెస్క్యూ' జయప్రదంగాముగిసింది. ఈ బ్రీఫ్‌కేస్‌ని మా డైరెక్టర్‌గారికి అందజేస్తే సరి. అంతటితో నా బాధ్యత తీరిపోతుంది" చెప్పేడు రవీంద్ర.

మౌనంగా ఆలకించింది రోషన్.

రవీంద్ర ఎంతపెద్ద 'రెస్క్యూ' తీసుకున్నాడో తనకు తెలియనిది కాదు.

డేంజరస్ ఆపరేషన్!

ప్రాణాలతో చెలగాటం!!

రవీంద్ర ఒడిలోవున్న బ్రీఫ్‌కేస్ వేపొకసారి చూసి, తృప్తిగా నిట్టూర్చింది రోషన్.

ఆ బ్రీఫ్‌కేస్ భారతదేశానికి చేరుస్తే చాలు. భారతదేశం సంపూర్ణంగా భాగ్యవంత దేశమయిపోతుంది.

ప్రొఫెసర్ జ్ఞానేశ్వరసింగ్ పరిశోధనలకు సంబంధించిన ఫార్ములాలు బ్లూప్రింట్స్ వున్నాయి బ్రీఫ్‌కేస్‌లో!

సంవత్సరం క్రితం ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్‌సింగ్ సముద్రగర్భంలో లభ్యమయ్యే ఒక రకమైన యిసుకను, అణుశక్తిద్వారా బంగారంగా మార్చవచ్చునని గ్రహించేడు. అతని మేధాశక్తి నంతటినీ ఉపయోగించి పరిశోధన కుపక్రమించేడు. అతని పరిశోధనలు ఫలించేయి. భారత దేశానికి మంచిరోజులు రాబోతున్నాయనుకుంటుండగా, అంతలోనే ఘోరం జరిగిపోయింది.

ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్‌సింగ్ పరిశోధనలను గురించి తెలుసుకున్న జడ్‌స్తాన్ ఏజెంట్లు సింగ్‌కి డబ్బుఆశ చూపేరు-పదవుల ఆశ చూపేరు. కాని జ్ఞానేశ్వర్‌సింగ్

అలాంటి మాటలకు లొంగలేదు. దేశద్రోహానికి పాల్పడను అని ఖచ్చితంగా చెప్పేసేడు. చేసేదిలేక జ్ఞానేశ్వర్‌సింగ్‌ని దెబ్బతీసి, ఫార్ములాలను ఎత్తుకుపోయేరు. లేబరేటరీని బాంబులతో ధ్వంసంచేశారు.

"డియర్! ఆవేశంలో నేను నీతో రావడానికీ, మీదేశ పౌరత్వం తీసుకోవడానికి సిద్ధపడి వచ్చేసేను. ఈ విషయంలో నేను శత్రుదేశ గూఢచారిణినన్న సంగతి మర్చిపోయేను. నాకు మీదేశ పౌరసత్వం లభిస్తుందంటావా?" అంది రోషన్.

"అఫ్‌కోర్స్! మా దేశ పౌరసత్వం నీకు లభించాలంటే కొన్ని ఫార్మాలిటీస్ వున్నాయి....వాటిని సక్రమంగా నిర్వర్తిస్తేనేగాని మా దేశపౌరసత్వం లభించదు. అందులోనూ నీవంటి శత్రుదేశ గూఢచారిణిలకు అంత సులభంగా పౌరసత్వం లభిస్తుందనుకోను" అన్నాడు విండోలోంచి బయటికి చూస్తూ.

నిరాశగా నిట్టూర్చింది రోషన్.

"తెలుసు డియర్! ఈ వృత్తిలో వున్నవాళ్ళు కొన్ని సమయాల్లో మనసును పూర్తిగా చంపుకోక తప్పదు" అంది బాధగా.

రవీంద్రతో వుండాలని రోషన్ కోరిక. జడ్‌స్తాన్‌లోనే యిద్దరి మనసులు కలుసుకున్నాయి. రోషన్‌కి భారతదేశం పౌరసత్వం ఇవ్వడానికి నిరాకరిస్తే, అప్పుడు రవీంద్రకు అదొక సమస్య అయి కూర్చుంటుంది.

"మామూలు మనుషులు అయితే ఏదోలా ప్రయత్నించి పౌరసత్వం పొందవచ్చు. కాని గూఢచారిణిల విషయమైతే భారీఎత్తున ప్రయత్నాలు చేయవలసి వుంటుంది.

ప్రయత్నాలు చేసినా ఫలితముంటుందని నమ్మలేక పోతున్నాను" అన్నాడు రవీంద్ర.

ఆ మాటలకు రవీంద్రవేపు తిరిగి చూసింది రోషన్.

"అయితే, మనం విడిపోక తప్పదన్న మాట!"

రోషన్ కంఠస్వరంలో ధ్వనించిన విషాదానికి కొద్దిగా చలించేడు రవీంద్ర.

"డోంట్‌వర్రీ రోషన్! ఎంత కష్టమైనా సరే ప్రయత్నిస్తాను. ప్రయత్నించడమే కాదు-మా దేశపౌరసత్వం నీకు లభించేలా చేస్తాను. ఈ ఫార్ములాలను సంపాదించడంలో నువ్వు తీసుకున్న రిస్కునీ, నువ్వు చేసిన సహాయాన్ని మా దేశం తప్పక గుర్తిస్తుంది" అన్నాడు.

రవీంద్ర మాటలకు రోషన్ కళ్ళు మిలమిలలాడేయి.

"థాంక్యూ ఫర్ యువర్ కైండ్‌నెస్ డియర్!" అంది.

ఇంతలో ఇంటర్ ఎడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఎయిర్ హోస్టస్ కంఠస్వరం, వాళ్ళ సంభాషణకు అంతరాయం కలిగించింది.

"జంటిల్మెన్! వాతావరణం సరిగ్గా లేనందువలన మనం గమ్యం చేరుకోవడం ఒక గంట ఆలస్యం జరుగుతుంది. సారీ ఫర్ ది యిన్‌కన్వీనియన్స్."

ఎనౌన్స్‌మెంట్‌ను విన్న రోషన్, రవీంద్ర భుజంమీద ఒరిగిపోతూ—

"మనల్ని విడదీయడం వాతావరణానికి కూడా ఇష్టం లేనట్లుంది డియర్" అంది మెల్లగా.

నవ్వుకున్నాడు రవీంద్ర.

అతని దృష్టి అంతా తన ఒడిలోవున్న బ్లాక్‌బ్రీఫ్‌కేస్ మీదేవుంది. ఆలస్యం జరుగుతున్న కొద్దీ బ్రీఫ్‌కేస్ బరువు పెరుగుతున్నట్టుగా అనిపిస్తోంది అతనికి.

4

విమానం మంచుసముద్రం మీదకు వచ్చింది.

రోషన్ విండోలోంచి క్రిందకు చూడసాగింది. రవీంద్ర, రోషన్ భుజంమీదనుంచి క్రిందకు చూసేడు. నేల తెల్లగా, అందంగా కన్పిస్తుంది. అక్కడక్కడ మంచుకొండలు. కాని నీరులాగా లేదు. మంచు సముద్రం ఆరునెలలపాటు ఎడారిలాగా, మిగిలిన ఆరు నెలలపాటు సముద్రంలాగా వుంటుందని రవీంద్ర ఏదో పుస్తకంలో చదివేడు. అందుకే రవీంద్రకు ఆశ్చర్యమనిపించలేదు.

స్పీకర్లోనుండి జుఁమ్ మంటూ శబ్దం వినిపించ సాగింది. అందరూ తలలుతిప్పి స్పీకర్ వేపు చూడసాగేరు. మైక్ లో విమానం కేప్టెన్ గొంతు వినిపించింది.

"ఎటెన్షన్ ప్లీజ్! దిసీజ్ యువర్ కేప్టెన్ రాంసింగ్. అయామ్ ఎక్స్ట్రీమలీ సారీ టు ఇన్ఫారమ్ యూ దట్ ది ఏరోప్లేన్ ఖ్యూజ్ నాట్ ఇన్ గుడ్ కండిషన్...."

రవీంద్ర, విక్రమ్ బృందాలతోపాటు ప్రయాణీకులందరి గుండెల్లోనూ రాయి పడింది. గుండెల్లో దడ ప్రారంభమైంది.

"విమానం కంట్రోల్ తప్పింది. విమానాన్ని కంట్రోల్ చేయడానికి మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఎందుకేనా మంచిది—కేబిన్ దగ్గరున్న పారాచూట్స్ తలా ఒకటి దగ్గరుంచుకోండి. మళ్ళీ అయిదు నిమిషాల తర్వాత మీకు నా గొంతు వినిపిస్తుంది" అంటూ ముగించేడు కెప్టెన్.

విక్రమ్ తన బృందానికి తలవూపి సైగచేసేడు. నలుగురూ ఒకేసారి నిలబడ్డారు.

నిలబడ్డ నలుగురూ రవీంద్ర దృష్టిలోపడ్డారు. మనసులో ఏదో అనుమానం పొడసూపింది.

నలుగురి చేతులూ బూటు అడుగున తడిమి, క్షణంలో బయటికి వచ్చేయి.

రవీంద్ర అనుమానం నిజమైంది.

ఇప్పుడు వారి చేతుల్లో నిప్పులు గ్రక్కడానికి సిద్ధంగా వున్న రివాల్వర్స్ ప్రత్యక్షమయ్యేయి.

నల్లగా నిగనిగలాడుతూ, ఆవురావురుమంటూ చూస్తున్నాయి.

రవీంద్ర ముందుకి రాసాగేడు విక్రమ్, విషపునవ్వు చిందిస్తూ.

అదిరిపడ్డాడు రవీంద్ర.

ఎవరీ దుండగులు? పిస్తోల్లెందుకు తీసినట్టు? తన దగ్గిర ఫార్ములాస్ వున్నాయని వీరికెలా తెలిసింది? జడ్స్తాన్ సీక్రెట్ బ్రాంచికి చెందిన మనుషులా? కాకూడదు. తనను పట్టుకునే దశలో లేరు వాళ్లు. పరిస్తాన్ దేశానికి చెందినవాళ్లు? వాళ్ళే అయితే తను ఇంతదూరం ఫార్ములాస్‌తో రాలేడు. తను వారి సహాయాన్ని కోరినప్పుడే తనను బంధించి, ఫార్ములాస్‌ని హస్తగతం చేసుకుని వుండేవారు. మరెవ్వరు?

విక్రమ్ గొంతు విమానమంతటా ఖంగుమంది.

"ప్రయాణీకులందరికీ హెచ్చరిక! ఎవరికీ హాని తలపెట్టడం మా ధ్యేయంకాదు. అలాగని మాకు అడ్డుతగిలిన వార్ని వదిలిపెట్టమని లేదు. అడ్డంవస్తే కాల్చి, శవాన్ని మంచు సముద్రం మీదకు విసిరేస్తాం. ఆ శవానికి మంచే సమాధి కడుతుంది."

ఉన్నట్టుండి ప్రయాణీకుల్లో ఒక వ్యక్తి విసురుగా లేచి దేశాయ్‌మీద విరుచుకుపడ్డాడు.

నిర్దాక్షిణ్యంగా నాలుగు పిస్తోళ్ళూ గర్జించేయి ఒకేసారి!

అంతే! గుండె పట్టుకుని కూలిపోయేడు. రక్తపు మడు

గులో కాసేపు కాళ్ళూ చేతులు కదిలించేడు. మరు నిమిషంలో అతని ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయేయి.

మరణించిన వ్యక్తివేపు జాలిగా చూసేడు రవీంద్ర.

అందరూ భయభ్రాంతులతో విక్రమ్ బృందంవేపు చూడ సాగేరు. కొందరు ఏడుపును ఆపుకోలేక పూర్తికాని స్తున్నారు. మరికొందరు చేతులెత్తి భగవంతుడిమీద భారంవేస్తున్నారు.

"ఖబాడ్డార్! ఎదురు తిరిగిన మనుషులకు ఇదే గతి పడుతుంది. గుర్తుంచుకుని మా పనికి అడ్డు తగలకండి....మా పని మేం చేసుకుపోతాం" విక్రమ్ మరోసారి హెచ్చరించాడు.

నిశ్శబ్దం!

రవీంద్ర ముందుకివచ్చి ఆగేడు విక్రమ్. కంట్రోల్ రూమ్, కేబిన్‌లను మిగిలిన అనుచరులు వశపరుచుకున్నారు, తుపాకులతో!

"మిస్టర్ రవింద్రా! మర్యాదగా మీ బ్రీఫ్‌కేస్ అప్పగించండి. లేకపోతే మీకూ చావుతప్పదు" అన్నాడు విక్రమ్.

"ఎవరు మీరు? నా బ్రీఫ్‌కేస్‌తో మీకేంపని?" అనడిగేడు ధైర్యం తెచ్చుకుని.

"రోషన్ అతని ప్రక్కనే నిలుచుని పరిస్థితిని గమనిస్తోంది. తప్పించుకునే మార్గంకోసం ఆలోచిస్తోంది.

ప్రయాణీకులందరూ రవీంద్రవేపు జాలిగా చూడసాగేరు.

అతనికి భూమిమీద నూకలు చెల్లిపోయేయని వారందరి నమ్మకం. అందరి ముఖాలు రక్తం లేనట్టుగా తెల్లగా పాలిపోయేయి. ఎదురు తిరిగితే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతారన్న భయంతో బిక్కచచ్చిపోయి వున్నారు.

"అదంతా నీకనవసరం మిస్టర్ రవీంద్రా! వెంటనే మీ బ్రీఫ్‌కేస్ మా హస్తగతం చేయండి చాలు. లేదంటే, మీ

ప్రాణాలు తీసయినా స్వంతం చేసుకుంటాం" బెదిరించేడు.

"నా బ్రీఫ్ కేస్‌లో ఒక జత బట్టలుతప్ప యింకేం లేవు. అది మీకెందుకు?"

"మమ్మల్ని అంత తక్కువగా అంచనా వేయకు రవీంద్రా! అందులో కోట్ల రూపాయల విలువజేసే సీక్రెట్ ఫార్ములాస్ ఉన్నాయనీ, జడ్‌స్తాన్ గూఢచారి మిస్టర్ ఫాక్స్‌ని దెబ్బతీసి వాటిని తీసుకు వస్తున్నావనీ, పరిస్తాన్ ప్రభుత్వం నీకు సహాయపడిందనీ మాకు తెలుసు. ఇక నీ అమాయకత్వాన్ని కట్టిపెట్టు." ఆశ్చర్యపోయాడు రవీంద్ర.

"ఇవన్నీ మాకెలా తెలిసేయని ఆశ్చర్యపోతున్నావా? నువు కొట్టిన దెబ్బనుండి కోలుకోగానే, మిస్టర్ ఫాక్స్ జడ్‌స్తాన్ సరిహద్దుల్లోంచి నువ్వు తప్పించుకోకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేసేడు. కాని అదృష్టవశాత్తూ అప్పటికే నువ్వు సరిహద్దులు దాటిపోయేవు. నీ వెంటబడి, మళ్ళీ ఫార్ములాస్ దక్కించుకోవాలనుకున్నాడు. కాని పరిస్తాన్ ప్రభుత్వం ఇందులో జోక్యం కలిగించుకోవడంతో మిస్టర్ ఫాక్స్ వెనక్కి తగ్గేడు. ఎలాగైనా ఆ ఫార్ములాలు చేజిక్కించుకోమనీ, కోట్లు గుమ్మరిస్తామనీ అక్కడ్నుంచి నాకు వార్త పంపించేడు. ఫలితంగా నువ్వు మా చేతిలో చిక్కేవు—ఫార్ములాలతో సహా!"

ఇంతలో—

గగన తలంలో ప్రశాంతంగా పయనిస్తున్న విమానం పూనకం వచ్చినదానిలా వూగిపోసాగింది.

ప్రయాణీకులు ఏం జరిగిందో తెలియక, ఈ ఆకస్మిక పరిణామానికి హాహాకారాలు గావించేరు.

రవీంద్ర బ్రీఫ్ కేస్‌ను మరింత గట్టిగా గుండెకు హత్తుకున్నాడు.

రోషన్ అయోమయంగా చూసింది.

ఏం జరిగిందో తెలియక ప్రయాణీకులు హడలిపోతు న్నారు.

వెనక్కు ముందుకు తూలిపడుతున్నారు.

మామూలు ప్రయాణీకులతోపాటు విక్రమ్ బృందం కూడా మొగ్గలేస్తూంది.

నిలదొక్కుకోవడం కష్టంగా వుంది.

"జంటిల్మెన్! విమానం కంట్రోలు తప్పింది. హరి యప్!....వివరాలుచెప్పే వ్యవధిలేదు. కేబిన్ దగ్గర పారా చూట్స్ అందుకుని బైటపడండి...." ఆందోళనగా అరి చింది ఎయిర్‌హోస్టస్?

ఆ మాటలను వింటూనే ప్రయాణీకుల మొహాలు మృత్యుభయంతో పాలిపోయేయి.

కొందరు వణికిపోయేరు.

మరికొందరు ఘొల్లుమన్నారు.

వీటిని గమనించే స్థితిలో లేడు రవీంద్ర.

ఎయిర్‌హోస్టస్ హెచ్చరికను వినగానే, చివాల్న తన సీటులోనుండి లేచి కేబిన్ దగ్గరకు వెళ్ళేడు. పారాచూట్‌ని తీసి రోషన్ దగ్గరికి వచ్చేడు.

"కమాన్ డియర్! నన్ను గట్టిగా పట్టుకో...." ఎమర్జన్సీ ఎగ్జిట్ దగ్గరకు వెళ్ళి అన్నాడు.

రోషన్ మారు మాట్లాడకుండా రవీంద్రను గట్టిగా కౌగలించుకుంది.

రవీంద్ర ఏం చెప్పబోతున్నాడో ఆమెకు తెలుసు.

అతని ప్రయత్నాన్ని వారించబోయిన విక్రమ్ తలపై బ్రీఫ్‌కేసుతో బలంగా మోదాడు. ఆ దెబ్బకు కుప్పలా కూలి పోయాడు విక్రమ్.

బ్రీఫ్‌కేస్‌ను ఎడంచేత్తో గట్టిగా పట్టుకుని, కుడిచేత్తో పారాచూట్‌ని పట్టుకుని 'ఎమర్జన్సీ ఎగ్జిట్' గుండా పైటకు దూకేడు రవీంద్ర. ఆ వెనువెంటనే పారాచూట్‌ని 'రిలీజ్' చేసేడు.

రవీంద్ర గాలిలో తేలిపోసాగేడు.

రవీంద్ర ప్లేన్‌లోనుండి దూకిన మరుక్షణం, విమానం ఏటవాలుగా వెళ్ళి ఎక్కడో కూలిపోయింది. రవీంద్ర ఆ దృశ్యం చూస్తూనే ప్రమాన్పడిపోయేడు. రోషన్ భయంగా కళ్లు మూసుకుంది.

పారాచూట్ మెల్లమెల్లగా క్రిందకు దిగసాగింది.

5

మెల్లగా కళ్ళు తెరిచింది రోషన్.

కాళ్ళక్రింద మంచుగడ్డలాగ చల్లగావుంటే క్రిందకు చూసింది.

క్రిందంతా మంచు!

చుట్టూ చూసింది.

ఎటువేపు చూసినా—అంతా మంచుమయం!

కనుచూపుమేరలో ఎక్కడా మట్టినేల కనిపించలేదు.

మంచుమీదనుంచి వీస్తున్న గాలి ఒంటికి తగిలి గజగజ వణికింపజేస్తోంది.

పారాచూట్ విప్పుకుంటూ, రెండడుగుల దూరంలో కనిపించేడు రవీంద్ర.

"మైగాడ్! మనం ఎక్కడకు చేరుకున్నాం?"

భయంగా ప్రశ్నించింది. ఆమె గొంతు కీచుగా పలికింది.

రవీంద్ర వెంటనే జవాబు చెప్పలేదు.

అతను దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ముఖం గంభీరంగా వుంది.

రవీంద్రవేపు అడుగులు వేసింది. ఆమె పాదాలు మంచులో కూరుకు పోతున్నాయి.

"డియర్! ఇప్పుడు మనమెక్కడున్నాం?" రవీంద్ర భుజంమీద చెయ్యివేసి, గట్టిగా కుదుపుతూ అడిగింది.

ఆలోచనలనుండి బైటపడి రోషన్ వేపొకసారి చూసేడు.

"దీనినే మంచు సముద్రం అంటారు. దక్షిణాఫ్రికాకు దూరంగా వున్నాం...."

"మంచు సముద్రమా?" ఆశ్చర్యంగా అడిగింది.

రోషన్ గుండెలు వేగంగా కొట్టుకోసాగేయి. శరీరం సన్నగా వణక సాగింది.

మంచు సముద్రం గురించి పేపర్లలో ఎప్పుడో చదివింది రోషన్.

"చెప్పు డియర్! మనం నిజంగా మంచు సముద్రం మీదే వున్నామా?" నమ్మలేనట్టుగా అడిగింది.

గంభీరంగా తల పంకించేడు రవీంద్ర.

"మంచు సముద్రం గురించి తెల్సినవాళ్ళు చాలా తక్కువ. ప్రపంచ నైసర్గిక స్వరూపం తెలిపిన చరిత్ర కారులు ఈ మంచు సముద్రం గురించి వెలువరించిన విషయాలు చాలా భయంకరమైనవి. అంటార్కిటిక్ ఖండంలోనిది ఈ మంచు సముద్రం...." అన్నాడు తన చుట్టూవున్న మంచును చూస్తూ.

అప్పటికే మంచు చల్లదనంవల్ల యిద్దరి కాళ్ళూ పూర్తిగా తిమ్మిరెక్కాయి.

రోషన్ పరిస్థితి దుర్భరంగా వుంది. చల్లదనానికి నరాలు జివ్వుమంటూ నిలబడ నివ్వడంలేదు.

రోషన్ దుస్థితిని గమనించి, చేతిలోని బ్రీఫ్‌కేస్‌ను



మంచుమీద వుంచేడు. దానిమీద నిలబడింది రోషన్. కృతజ్ఞతగా రవీంద్రవేపు చూసింది.

రవీంద్రకూడా బ్రీఫ్‌కేస్ మీదకు వచ్చి నిలబడ్డాడు.

అది వాటర్‌ప్రూఫ్, హీట్‌ప్రూఫ్ బ్రీఫ్‌కేస్. స్పెషల్‌గా తయారుచేయబడినది గనుక ఎంత బరువైనా తట్టుకోగలదు__మోయగలదు.

ఊపిరి బరువుగా విడుస్తోంది రోషన్.

ఆమె విడిచిన వూపిరి రవీంద్ర శరీరాన్ని తాకుతోంది.

వాచీ చూసేడు రవీంద్ర.

సాయంకాలం మూడు గంటలు! సూర్యరశ్మి సోకని ప్రదేశం గావడంవల్ల చీకటి పడినట్టుగా వుంది.

చలి! ఒళ్ళంతా చల్లబడుతోంది. ఎముకలు కొరికేస్తున్నట్టుగా వుంది.

బ్రీఫ్‌కేస్ మీద ఇద్దరు నిల్చోవడం కష్టమనిపించింది రవీంద్రకి. మరికొంచెం దగ్గరగా జరిగి, రోషన్ నడుం చుట్టూ చేయివేసేడు,

"డియర్! మన విమానం ఏమైంది? మనతోపాటు మరెవరూ విమానంలోంచి బయటపడలేదా?" అనడిగింది రోషన్.

"మనం దూకినవెంటనే విమానం కూలిపోయింది. ప్రయాణీకులందరూ మరణించి వుంటారు. మనం పులి నోట్లోనుండి సింహం నోట్లో పడినట్లయింది" అన్నాడు విమానంలో ఫార్ములాలకోసం ప్రయత్నించిన బృందాన్ని తలచుకుని.

"అయితే మనం ఇక్కడ్నుండి బయటపడే మార్గమే లేదా?" ఆందోళనతో అడిగింది. ఎటుచూసినా మంచు మాత్రమే కనబడటంతో రోషన్‌లో పిరికితనం చోటు చేసుకుంది.

రవీంద్ర, రోషన్ ప్రశ్నకు జవాబుగా పెదవి విరిచేడు.

"నాగరిక ప్రపంచానికి దూరంగావున్న మంచు సముద్రం యిది. మానవమాత్రులకుగాని, జంతువులకు గాని నివాసయోగ్యంకాదు. భయంకరమైన సహారా ఎడారులకన్నా ఈ మంచు సముద్రం ప్రమాదకరమైనది."

"మనం ఈ మంచులో సమాధి కావలసిందేనా?" విచారంగా అడిగింది.

రోషన్ ప్రశ్నకు బరువుగా నిట్టూర్చేడు రవీంద్ర.

"అదే ఆలోచిస్తున్నాను. నాకు తెలిసినంతవరకూ ఈ మంచు సముద్రంనుండి బయటపడటం యింపాజిబుల్. బయట ప్రపంచంనుండి సహాయం లభిస్తే బయటపడడానికి అవకాశముంది. కాని అంతవరకు మన ప్రాణాలు నిలుస్తాయన్న నమ్మకమేమిటి? ఇప్పటికే ఒళ్ళంతా తిమ్మిరెక్కి గడ్డకట్టుకుపోతోంది. మనం బ్రతికి బయటపడ్డా, లేకున్నా ఏదోలా ఈ బ్రీఫ్‌కేస్‌ను నాదేశానికి ఎలాగైనా చేర్చాలి.

దట్స్ మై డ్యూటీ" ధృఢమైన కంఠస్వరంతో అన్నాడు.

విపత్కర పరిస్థితిలో కూడా తన డ్యూటీ గురించే ఆలోచించే రవీంద్రను మనసులోనే అభినందించింది.

"ఈ బ్రీఫ్‌కేస్‌ను మనం భారతదేశానికి చేర్చాలంటే, మనం బ్రతికి బయటపడనిదే ఎలా సాధ్యం? ఈ మంచు సముద్రం బారినుండి మనల్ని రక్షించేదెవరు?" అంది రోషన్.

రోషన్ చెప్పింది నిజమనిపించింది.

ఇక్కడ్నుండి బయటపడితేగాని ఫార్ములాలు క్షేమంగా ఇండియా చేరవు. లేకపోతే, ఈ మంచు తమ యిద్దరి శరీరాలతోపాటు, ఫార్ములాస్‌కి కూడా సమాధి కడుతుంది.

జేబులోనుండి సిగరెట్ పాకెట్‌ను తీసేడు.

బ్యాడ్ లక్!

రెండు సిగరెట్లు మాత్రమే వున్నాయి.

ఒకటి రోషన్‌కి ఇచ్చి, తనొకటి వెలిగించుకున్నాడు.

పొగ వెచ్చగా, గుండెలోకి జారబడేసరికి 'రిలీఫ్' దొరికినట్లయింది.

ఆలోచనలు దాడిచేయడం ప్రారంభించేయి.

బ్రీఫ్‌కేస్‌ను తన దేశానికి చేర్చాలి?

ఎలా? ఎలా??

తీవ్రంగా ఆలోచించసాగేడు.

రవీంద్ర మస్తిష్కంలో మెరుపు మెరిసింది.

ఆ మెరుపులో ఒక నిర్ణయం—

ఆ నిర్ణయం భయంకరమైనదే!

అయినా, తప్పదు.

తామిద్దరూ ఈ మంచు సముద్రం బారినుండి తప్పించు

కోవాలన్నా, ఏదోవిధంగా ఈ ఫార్ములాలు ఇండియా చేర్చాలన్నా అదొక్కటే మార్గం.

అందుకోసం—తను తీసుకున్న నిర్ణయం భయంకరం, ప్రమాదకరం అయినప్పటికీ అమలుచేయక తప్పదు.

"రోషన్! నీ గొలుసు లాకెట్‌లో మినియేచర్ వైర్‌లెస్ వుందికదూ?" అడిగేడు.

తలాడించింది.

"ముందు మీ హెడ్‌క్వార్టర్స్‌తో కాంటాక్టుచేసి మన విషయం చెప్పు."

"మా హెడ్‌క్వార్టర్స్‌కా?" ఆశ్చర్యంగా నోరు తెరిచింది రోషన్.

రోషన్ అనుమానం గ్రహించేడు రవీంద్ర.

"అవును రోషన్, ప్రస్తుతం మనకి అంతకంటే గత్యంతరంలేదు. ఏదోవిధాన మనం బ్రతికి బయటపడాలంటే, ఇలాంటి సాహసం చేయకతప్పదు."

"వాళ్ళువచ్చి మనల్ని రక్షిస్తారంటావా?" క్లుప్తంగా పెదవి విరిచింది రోషన్.

"అనవసరమైన అనుమానాలతో కాలయాపన చెయ్యకు రోషన్! హరియప్! ముందు మనం యిక్కడినుండి బయటపడగలిగితే, ఆ తర్వాత పరిస్థితులను ఎదుర్కొనవచ్చు."

రోషన్ మరేం మాట్లాడలేదు.

"దక్షిణాఫ్రికాలోని అంటార్కిటిక్ మంచు సముద్రంలో వున్నట్టు మెసేజ్ పంపించు. ఇండియన్ ఏజంట్ రవీంద్ర నిన్ను బలవంతంగా తీసుకుపోతున్నాడనీ, వెంటనే వస్తే అతని ప్రాణాలతోపాటు, ఫార్ములాలు కూడా చేజిక్కించుకోవచ్చు అని చెప్పు" అన్నాడు.

లాకెట్‌ను జాగ్రత్తగా ఓపెన్‌చేసి, వైర్‌లెస్‌లో హెడ్‌క్వార్టర్స్‌ను కాంటాక్టు చేసింది.

పదినిమిషాల తర్వాత రెస్పాన్స్ వచ్చింది.

రవీంద్ర చెప్పమన్నట్లుగా మెసేజ్ పంపించింది.

దీర్ఘంగా నిట్టూర్చేడు రవీంద్ర.

6

పొద్దు వాలుతోంది.

చలి పెరుగుతోంది. చీకటి అలుముకుంటోంది.

మంచుగాలికి చలితో శరీరం వణుకుతుంది.

రవీంద్ర చలిని తట్టుకోలేకపోతున్నాడు. ఇక రోషన్ సంగతి సరేసరి!

"మైగాడ్! మీ హెడ్‌క్వార్టర్స్‌నుండి హెల్ప్ వచ్చేలోగా ఈ చలికి మనం కొయ్యబారి పోవచ్చును...." అన్నాడు రవీంద్ర.

భయంగా చూసింది రోషన్.

"హెల్ప్ వచ్చేలోగా మనం కొయ్యబారి పోకుండా వుండాలంటే ప్రస్తుతం మనకు ఒకే మార్గం వుంది." అంటూ రోషన్ నడుంచుట్టూ చెయ్యిపోనిచ్చి, గట్టిగా ఆమెను హత్తుకున్నాడు. రోషన్, రవీంద్ర భుజాలచుట్టూ చేతులు బిగించింది.

రోషన్ వక్షోజాలు రవీంద్ర గుండెను దొలుస్తున్నయ్.

వేడి వూపిరిని విడుస్తున్నారిద్దరూ.

శరీరంలో వేడి రగిలింది.

ఆ వేడి, చలిని ఆపలేక పోతోంది.

మరింత గట్టిగా పెనవేసుకు పోయేరిద్దరూ. ఇద్దరిమధ్యా గాలికూడా చొరనంత దట్టంగా అల్లుకుపోయేరు.

చలి తగ్గినట్టయింది. వణుకు ఇంతకుముందులా తీవ్రంగా లేదు.

ఎదురుగా, దూరంగా, నీలం—ఆకు పచ్చ రంగులతో పచ్చని నేలలూ కనిపించింది రోషన్‌కి.

ఆశగా అటువేపు చూసి, రవీంద్రను మోచేత్తో ఆ దిక్కుగా చూడమన్నట్టుగా పొడిచింది.

ఆకు పచ్చని నేలవేపు చూసేడు రవీంద్ర.

"డియర్! అక్కడ నేలవుంది. పదపోదాం" అంది రోషన్.

పేలవంగా నవ్వేడు రవీంద్ర.

ఆ తర్వాత తల అడ్డంగా ఆడించేడు.

"అది నీ భ్రమ రోషన్! నేలంటూ యిక్కడవుండదు. అంతా మంచుమయం. నీకు కనిపిస్తున్నది నేల కాదు. అవి 'చలి మావులు'. ఎడారిలో ప్రయాణించే వారికి 'ఎండ మావులు' కనిపిస్తాయి. ఏమీ లేనిచోట నీరు వున్నట్లుగా కన్పించే భ్రమే ఎండ మావులు. ఇక్కడకూడా అటువంటి భ్రమలే కలుగుతుంటాయి" వివరించేడు.

చేతి వాచీవేపు చూసేడు రవీంద్ర. ఆ తరువాత తమ కాళ్ళక్రింద వున్న బ్రీఫ్‌కేస్‌ను చూసేడు.

అందులో, అమూల్యమైన ఫార్ములా అనామకంగా వుంది.

ఆ ఫార్ములా వెలుగుచూడాలి. తన దేశానికి చేరాలి.

అదే తన ధ్యేయం!

"హెలికాప్టర్‌లో మీ వాళ్ళు మనకోసం వెతుకుతూ బయలుదేరి వుంటారు. ఈ మంచు సీమలో వాళ్లు మన వునికిని కనిపెట్టడం కష్టమే" దిగులుగా అన్నాడు.

అతనికేం చేయాలో తోచడంలేదు.

ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొని, ఫార్ములాలను సంపాదించేడు. కాని ఏం లాభం? చివరి క్షణాల్లో—తన దేశాన్ని చేరుకోబోతున్న తరుణంలో అకాల అవాంతరం!

ఆలోచనలతో తల బ్రద్దలవుతోంది.

ఎలాగైనా, ఫార్ములాలను తన దేశానికి చేర్చాలి.

సరిగ్గా అదే సమయంలో, ఆకాశంలో ఏదో శబ్దం వినిపించ సాగింది.

రవీంద్ర దృష్టి, రోషన్ గౌనుమీద పడింది. హఠాత్తుగా మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"రోషన్! నీ గౌను విప్పు."

పింక్ కలర్‌లోవున్న రోషన్ గౌనునుచూస్తూ అన్నాడు.

రవీంద్ర మాటలకు వులిక్కిపడింది రోషన్.

"వాట్డూయూ మీన్...." కళ్ళెర్రజేసింది.

"అపార్థం చేసుకోవద్దు. ఈ పరిస్థితుల్లో అంతకన్నా గత్యంతరం లేదు. నీ గౌను పింక్ కలర్‌లోవుంది, దానిని గాలిలో వూపుతూంటే, హెలికాప్టర్‌లోని వాళ్ళ దృష్టిని మనం ఆకర్షించ వచ్చును...."

రవీంద్ర మాటల్ని అపార్థం చేసుకున్నందుకు నొచ్చుకుంది రోషన్.

"క్విక్! బహుశా ఆ శబ్దం హెలికాప్టర్‌దే కావచ్చు...." అన్నాడు.

రోషన్ చకచక గౌనుబటన్స్ విప్పి, గౌనును రవీంద్ర చేతిలో పెట్టింది.

ఆమె ఒంటిమీద చిన్న కట్‌డ్రాయర్ మినహా మరేం లేదు. పాలరాతి విగ్రహంలాగ, కొణార్కలోని శిల్పంలాగ వుంది రోషన్.

రోషన్ నగ్న సౌందర్యానికి ఆశ్చర్యపోయేడు రవీంద్ర. మరుక్షణంలో కర్తవ్యం గుర్తుకువచ్చి, గౌనును గాలి లోకి వూపుతూ, ఆకాశంలోకి చూడసాగేడు.

ఆకాశంలో హెలికాప్టర్ ఆకారం కూడా కనిపించడం లేదు.

శబ్దాలు యెక్కువయ్యేయి.

అదేసమయంలో—

ఈదురు గాలి హెచ్చింది.

హెలికాప్టర్ రొద!—హోరుమంటూ గాలి తెరలు!!

రోషన్, రవీంద్ర ఆకాశంలోకి కళ్లు చించుకుని చూస్తున్నారు. హెలికాప్టర్‌కోసం—ఆశగా.

కాని హెలికాప్టర్ యెక్కడా కనిపించ లేదు.

మరి ఆ శబ్దం ఏమిటి?

చూస్తుంటే హెలికాప్టర్ శబ్దం కాదనిపిస్తోంది.

అయితే....? అప్పుడు గుర్తుకు వచ్చింది రవీంద్రకి.

"మైగాడ్! హెయిల్ స్టార్మ్!! మంచు తుఫాన్!!!"

రవీంద్ర గుండెలు వెయ్యిమైళ్ళ వేగాన కొట్టుకున్నాయి. రోషన్ విపరీతంగా బెదిరిపోయింది.

7

మంచు తుఫాన్ బారినుండి బయటపడడం అసాధ్యమని రవీంద్రకి తెలుసు. ఆ మంచు సముద్రంలో తాము మంచు సమాధి కావటం ఖాయం అనుకున్నాడు.

గండం గడిస్తే చాలనుకుని రోషన్‌ద్వారా మెసేజ్ పంపించేడు. కాని, హెలికాప్టర్ వచ్చేలోపల ఈ మంచు తుఫాన్ తమను బలి తీసుకునేట్టు కనిపిస్తోంది.

హెలికాప్టర్ వస్తుందన్న ఆశ సన్నగిల్లుతోంది.

అంతలో ఏదో చప్పుడు వినిపించింది. గిర గిర తిరిగే

ప్రొపెల్లర్స్ గాలిని చీలుస్తున్న చప్పుడు. హెలికాప్టర్ ఎగురుతున్నప్పుడు వినబడే శబ్దం. ఇద్దరిలో నూతనోత్సాహం పెల్లుబికింది.

చటుక్కున తల పైకెత్తి ఆకాశంలోకి చూసేరిద్దరూ. పింక్ కలర్ గౌనుని మరింత గట్టిగా వూపేడు రవీంద్ర. హెలికాప్టర్ మెల్లగా క్రిందకు దిగుతూ, భూమికి పాతిక అడుగుల యెత్తులోకి వచ్చింది. దాని మీద జడ్‌స్తాన్ సింబల్ కనిపించింది రవీంద్రకి.

ఉన్నట్టుండి హెలికాప్టర్‌లోంచి ఏవో జారిపడ్డాయి.

మరుక్షణం—

ధాం!!! బాంబులు పేలిన శబ్దం!

"రోషన్! రన్ అప్. పైనుంచి బాంబులు వేస్తున్నారు" గట్టిగా అరిచి రవీంద్ర బ్రీఫ్‌కేస్ పట్టుకుని పరిగెత్తేడు. రోషన్ అతన్ని అనుసరించింది.

వెనుక బాంబులు పడుతున్న శబ్దం....బాంబులు పడిన చోట పెద్ద పెద్ద గోతులేర్పడుతున్నాయి. మంచు విరజిమ్మబడుతోంది.

బాంబులుపేలుతున్న శబ్దంతోపాటు ఎక్కడో దూరంగా మరో శబ్దం .... ప్రొపెల్లర్స్ గిర గిర తిరుగుతున్న చప్పుడు.

పరిగెడుతూ ఆగి చూసేడు రవీంద్ర.

ఆకాశంలో మరో హెలికాప్టర్ ప్రత్యక్షమైంది. దాని మీద ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గుర్తులు కనిపిస్తున్నాయి.

రవీంద్రకి వెర్రిగా అరవాలనిపించింది. పిచ్చి ఆనందం కలిగింది.

ఇండియన్ హెలికాప్టర్ రాకను కనిపెట్టిందేమో, జడ్‌స్తాన్ హెలికాప్టర్ వెనక్కి తిరిగి పలాయనం చిత్తగించింది.

ఇండియన్ హెలికాప్టర్ మంచు నేలమీద దిగింది, రోషన్‌తో బాటు హెలికాప్టర్ ముందుకు పరిగెత్తేడు.

"కమాన్ మై బాయ్! క్విక్, హెయిల్ స్టార్మ్ యీజ్ కమింగ్...."

సి.బి.ఐ. డైరక్టర్ శివరామ్‌గారి గొంతు వినిపించింది, హెలికాప్టర్‌లో నుండి!

రవీంద్ర, రోషన్ హెలికాప్టర్‌లోకి యెక్కి కూర్చున్నారు. క్షణంలో పైకి లేచింది. పైనుండి క్రిందకు చూసేడు రవీంద్ర.

మంచు పర్వతం బ్రద్దలైనట్టు, క్రింద మంచు తుత్తునియలై యెగురుతోంది. కెరటాల్లా లేచిపడుతోంది మంచు.

ఒక్క అయిదునిమిషాలు ఆలస్యమైతే, జిడ్‌స్తాన్ హెలికాప్టర్ బాంబుల బారినుండి తప్పించుకున్నా, మంచు తుఫాన్ నుండి తప్పించుకోవడం సాధ్యపడేది కాదు.

గండం గడిచినందుకు తృప్తిగా నిట్టూర్చేడు రవీంద్ర. రోషన్ అతన భుజంమీద తలవాల్చింది.

"సర్! మీరెలా రాగలిగేరు?" కుతూహలాన్ని పట్టలేక అడిగిగేసేడు రవీంద్ర.

రోషన్ వైర్‌లైస్ ట్రాన్స్‌మీటర్‌ద్వారా పంపిన వార్త జిడ్‌స్తాన్ ఏజంట్లతో పాటు, మన సీక్రెట్ ఏజంట్స్ కూడా తెలుసుకున్నారు. అప్పటికే నేను జిడ్‌స్తాన్‌లో అడుగు పెట్టేను. మన సీక్రెట్ ఏజంట్ల ద్వారా, ఈ విషయం తెలుసుకుని, సమయానికి రాగలిగేను...." అని చెప్పేరు సి.బి.ఐ. డైరక్టర్ శివరామ్.

విహంగంలా యెగురుతూ ఢిల్లీ వేపు పయనించ సాగింది హెలికాప్టర్!

***